

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 20-2-2026 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 345 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ.2:39 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.8:07 తదుపరి రేవతి, వర్జ్యం: శేషం ఉ. 7:43, దుర్ముహూర్తం: ఉ.9:01-9:47, మ.12:52-1:38, అమృతఘడియలు: మ.3:28-5:01, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:42, సూర్యాస్తమయం: 6:15 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు



శ్రీ కుర్రా అప్పారావు గారు

గుంటూరు మార్కెట్ యార్డు కమిటి ఛైర్మన్

మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు శ్రీ కుర్రా అప్పారావు గారు
ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్‌గా నేడు ప్రమాణ స్వీకారం
చేయుచున్న శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు

ఎన్.వి.వి.యస్. వరప్రసాద్ (బుజ్జి) పెదకూరపాడు	కందిమళ్ళ రఘురామారావు మాజీ ఎంపిపి, పెదకూరపాడు	మద్దినేని వెంకట సుబ్బారావు సందెపూడి, యడ్లపాడు సొసైటీ అధ్యక్షులు	తిమ్మిశెట్టి నారాయణరావు VGT ఫరమ్	పుట్టి రామచంద్రరావు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు
తిమ్మిశెట్టి నాగేశ్వరరావు (నాగు) అయ్యప్ప చిల్లీస్ కార్పొరేషన్	లావు సుబ్బారావు	ముద్దన నాగేశ్వరరావు సర్పంచ్, జగ్గాపురం	మల్లిశెట్టి అప్పారావు	గోనుగుంట్ల శివనాగ తిరుపతిరావు
శ్యామల కిషోర్ రెడ్డి గుంటూరు	కోట సతీష్ చిల్లీస్	ప్రసాద్ ONGC చిల్లీస్	కొండ్రగుంట బుచ్చిబాబు	పుప్పాల సాయి
గాడిపర్తి జానకి రామయ్య	పాములపాటి కిరణ్	సూరపనేని శ్రీకాంత్	కొండ్రగుంట శ్రీనివాసరావు వేలూరు	యనమదల సాంబశివరావు LVR క్యాంటీన్
కోసనం జయభారత్‌రెడ్డి (JB)	మంచికలపూడి కిషోర్ కర్లపూడి : క్లస్టర్ ఇన్‌ఛార్జ్	మొగల్ సైదా (గోల్డ్) దొడ్లేరు	గంగా భరత్ కుమార్ శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్	బండారు రామారావు చంద్రిక ట్రేడర్స్, గుంటూరు
గద్దె రాము సీనియర్ టిడిపి నాయకులు, కోయవారిపాలెం	పొదిలి శ్రీనివాసరావు ప్రియదర్శిని ట్రేడింగ్ కంపెనీ	వట్టికూటి సైదారావు శరవణ్ అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్	మామిడి మోహన్‌రావు కృష్ణ బిల్డర్స్	కె. కృష్ణబాబు
చింతగుంట్ల రంగారెడ్డి	యర్రగుంట్ల నరేంద్రబాబు మండల పార్టీ మాజీ ప్రెసిడెంట్, వట్టిచెరుకూరు	పాపినేని శ్రీకాంత్	మొక్కపాటి గిరిబాబు పల్నాడు జిల్లా మాజీ అధికార ప్రతినిధి	నలజాల సదాశివరావు మండల పార్టీ మాజీ అధ్యక్షులు, క్రోసూరు

సీ-390 మిలీనియం విమానం కోసం
భారత్‌లో ఎంఆర్‌ఓ సెంటర్
మహీంద్రా-ఎంబ్రాయెర్ భాగస్వామ్యంలో ఏర్పాటు

న్యూఢిల్లీ: సీ-390 మిలీనియం రవాణా విమానాల కోసం మహీంద్రా గ్రూప్ భాగస్వామ్యంలో భారత్‌లో ఎంఆర్‌ఓ (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్ ప్రకటించింది. మీడియం ట్రాన్స్‌పోర్ట్ విమానాల (ఎంటీఏ) కొనుగోలు చేయాలనుకున్న భారత వైమానిక దళం అందుకోసం సీ-390 మిలీనియం విమానాలను ఎంపిక చేసింది. ఆ విమానాలకు స్థానికంగానే విడిభాగాలు తయారు చేయాలన్న వ్యూహంలో భాగంగా ఈ ఎంఆర్‌ఓ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించినట్టు ఎంబ్రాయెర్ తెలిపింది. సీ-390 విమానాలు దేశీయంగానే తయారుచేసేందుకు ఎంబ్రాయెర్, మహీంద్రా గత అక్టోబరులో సంతకాలు చేశాయి.

ఏటా 10 హెలీకాప్టర్ల తయారీ లక్ష్యం: ఎయిర్‌బస్

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో (టీఏఎస్ఎల్) కలిసి కర్ణాటకలోని వేమగల్‌లో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్)లో 2029 నాటికి ఏటా 10 హెచ్ 125 హెలీకాప్టర్లు తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎయిర్‌బస్ హెలీకాప్టర్ల విభాగం సీఈఓ బ్రూనో ఈవెన్ తెలిపారు. భారత మార్కెట్‌పై తాము బుల్లిష్‌గా ఉన్నట్లు బ్రూనో వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	120
వరంగల్	120	గుంటూరు	120
కరీంనగర్	120	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	110
కర్నూలు	120	నెల్లూరు	115
విశాఖపట్నం	120	అనంతపురం	115
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,56,490 ▲	1,43,450 ▲	2,65,000 ▲
విజయవాడ	1,59,000 ▲	1,47,000 ▲	2,50,000 ▲
విశాఖపట్నం	1,58,897 ▼	1,44,150 ▲	2,70,000 ▲
రాజమండ్రి	1,56,490 ▲	1,43,450 ▲	2,47,000 ▲
ప్రొద్దుటూరు	1,54,500 ▲	1,42,140 ▲	2,54,000 ▲
ముంబై	1,54,570 ▲	1,41,586 ▲	2,44,772 ▲

మార్కెట్లు ఢమాల్



సెన్సెక్స్ 1,236 పాయింట్లు డౌన్

- అదే బాటలో నిఫ్టీ ● అంతర్జాతీయ ఉద్రిక్తతలే కారణం
- రూ.7 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మళ్లీ అమెరికా-ఇరాన్ దేశాల ఉద్రిక్తతల ప్రభావం పడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తమై భారీ స్థాయిలో అమ్మకాలు సాగించడంతో సూచీలు తీవ్రంగా నష్టపోయాయి. దీంతో మూడు రోజుల లాభాలకు తెరపడింది. అమెరికా ఫెడ్ రిజర్వ్ రేట్ల కోతపై ఏర్పడిన అనిశ్చితి, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి పతనం సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయని విశ్లేషకులంటున్నారు. ఫలితంగా సెన్సెక్స్ 1,236.11 పాయింట్లు నష్టపోయి 82,498.14 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,470.05 పాయింట్లు నష్టపోయి 82,264.20 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 365 పాయింట్ల నష్టంతో 25,454.35 వద్ద ముగిసింది. ఒకపక్క అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు పెరగడంతో పాటు బ్రెంట్ క్రూడాయిల్ ధర ఈ ఏడాది గరిష్ఠ స్థాయికి చేరడంతో మార్కెట్ బేర్ పట్టులోకి జారుకుందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,79,210.1 కోట్లు నష్టపోయి రూ.4,65,22,014.57 కోట్ల వద్ద (5.13 లక్షల కోట్ల డాలర్లు) ముగిసింది.

కొంత కాలం అప్రమత్తమే

మార్కెట్లో రిస్క్ తీసుకునే ధోరణి తగ్గిందని, ఫలితంగా ప్రపంచ స్థాయిలో కమోడిటీ ధరలు ఒక శాతం వరకు పెరిగాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అన్నారు. పెరిగిన ఉద్రిక్తతలతో ఆయిల్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చన్న భయాల కారణంగా ఇన్వెస్టర్లు కొంతకాలం పాటు అప్రమత్త వైఖరి అనుసరించవచ్చని భావిస్తున్నామన్నారు.

మళ్లీ వెండి మెరుపులు

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు మరోసారి తళుక్కుమన్నాయి. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.18,000 పెరిగి రూ.2.64 లక్షలకు దూసుకుపోయింది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,950 పెరిగి రూ.1,58,650 పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) 1.03% పెరిగి 77.97 డాలర్లకు చేరింది. బంగారం ధర స్వల్పంగా పుంజుకుని 4,991.24 డాలర్లు పలికింది.

ఓపెన్ ఏఐతో టాటా జట్టు



భారత్‌లో 100 మెగావాట్ల ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి

న్యూఢిల్లీ: చాట్‌జీపీటీ సృష్టికర్త ఓపెన్‌ఏఐతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు టాటా గ్రూప్ ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో గురువారం ప్రకటించింది. ఈ బహుళ సంవత్సరాల భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తొలుత 100 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనుంది. ఈ డేటా సెంటర్ సామర్థ్యాన్ని మున్ముందు ఒక గిగా వాట్‌కు పెంచుకునేలా ఏర్పాటు చేయనుంది. భవిష్యత్ తరం ఏఐ వర్క్‌లోడ్‌ను నిర్వహించగలగడంతో పాటు భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కేంద్రం తన వంతు పాత్ర పోషించనుందని టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. అలాగే, ఈ రెండు సంస్థలు కలిసి దేశంలో ఎంటర్‌ప్రైస్ ఏఐ వినియోగాన్ని పెంచడంతోపాటు ఆయా రంగాలకు అవసరమైన ఏజెంటిక్ ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నాయి. భారత యువతకు ఏఐ టెక్నాలజీలో శిక్షణ అందించనున్నాయి.

ఏఐ చిప్‌ల తయారీలోకి టాటా

సాఫ్ట్‌వేర్ నుంచి డేటా సెంటర్ల వరకు విస్తరించిన టాటా గ్రూప్.. సెమీకండక్టర్ల తయారీలోకి అడుగు పెట్టింది. ఏఐ టెక్నాలజీ సంబంధిత అన్ని విభాగాల అభివృద్ధిపై దృష్టిసారించిన తమ గ్రూప్.. ఆయా పరిశ్రమలకు అవసరమైన ఏఐ చిప్‌లను సైతం తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. తొలుత వాహన రంగం కోసం వీటిని తయారు చేయనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. వ్యవస్థపై ఏఐ భారీ ప్రభావం చూపనుందన్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ ఏఐని వినియోగించుకుంటున్నామని అన్నారు.

ఏఐ సదస్సులో పాల్గొన్న పలువురు ఇండస్ట్రీ ప్రతినిధులు ఏమన్నారంటే..

“దిగుమతులపై ఆధారపడే బదులు భారత్ సొంత ఏఐ మౌలిక వసతులను నిర్మించుకోవాలి. ఏఐ జాతీయ సార్వభౌమాధికారాన్ని పునర్‌నిర్వచించనుంది. కాబట్టి, భారత్ తన ఏఐ భవిష్యత్‌ను సంరక్షించుకునేందుకు ఇంధనం, కంప్యూటింగ్, క్లౌడ్ మరియు సేవల్లోనూ సార్వభౌమత్వాన్ని పొందాలి.

- జీత్ అదానీ, అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఏఐ అప్లికేషన్స్‌కు ప్రపంచంలో అత్యంత అనుకూల దేశంగా మారే అవకాశం భారత్‌కు ఉంది. కానీ, ఏఐని ఎక్కడ, ఎలా ఉపయోగించుకోవాలనే ఎంపికలతోపాటు బాధ్యతాయుత వినియోగంపై దేశానికి కలిగే ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి.

- రిషద్ ప్రేమ్‌జీ, విప్రో ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్

దక్షిణ ప్రపంచంలో తొలి ఏఐ సదస్సు నిర్వహణ ద్వారా ఏఐ ప్రపంచంలో భారత్ చాలా బలమైన స్థానాన్ని ఏర్పరుచుకుంది. భారత్ సహా 14 ఆఫ్రికా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఎయిర్‌టెల్ డేటా సెంటర్లు, కనెక్టివిటీ పెంపు ఆలోచనలో ఉంది. వచ్చే 3-4 ఏళ్లలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 120 మెగావాట్ల నుంచి 1 గిగావాట్‌కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

- సునీల్ మిట్టల్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్

భారత టెక్నాలజీ రంగం సేవల వ్యాప్తి ఆధారిత వృద్ధి నుంచి ఏఐ కేంద్రీకృత, మేధస్సు నేతృత్వ, మేధో సంపత్తి(ఐపీ) ఆధారిత నమూనాకు మారాలి. కేవలం సాంకేతికతను అందజేయడం కాకుండా టెక్నాలజీ ప్లాట్‌ఫామ్స్, మోడల్స్, ప్రొడక్ట్స్ అభివృద్ధి చేసే కంపెనీలదే భవిష్యత్.

- రోష్నీ నాడార్, హెచ్‌సీఎల్ టెక్ ఛైర్‌పర్సన్”

హైదరాబాద్‌లో కాసాగ్రాండ్ మాండరిన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కాసాగ్రాండ్ రియల్టీ సంస్థ హైదరాబాద్‌లో మరో భారీ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ప్రారంభించింది. మియాపూర్‌లో 'కాసాగ్రాండ్ మాండరిన్' పేరుతో 8 ఎకరాల్లో కంపెనీ ఈ ప్రాజెక్టు చేపట్టింది. హైదరాబాద్‌లో తొలిసారిగా విల్లాలను తలపించేలా అపార్ట్‌మెంట్స్‌ను నిర్మించే తొలి ప్రాజెక్టు ఇదేనని కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు బ్లాకుల్లో 334 అల్ట్రా స్పేషియస్ త్రీ బెడ్‌రూమ్స్, ఫోర్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను ఈ ప్రాజెక్టులో నిర్మించనున్నారు. ఈ లగ్జరీ రెసిడెన్షియల్ వెంచర్‌లో ఒక్కో ఫ్లాటు కనీస ధర రూ.1.25 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. మొత్తం ఎనిమిది ఎకరాల్లో 5.7 ఎకరాలను ఓపెన్ స్పేస్‌గా వదిలేసి అక్కడ చక్కటి చెట్లు, పూల మొక్కలు పెంచుతారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 41,000 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణంలో ఐదు అంతస్తుల క్లబ్ హౌస్, 5,600 ఎస్ఎఫ్‌టీలో క్లోరిన్‌రహిత స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. వీటికి తోడు 70కి పైగా లైఫ్‌స్టైల్ సౌకర్యాలు, 25కుపైగా వెల్‌నెస్ ఫోకస్డ్ విషయాలు కాసాగ్రాండ్ మాండరిన్ ప్రాజెక్టు ప్రత్యేకతలని పేర్కొంది.

హాట్స్-డీ-ఫ్రాన్స్ రీజియన్‌తో
టీ-హబ్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టార్టప్స్ ఇంక్యుబేటర్ టీ-హబ్, హాట్స్-డీ-ఫ్రాన్స్ రీజియన్‌తో ఒక వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా భారత-ఫ్రాన్స్ మధ్య స్టార్టప్ కంపెనీల అభివృద్ధిలో పరస్పరం సహకరించుకుంటాయి. స్టార్టప్ కంపెనీల ఉత్పత్తుల డిజైన్, వాటికి అవసరమైన మార్కెటింగ్ నైపుణ్యాలు, స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎలా తీసుకుపోవాలి? అనే విషయాల్లో పరస్పరం సహకరించుకుంటాయి.

'ఎన్‌సీసీ'పై ఎన్‌హెచ్ఏఐ వేటు

రెండేళ్ల పాటు నిషేధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ).. ఎన్‌సీసీ లిమిటెడ్‌కి పెద్ద షాకిచ్చింది. ఎన్‌సీసీతో పాటు అనుబంధ సంస్థ అయిన ఓబీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఓబీఐఎల్)ను రెండేళ్ల పాటు తనకు సంబంధించిన ఎలాంటి టెండర్లు, కాంట్రాక్టుల్లో పాల్గొనకుండా నిషేధించింది. ఈ నెల 17వ తేదీ నుంచే ఈ నిషేధం అమల్లోకి వచ్చినట్టు ఎన్‌సీసీ లిమిటెడ్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. తన అనుబంధ సంస్థ ఓబీఐఎల్ బీఓటీ పద్దతిలో ఉత్తరప్రదేశ్‌లో నిర్మించిన ఒక రహదారి ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడంతో ఎన్‌హెచ్ఏఐ ఈ నిషేధం విధించినట్టు ఎన్‌సీసీ తెలిపింది.

ఎన్‌హెచ్ఏఐదే ఆలస్యం: ఈ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించి ఇవ్వడంలో ఎన్‌హెచ్ఏఐ ఆలస్యం చేయడం వల్లే ఈ ఆలస్యం జరిగిందని ఎన్‌హెచ్ఏఐపై ఎన్‌సీసీ ఆర్బిట్రేషన్‌కు కూడా వెళ్లింది. ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ 2024 నవంబరులో దీనిపై ఎన్‌సీసీకి అనుకూలంగా ఆదేశాలు జారీ చేసింది. అయినా ఎన్‌హెచ్ఏఐ దీన్ని ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ కేసు విచారణ పెండింగ్‌లో ఉన్నా.. ఎన్‌హెచ్ఏఐ ఏకపక్షంగా నిషేధ నిర్ణయం తీసుకుందని ఎన్‌సీసీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది.

షేరు ధరలో ఆటుపోట్లు: ఈ వార్తలతో గురువారం స్టాక్ మార్కెట్లో ఎన్‌సీసీ షేరు తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. బీఎస్ఈలో ఇంట్రాడేలో ఒక దశలో 10 శాతం వరకు నష్టపోయింది. ఈ నిషేధం ప్రభావం తమ ఆర్థిక పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపదని కంపెనీ ప్రకటించడంతో షేరు కోలుకుని చివరికి 0.87 శాతం స్వల్ప లాభంతో రూ.150.75 వద్ద ముగిసింది.

అభిషేకా.. సంజూనా?





సూపర్-8 ఓపెనర్‌పై డైలమా

న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంప్ భారత్.. టీ20 వరల్డ్‌కప్ సూపర్-8కు సులువుగానే చేరుకొంది. ఇకపై మాత్రం పోటీ మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఓపెనర్ అభిషేక్ శర్మ హ్యాట్రిక్ డక్‌లు జట్టును తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. టోర్నీకి ముందు పరుగుల వరద పారించిన అభిషేక్.. వరల్డ్‌కప్‌లో ఖాతా కూడా తెరవకపోవడం మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగిన శర్మ.. పాకిస్థాన్, నెదర్లాండ్స్‌పై కూడా సున్నాకే పెవిలియన్ చేరాడు. స్పిన్నర్లను ఎదుర్కోవడంలో అతడి బలహీనతను పసిగట్టిన ప్రత్యర్థులు.. తొలి ఓవర్‌లోనే శర్మను బోల్తా కొట్టిస్తున్నారు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్ ఆర్యన్ బౌలింగ్‌లో అభిషేక్ బౌల్డ్ అయ్యాడు. బంతిని ఏమాత్రం గమనించకపోవడం, తగిన ఫుట్‌వర్క్ లేకపోవడం వల్లే అతడు వరుసగా విఫలమవుతున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. భారీ అంచనాల ఒత్తిడి కూడా శర్మ ఆటపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని అంటున్నారు. ఆరంభంలోనే షాట్ ఆడే బదులు సింగిల్ తీస్తే మేలని గవాస్కర్ సూచించినా.. అతడు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కీలక సూపర్-8 మ్యాచ్‌ల్లో అభిషేక్‌ను జట్టులో కొనసాగించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అతడి స్థానంలో సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా దించాలన్న డిమాండ్ క్రమంగా ఊపందుకొంటోంది. మరోవైపు శాంసన్ కూడా గొప్ప ప్రదర్శనేమీ చేయడం లేదు. అభిషేక్ అనారోగ్యానికి గురికావడంతో.. నమీబియాతో మ్యాచ్‌లో చాన్స్ దక్కించుకొన్న అతడు పెద్దగా ఆకట్టుకోలేక పోయాడు. ఇలా ఓపెనర్లు విఫలమవుతుండడంతో పవర్‌ప్లేలో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తర్వాతి రౌండ్ మ్యాచ్‌ల్లో ఇదే రిపీటైతే.. తగిన మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు కూడా..! కానీ, అభిషేక్‌కు మాజీ స్పిన్నర్ అశ్విన్ అండగా నిలిచాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించే శర్మ లాంటి వాడిపై వేటేయడం వ్యూహాత్మక తప్పిదం అవుతుందని అన్నాడు.

విండీస్..విజయంతో ముగించింది

42 పరుగులతో ఇటలీ పరాజయం

కోల్‌కతా: వరల్డ్ కప్‌లో వెస్టిండీస్ తన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లోనూ విజయం సాధించి అజేయంగా నిలిచింది. కెప్టెన్ షాయ్ హోప్ (46 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సలతో 75) అదరగొట్టడంతో గురువారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో 42 పరుగులతో ఇటలీని ఓడించింది. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 165/6 స్కోరు చేసింది. 31 పరుగులకే రెండు వికెట్లు కోల్పోగా చేజ్ (24)తో కలిసి హోప్ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు. అనంతరం రూథర్‌ఫోర్డ్ (24 నాటౌట్), ఫోర్డ్ (16 నాటౌట్) ఏడో వికెట్‌కు 14 బంతుల్లో అభేద్యంగా 28 పరుగులు జత చేశారు. కలుగమగే, మనెంటి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో విండీస్ బౌలర్ల ధాటికి ఇటలీ 18 ఓవర్లలో 123 పరుగులకే ఆలౌటైంది. బెన్ మనెంటి (26) టాప్ స్కోరర్. స్మట్స్ (24), మోస్కా (19) పర్లేదనిపించారు. జోసెఫ్ నాలుగు, ఫోర్డు మూడు, మోటీ రెండు వికెట్లు సాధించారు. హోప్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.


షాయ్ హోప్ (75)

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్ : 20 ఓవర్లలో 165/6 (షాయ్ హోప్ 75, రూథర్‌ఫోర్డ్ 24 నాటౌట్, రోస్టన్ చేజ్ 24, కలుగమగే 2/25, బెన్ మనెంటి 2/37); **ఇటలీ:** 18 ఓవర్లలో 123 ఆలౌట్ (మనెంటి 26, షమార్ జోసెఫ్ 4/30, ఫోర్డ్ 3/19, మోటీ 2/24).


జార్జియా వాల్ (88)

భారత మహిళల ఓటమి

ఆసీస్ ఆల్‌రౌండ్ షో

రెండో టీ20

కాన్‌బెర్రా: భారత మహిళల జట్టుతో జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా అదరగొట్టింది. ఓపెనర్లు జార్జియా వాల్ (88), బెత్ మూనీ (46) మెరుపు బ్యాటింగ్‌కు తోడు బౌలర్లు విశేషంగా రాణించడంతో భారత్‌పై 19 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-1తో సమంగా నిలిచింది. నిర్ణాయక ఆఖరి మ్యాచ్ శనివారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 163/5 స్కోరు సాధించింది. పేసర్ అరుంధతికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 144/9 స్కోరు చేసి ఓడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (36), స్మృతి మంధాన (31), షఫాలీ (29) మాత్రమే రాణించారు. అయితే కేవలం 7 రన్స్ తేడాతోనే ఆరు వికెట్లు కోల్పోయిన భారత్ మూల్యం చెల్లించుకుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జార్జియా నిలిచింది. మరోవైపు భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువ మ్యాచ్‌లు (356) ఆడిన ప్లేయర్‌గా నిలిచి.. సుజీ బేట్స్ (న్యూజిలాండ్, 355)ను అధిగమించింది.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 163/5 (వాల్ 88, మూనీ 46; అరుంధతీ రెడ్డి 2/30); **భారత్:** 20 ఓవర్లలో 144/9 (హర్మన్‌ప్రీత్ కౌర్ 36, స్మృతీ మంధాన 31, షఫాలీ 29; గార్డ్‌నర్ 3/22, గార్త్ 2/16, సదర్లాండ్ 2/18, మోలినెక్స్ 2/37).

స్పోర్ట్స్

నేటి మ్యాచ్: ఆస్ట్రేలియా X ఒమన్ (రాత్రి. 7 గం. నుంచి)

కర్ణాటక 15వ సారి..

రంజీట్రోఫీ ఫైనల్‌కు చేరిక

జమ్మూ కశ్మీర్‌తో అమీతుమీ



లఖ్‌నవూ: కర్ణాటక జట్టు 15వసారి ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఉత్తరాఖండ్‌తో ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో..మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా టైటిల్ ఫైట్‌కు చేరింది. ఈనెల 24 నుంచి హుబ్లీలో జరిగే తుది పోరులో జమ్మూ కశ్మీర్‌ను ఢీకొంటుంది. మరో సెమీస్‌లో బెంగాల్‌కు జమ్మూ షాకిచ్చిన సంగతి తెలిసిందే. ఓవర్‌నైట్ 299/6 స్కోరుతో గురువారం, రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 323 పరుగులకు ఆలౌటైంది. రవిచంద్రన్ స్మరణ్ (127) శతక మోత మోగించాడు. కేఎల్ రాహుల్ (86 నాటౌట్) అజేయంగా నిలిచాడు. మొత్తంగా కర్ణాటక 826 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకుంది. అనంతరం 827 పరుగుల కనీవినీ ఎరుగని లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఉత్తరాఖండ్ చివరి రోజు ఆట ఆఖరికి 260/6 స్కోరు చేసింది. 11 ఏళ్ల తర్వాత కర్ణాటక ఫైనల్‌కు చేరింది.

సంక్షిప్త స్కోర్లు: కర్ణాటక: 736, 323 (స్మరణ్ 127, కేఎల్ రాహుల్ 86 నాటౌట్, మయాంక్ మిశ్రా 4/69, అభయ్ నేగి 2/63); **ఉత్తరాఖండ్:** 233, 260/6 (అవ్‌నీష్ 66, అభయ్ నేగి 57 నాటౌట్, సౌరభ్ రావత్ 53 నాటౌట్, శ్రేయాస్ గోపాల్ 3/83, ప్రసిద్ధ్ 2/17)



బెన్నెట్ (63 నాటౌట్)

శ్రీలంకకు జింబాబ్వే ఝలక్

సంచలనాల వెనుక..

2024 టీ20 వరల్డ్‌కప్‌నకు అర్హత కూడా సాధించలేకపోయిన జింబాబ్వే.. ఈసారి మాజీ చాంపియన్లు ఆస్ట్రేలియా, శ్రీలంకపై పెను సంచలనాలతో వారెవా అనిపించింది. అయితే, జింబాబ్వే అనూహ్య విజయాల వెనుక 22 ఏళ్ల బ్రియాన్ బెన్నెట్ పాత్ర కీలకం. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో బెన్నెట్ 175 పరుగులు సాధించాడు. ఒక్క మ్యాచ్‌లో కూడా అవుట్ కాకపోవడం విశేషం. ఒమన్‌తో మ్యాచ్‌లో 48 పరుగులు, ఆసీస్‌పై 64 రన్స్‌తో అజేయంగా నిలిచాడు. ఇక, లంకపై కూడా ఎంతో పరిణతి చెందిన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకొన్నాడు.

కొలంబో: టీ20 వరల్డ్‌కప్‌లో జింబాబ్వే మరో సంచలనం సృష్టించింది. ఆస్ట్రేలియాపై నెగ్గిన జింబాబ్వే.. ఆతిథ్య శ్రీలంకకు షాకిచ్చింది. గ్రూప్ దశను అజేయంగా ముగించిన జింబాబ్వే.. సూపర్-8 ముందు ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (63 నాటౌట్) సమయోచిత అర్ధ శతకంతోపాటు కెప్టెన్ సికందర్ రజా (26 బంతుల్లో 45) దూకుడుగా ఆడడంతో.. గ్రూప్-బిలో గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే 6 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 178/7 స్కోరు సాధించింది. క్రీమర్, ఇవాన్స్, ముజరబాని రెండేసి వికెట్లు దక్కించుకొన్నారు. మందకొడి పిచ్‌పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న లంకకు ఓపెనర్లు పథుం నిస్సాంక (62), కుశాల్ పెరీరా (22) తొలి వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభం అందించారు. మెండిస్‌ను బర్ల్.. నిస్సాంకను క్రీమర్ అవుట్ చేయడంతో లంక బ్యాటింగ్ కుదుపులకు గురైంది. ఛేదనలో జింబాబ్వే 19.3 ఓవర్లలో 182/4 స్కోరు చేసి గెలిచింది. తుదికంటా క్రీజులో నిలిచిన బెన్నెట్.. మొదటి వికెట్‌కు మరుమణి (34)తో, మూడో వికెట్‌కు సికందర్‌తో 69 పరుగుల చొప్పున భాగస్వామ్యాలు నెలకొల్పాడు. దీంతో జింబాబ్వే మరో 3 బంతులు మిగిలుండగానే గెలుపుగీత దాటింది. హేమంత రెండు వికెట్లు పడగొట్టాడు.

సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక: 20 ఓవర్లలో 178/7 (నిస్సాంక 62, పవన్ రత్నాయకే 44; క్రీమర్ 2/27, ముజరబాని 2/38). **జింబాబ్వే:** 19.3 ఓవర్లలో 182/4 (బెన్నెట్ 63 నాటౌట్, సికందర్ 45; హేమంత 2/36).

నబీ సంచలనం

7 పరుగులకే 4 వికెట్లు

కెనడాపై అఫ్ఘాన్ గెలుపు

టీ20 వరల్డ్‌కప్

చెన్నై: టీ20 వరల్డ్‌కప్‌లో అఫ్ఘానిస్థాన్ తమ ప్రస్థానాన్ని విజయంతో ముగించింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (56 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 95 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌కు తోడు.. వెటరన్ స్పిన్నర్ నబీ (4/7) సంచలన బౌలింగ్‌తో కట్టడి చేశాడు. దీంతో గ్రూప్ 'డి'లో కెనడాతో జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో అఫ్ఘాన్ 82 రన్స్ తేడాతో నెగ్గింది. 2024 టోర్నీలో ఈ జట్టు సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 200/4 స్కోరు చేసింది. సెదికుల్లా అటల్ (44), ఓపెనర్ గుర్బాజ్ (30) రాణించారు. జస్కరణ్ సింగ్‌కు మూడు వికెట్లు లభించాయి. ఆ తర్వాత భారీ ఛేదనలో స్పిన్నర్ నబీ కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో కెనడాను కుదురుకోనీయలేదు. ఫలితంగా ఆ జట్టు 20 ఓవర్లలో 118/8 స్కోరుకే పరిమితమై చిత్తుగా ఓడింది. హర్ష్ (30), సాద్ బిన్ (28) పర్వాలేదనిపించారు. రషీద్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జద్రాన్ నిలిచాడు.


నబీ (4/7)

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 200/4 (జద్రాన్ 95 నాటౌట్, సెదికుల్లా 44, జస్కరణ్ 3/52); కెనడా: 20 ఓవర్లలో 118/8(హర్ష్ 30, నబీ 4/7, రషీద్ 2/19)

పోతూ పోతూ... కెప్టెన్‌పై వేటు

- పాక్ హాకీ చీఫ్ నిర్వాకం
- ముదిరిన రగడ

కరాచీ: పాకిస్థాన్ హాకీలో అంతర్గత సంక్షోభం మరింత ముదిరింది. ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో విఫలమైన టీమ్ మేనేజ్‌మెంట్‌ను జట్టు కెప్టెన్ అమ్మాద్ షకీల్ భట్ బహిరంగంగానే విమర్శించాడు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హాకీ సమాఖ్య (పీహెచ్ఎఫ్) అధ్యక్షుడు తారిక్ బగ్టీ తన పదవికి రాజీనామా చేశాడు. అయితే, పోతూపోతూ క్రమశిక్షణ చర్యల కింద షకీల్‌పై నిషేధం విధించాడు. పాక్ హాకీకి తలవంపులు తెచ్చే విధంగా వ్యవహరించినందుకే షకీల్‌పై రెండేళ్లపాటు దేశీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధించినట్టు తెలిపాడు. ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా ఆస్ట్రేలియాలో పాక్ టీమ్ పర్యటించింది. ఆసీస్‌తోపాటు జర్మనీతో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పాక్ ఓడింది. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత.. ఆస్ట్రేలియాలో తాము ఎదుర్కొన్న ఘోర పరిస్థితులను కెప్టెన్ షకీల్ మీడియాకు చెప్పాడు. ఉండటానికి కనీస వసతులు కూడా పీహెచ్ఎఫ్ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇందుకు కారణమైన టీమ్ మేనేజ్‌మెంట్, పీహెచ్ఎఫ్ ఆఫీసు బేరర్లను తొలగించాలని డిమాండ్ చేశాడు. మరోవైపు ఆటగాళ్లలో క్రమశిక్షణ లేదని, సహచరులను కించపరిచేలా షకీల్ నోరుపారేసుకొంటాడని హెడ్ కోచ్ తాహిర్ జమాన్ ఆరోపించాడు. జట్టు బాధ్యతల నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 20-2-2026

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ

15



షేక్ అహ్మద్, క్రాంతి

టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు

చంపేసింది!

మంగళగిరిలో భర్తను కత్తితో పొడిచి చంపిన భార్య

హెరిటేజ్‌పై అసత్య ప్రచారం

ఆపండి!

'సాక్షి'కి ఢిల్లీ హైకోర్టు షాక్

హెరిటేజ్‌పై వివాదాస్పద కథనాలు తక్షణమే నిలిపివేయండి

- ఆ కంటెంట్‌ను 24 గంటల్లో తొలగించండి
- నివేదికలు, ఇంటర్వ్యూలు, చర్చలతో పాటు అన్ని లింకుల యాక్సెస్‌నూ నిలిపేయండి
- సాక్షి మీడియాకు న్యాయస్థానం ఆదేశాలు
- ప్రతివాదులకు నోటీసులు జారీ
- 4 వారాల్లో జవాబివ్వాలని ఆదేశం
- ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ వేయాలని పిటిషనర్‌కు సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్ రోత మీడియాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. హెరిటేజ్ ఫుడ్స్ సంస్థపై అసత్య, దురుద్దేశపూరితమైన కథనాలను ప్రసారం చేయడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హెరిటేజ్ ఫుడ్స్‌పై వివాదాస్పదమైన అన్ని కథనాలు, నివేదికలు, ఇంటర్వ్యూలు, చర్చలు, డిజిటల్ కంటెంట్‌ను 24 గంటల్లోపు తొలగించాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన అన్ని లింక్‌ల యాక్సెస్‌నూ తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. సాక్షి మీడియా తమపై అసత్య ప్రచారం చేస్తోందని, అభ్యంతరకర కథనాలు, అసత్య వార్తలతో తమ పరువుకు భంగం కలిగిందని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఇటీవల హరియాణాలో నమోదైన జరిమానా అంశాన్ని, భోలేబాబా డెయిరీ (ఇందాపూర్ డెయిరీ) వ్యవహారాన్ని హెరిటేజ్ ఫుడ్స్‌కు ముడిపెడుతూ సాక్షి మీడియా అసత్య కథనాలు ప్రచురిస్తోందని పిటిషన్‌లో

మిగతా 11వ పేజీలో...

నిజాయితీ, పారదర్శకతలే హెరిటేజ్‌కు పునాది



రైతులకు సకాలంలో చెల్లింపు, నాణ్యత- కొలతల్లో పారదర్శకత, న్యాయమైన ధర... ఈ మూడే మా బలం

పాడి రైతులతో మాది మూడు దశాబ్దాల బంధం 11

ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, ఎండీ నారా భువనేశ్వరి ట్వీట్



రాష్ట్రానికి వైసీపీ హానికరం!

ఇది నిరంతర హెచ్చరిక: పయ్యావుల

- 'వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ నినాదం
- చంద్రబాబు హయాంలో భూములిస్తే కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో వచ్చాయి
- టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ కూడా..
- వైఎస్ జమానాలో ఇచ్చిన భూముల్లోకి ఒక్క కంపెనీ కూడా రాలేదు
- నాడు గనులు, ఎక్సైజ్ ఆదాయం ప్యాలెస్‌కు.. నేడు అంతా ఖజానాకే
- బడ్జెట్ చర్చకు ఆర్థిక మంత్రి సమాధానం

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఎప్పటికీ రాకూడదు.. కూటమే మరోసారి.. (వైసీపీ నెవర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్)' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో నినదించారు. రాష్ట్రానికి వైసీపీ హానికరమనే హెచ్చరికను నిరంతరం చేస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు గురువారం శాసనసభలో

మిగతా 14వ పేజీలో...

వావ్ వైజాగ్!




గ్లోబల్ ఏఐ హబ్‌గా మారుతుందని అస్సలు ఊహించలేదు

- చదువుకునే రోజుల్లో ఆ నగరం మీదుగా వెళ్లేవాడిని
- విశాఖకు అపార సామర్థ్యం ఉందని తెలుసు
- అక్కడే గూగుల్ పూర్తి ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోంది
- ఈ హబ్ ఉద్యోగాలను తీసుకొస్తుంది
- అమెరికా-భారత్ మధ్య నాలుగు కొత్త సబ్‌సీ కేబుల్స్
- ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) హబ్‌గా విశాఖపట్నం మారుతుందని తానెప్పుడూ ఊహించలేదంటూ గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైజాగ్‌లో గూగుల్ ఒక పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ హబ్ దేశప్రజలకు, వ్యాపారాలకు అత్యాధునిక ఏఐ ప్రయోజనాలను అందించడంతో పాటు ఉద్యోగాలను తీసుకొస్తుందని చెప్పారు. ఢిల్లీలోని భారతమండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సుందర్ పిచాయ్ గురువారం మాట్లాడారు. తన ప్రసంగ ప్రారంభంలోనే వైజాగ్‌లో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. "నేను ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదువుతున్న రోజుల్లో తరచుగా చెన్నై నుంచి ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించేవాడిని. ఆ ప్రయాణంలో మేము వైజాగ్ మీదుగా వెళ్లేవాళ్లం. అది ఎంతో ప్రశాంతమైన, అపారమైన సామర్థ్యం ఉన్న ఒక తీర ప్రాంత నగరంగా నాకు గుర్తు. ఇప్పుడు అదే నగరంలో గూగుల్ ఒక పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇది భారత్‌లో మేము చేపట్టిన 15 బిలియన్ డాలర్ల మౌలిక సదుపాయాల పెట్టుబడిలో భాగం. ఇది పూర్తయ్యాక, ఈ హబ్‌లో ఒక గిగావాట్ స్థాయి కంప్యూటింగ్, ఒక కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వే ఉంటాయి. ఇది దేశవ్యాప్తంగా

మిగతా 2వ పేజీలో...



11

నేడు హస్తినకు

చంద్రబాబు

ఏఐ సదస్సుకు హాజరు

- ఐబీఎం సహా పలు సంస్థలతో కీలక ఎంవోయూలు
- క్వాంటమ్ ఏఐ వర్సిటీ ఏర్పాటు కోసం ఎన్‌విఈఎల్ఐటీతో ఒప్పందం
- ఏఐ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ
- ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన
- పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో భేటీ

వావ్ వైజాగ్!

(మొదటి పేజీ తరువాయి)



ఉన్న ప్రజలకు, వ్యాపారాలకు అత్యాధునిక ఏఐ ప్రయోజనాలను మరియు ఉద్యోగాలను తీసుకువస్తుంది. ఆ రైలులో కూర్చున్నప్పుడు, వైజాగ్ ఒక గ్లోబల్ ఏఐ హబ్‌గా మారుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. అంతే కాదు, ఒకరోజు నేను డేటా సెంటర్లను అంతరిక్షంలో ఉంచడం ఎలాగో ఆలోచించే బృందాలతో సమయాన్ని గడుపుతానని కూడా ఊహించలేదు" అని సుందర్ పిచాయ్ అన్నారు.

ప్రభుత్వ సేవల్లో ఏఐని ప్రవేశపెట్టాలి

ఏ సాంకేతికత కూడా ఏఐ కంటే పెద్దకలలు కనేలా తనను ప్రేరేపించలేదని సుందర్ పిచాయ్ అన్నారు. మానవాళి పెద్ద కలలు కన్నప్పుడు ఎలాంటివి సాధ్యమవుతాయో ఈ పురోగతి నిరూపిస్తోందని చెప్పారు. ఏఐ మన జీవితకాలంలోనే అతిపెద్ద ప్లాట్‌ఫామ్ మార్పు అని, మనం అద్భుతమైన ప్రగతి, కొత్త ఆవిష్కరణల అంచున ఉన్నామని అన్నారు. ఏఐ కోట్లాది ప్రజల జీవితాలను మెరుగుపరుస్తుందని, సైన్స్‌లోని అత్యంత కఠినమైన సమస్యలను పరిష్కరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంత బాధ్యతాయుతంగా ఉన్నప్పటికీ అందరం కలిసి పని చేస్తేనే ఏఐ పూర్తి ప్రయోజనాలను పొందగలమన్నారు. దీనిలో ప్రభుత్వాలకు కీలకపాత్ర ఉందన్నారు. నియంత్రణ సంస్థలుగా నిబంధనలను రూపొందించడం, ప్రమాదాలను అడ్డుకోవడంలో ప్రభుత్వాలకు పాత్ర ఉంటుందని చెప్పారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే ప్రభుత్వసేవల్లో ఏఐని ప్రవేశపెట్టాలని సూచించారు. థాయ్‌ల్యాండ్, మలేషియా ఇతర దేశాల్లో కూడా గూగుల్ పెట్టుబడులు పెడుతోందని, అమెరికా-భారత్ కనెక్ట్ ఇనిషియేటివ్‌లో భాగంగా ఇరు దేశాల మధ్య నాలుగు కొత్త సబ్‌సీ ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థలను నిర్మిస్తున్నామని పిచాయ్ చెప్పారు. ఏఐ వర్క్‌ఫోర్స్‌ను మారుస్తోందని, కొన్ని పనులను ఆటోమేట్ చేస్తుందని, సరికొత్త కెరీర్‌లను సృష్టిస్తుందని చెప్పారు. ఇరవై ఏళ్ల క్రితం యూట్యూబ్ క్రియేటర్ అనే వృత్తి లేదని, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 6 కోట్ల మందికి పైగా యూట్యూబ్ క్రియేటర్లు ఉన్నారని సుందర్ పిచాయ్ వివరించారు.

ఏఐ సదస్సులో ప్రసంగానికి బిల్‌గేట్స్ దూరం



ఏఐ సమిట్‌లో గురువారం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ప్రసంగించాల్సి ఉండగా చివరిక్షణంలో అది రద్దు అయ్యింది. సమిట్ ప్రాధాన్యతలు పక్కదారి పట్టకూడదన్న ఉద్దేశంతోనే ఆయన సదస్సుకు దూరంగా ఉన్నట్లు గేట్స్ ఫౌండేషన్ ప్రకటించింది. నిజానికి కొద్ది రోజులుగా ఆయన సదస్సుకు దూరంగా ఉంటున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, గేట్స్ ఫౌండేషన్ ఆ కథనాలను తోసిపుచ్చింది. చివరికి ఆయన తప్పుకుంటున్నట్లు గేట్స్ ఫౌండేషనే ధ్రువీకరించింది. అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేక మంది ప్రపంచ ధనికులతో పాటు బిల్‌గేట్స్ ప్రస్తావనకూడా ఉండటంతో ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు.

బడా సీఈవోలను మించిన ఇంటెలిజెన్స్ చూస్తాం: శామ్ ఆల్ట్‌మన్



ప్రపంచం మానవ మేధస్సును అధిగమించే పూర్తిస్థాయి సూపర్ ఇంటెలిజెన్స్‌ను రూపొందించడానికి కొద్ది ఏళ్ల దూరంలోనే ఉందని ఓపెన్ ఏఐ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ శామ్ ఆల్ట్‌మన్ చెప్పారు. అది ఒక పెద్ద కంపెనీ సీఈవో కన్నా సమర్థంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలదని, భూమ్మీద ఉన్న అత్యున్నత శాస్త్రవేత్తల కన్నా గొప్పగా పరిశోధనలు చేయగలదని అన్నారు. భూమ్మీద ఉన్న మేధోశక్తి కన్నా ఎక్కువ మేధో శక్తి డేటా సెంటర్లలో ఉండే రోజు వస్తుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఏఐని ప్రజాస్వామ్యీకరించాల్సిన అవసరం ఉందని, అప్పుడే మానవాళి వికాసం సాధ్యమవుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం మొత్తం ఒక కంపెనీ చేతిలోనో, ఒక దేశం చేతిలోనో కేంద్రీకృతం కావడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. అందరూ కలిసి పూనుకోకపోతే ఏఐ వ్యవస్థ దానికదే సొంతంగా మానవాళికి గొప్ప భవిష్యత్తును అందించలేదని చెప్పారు. ఏఐ భవిష్యత్తును పరిరక్షించడం ప్రజలకు ఎక్కువ భాగస్వామ్యం కల్పించడం ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. ఉద్యోగాలు పోతాయన్న భయాలు స్వల్పకాలికమేనని, కాలక్రమంలో పరిస్థితులు మెరుగు పడతాయని చెప్పారు.

పది లక్షల కోట్లతో ఏఐ డేటా సెంటర్లు: ముఖేశ్ అంబానీ



భారతదేశ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి జియో గుండెకాయ కాబోతోందని రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ అన్నారు. గురువారం ఆయన ఏఐ సమిట్‌లో మాట్లాడారు. పది లక్షల కోట్ల రూపాయలతో పూర్తిగా భారత ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే కంప్యూటింగ్ మౌలిక సదుపాయ వ్యవస్థను నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటిదాకా డేటా కనెక్టివిటీకే పరిమితం అయిన జియో ఇక ఏఐ ఆధార సేవలు కూడా అందించనుందని చెప్పారు. ఇండియా ఎల్లకాలం ఏఐని అద్దెకు తీసుకుంటూ బతకలేదని వ్యాఖ్యానించారు. డేటా విషయంలో భారతీయులకు స్వేచ్ఛ కల్పించినట్లే ఏఐ సొల్యూషన్స్ విషయంలోనూ కల్పిస్తామని చెప్పారు. జామ్‌నగర్‌లో నిర్మిస్తున్న 120 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఈ ఏడాదే అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. తమ దగ్గర ఇప్పటికే 10 గిగావాట్ల సౌర విద్యుత్ అందుబాటులో ఉందని తెలిపారు.

ఏఐ వల్ల త్వరలో 3.5 కోట్ల ఉద్యోగాలు ఊస్ట్

» అమెరికా వ్యాపారవేత్త ఆండ్రూ యాంగ్ అంచనా

న్యూయార్క్, ఫిబ్రవరి 19: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల అమెరికాలో సేవల రంగంలో భారీగా ఉద్యోగాలకు కోతపడే అవకాశం ఉందని ఆ దేశ వ్యాపారవేత్త, డెమొక్రటిక్ పార్టీ మాజీ అధ్యక్ష అభ్యర్థి ఆండ్రూ యాంగ్ తెలిపారు. అమెరికాలో ప్రస్తుతం ఉన్న 7 కోట్ల వైట్‌కాలర్ ఉద్యోగాల్లో వచ్చే 12 నుంచి 18 నెలల్లో 25 శాతం నుంచి 50 శాతం వరకు (3.5 కోట్లు) ఉద్యోగాలు పోతాయని అంచనా వేశారు. 'ఉద్యోగులను తగ్గిస్తే స్టాక్ మార్కెట్ సానుకూలంగా స్పందిస్తుంది. తగ్గించకపోతే మరోరకంగా స్పందిస్తుంది. ఒక కంపెనీ తన ఉద్యోగుల్లో కోత పెడితే.. ఇతర పోటీ కంపెనీలు కూడా అదే పని చేస్తాయి. ముఖ్యంగా కోడర్స్, ఆఫీస్ సహాయకులు, మిడిల్ మేనేజర్స్, కాల్‌సెంటర్ ఉద్యోగులు, మార్కెటింగ్ విభాగాల్లో పనిచేసేవారికి ఏఐ వల్ల ప్రమాదం ఉంది. ఈ ప్రభావం వైట్‌కాలర్ ఉద్యోగాలను దాటి కూడా ఉంటుంది. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొలువు ఊడిపోతే అతడు లాండ్రీకి తన బట్టలు వేయడు. తన కుక్క సంరక్షకుడిని తొలగించి తానే స్వయంగా దానిని చూసుకుంటాడు. బార్బర్ సెలూన్‌కు వెళ్లటం కూడా తగ్గిస్తాడు. ఇలా ఒక్క ఉద్యోగం పోవటం వల్ల ఆ తర్వాత నాలుగైదు ఉద్యోగాలు పోతాయి' అని పేర్కొన్నారు. అయితే, యాంగ్ అభిప్రాయంతో జేపీ మోర్గాన్ సంస్థ విభేదించింది. 2025లో కోల్పోయిన 12 లక్షల ఉద్యోగాల్లో 55 వేలు మాత్రమే ఏఐ వల్ల పోయాయని గుర్తు చేసింది.



ఏఐ ఇంపాక్ట్ - 2026 సమ్మిట్‌లో పాల్గొన్న ప్రధాని మోదీ, వివిధ దేశాల ప్రతినిధులు

ఏఐ నియంత్రణ

మన చేతుల్లో ఉండాలి


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నానాటికీ విస్తరిస్తున్న కృత్రిమ మేధ పరిజ్ఞానం కొన్ని పెద్ద దేశాలకో, అంతర్జాతీయ కంపెనీలకో మాత్రమే పరిమితం కాకూడదని.. దాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అయితే దానిపై నియంత్రణ మాత్రం మన చేతుల్లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. "ఏఐకి మనం పూర్తిస్థాయిలో అవకాశం ఇవ్వాలి. కానీ నియంత్రణ మాత్రం మన చేతుల్లోనే ఉంచుకోవాలి.. అచ్చం జీపీఎస్‌లాగా. అది మనకు మార్గాలను సూచిస్తుంది. కానీ ఎలా వెళ్లాలనే తుది నిర్ణయం మనదే కదా" అని వివరించారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో గురువారం ప్రసంగించిన మోదీ.. ప్రపంచ జనాభాలో ఆరో వంతు మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్‌లో ఈ సదస్సు జరగడం ఇండియాకే కాక, గ్లోబల్ సౌత్‌కు గర్వకారణమన్నారు. వ్యవసాయం, భద్రత, దివ్యాంగులకు సహాయం వంటి అంశాలకు సంబంధించి ఈ సమ్మిట్‌లో పలు కంపెనీలు ప్రదర్శించిన పరిష్కారాలు 'మేడ్ ఇన్ ఇండియా' శక్తికి, దేశ ఆవిష్కరణ సామర్థ్యాలకు శక్తివంతమైన ఉదాహరణలని పేర్కొన్నారు. ఈ సదస్సులో 3 భారత కంపెనీలు తమ స్వంత ఏఐ మోడళ్లను, యాప్‌లను ప్రారంభించాయని చెప్పడానికి తాను గర్విస్తున్నానన్నారు. ఏఐ వినియోగం మానవాళికి ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా (హ్యూమన్ సెంట్రిక్‌గా) ఉండాలని అభిప్రాయపడ్డారు. "మానవ చరిత్రలో ప్రతి కొన్ని శతాబ్దాలకూ ఒక మలుపు వస్తుంది. అది నాగరికత దిశను, అభివృద్ధి వేగాన్ని, మనం ఆలోచించే, అర్థం చేసుకునే, పనిచేసే విధానాలను సమూలంగా మార్చేస్తుంది. మనం అటువంటి మార్పుల గుండా ప్రయాణిస్తున్నప్పుడు దాని అసలైన ప్రభావాన్ని అరుదుగా గుర్తిస్తాం. రాళ్లను రాపిడి చేసినప్పుడు తొలిసారిగా వచ్చిన నిప్పురవ్వలు నాగరికతకు పునాది అవుతాయని అప్పుడు ఎవరూ ఊహించలేదు. మాట లిపిగా మారినప్పుడు రాతపూర్వక జ్ఞానం భవిష్యత్ వ్యవస్థలకు వెన్నెముక అవుతుందని ఎవరూ అంచనా వేయలేదు. ఎలాంటి తీగలూ లేకుండా (వైర్‌లెస్) సంకేతాలు మొదటిసారి ప్రసారమైనప్పుడు.. ఏదో ఒకనాటికి ప్రపంచమంతా రియల్ టైమ్‌లో అనుసంధానమవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. కృత్రిమ మేధ కూడా అలాంటి మార్పే. ఏఐ యంత్రాలను తెలివైనవిగా మారుస్తోంది. మానవ సామర్థ్యాన్ని అనేక రెట్లు పెంచుతోంది. అయితే.. ప్రస్తుత తరంతో పాటు, భవిష్యత్ తరాలకు మనం ఎటువంటి ఏఐని అందిస్తామో కూడా ఆలోచించాలి" అని పేర్కొన్నారు. ఏఐ పట్ల భారతదేశ దృక్పథాన్ని ఈ సదస్సు ఇతివృత్తం (సర్వజన హితాయ, సర్వజన సుఖాయ.. అంటే, అందరి సంక్షేమం, అందరి సంతోషం)లో స్పష్టంగా ప్రతిబింబిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కృత్రిమ మేధను అందరితో పంచుకుంటేనే, దాని కోడ్ అందరికీ అందుబాటులో ఉంటేనే (డెమొక్రటైజేషన్) అది మానవాళికి నిజంగా మేలు చేయగలదని భారత్ విశ్వసిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈమేరకు.. ఆయన కృత్రిమ మేధకు సంబంధించిన 'మానవ్' విజన్‌ను ఆవిష్కరించారు. "మానవ్‌లో ఎం అంటే.. మోరల్, ఎథికల్ సిస్టమ్స్ అంటే నైతిక విలువలు, మార్గదర్శకాల ఆధారంగా ఏఐ అభివృద్ధి చెందాలి. ఏ అంటే అకౌంటబిల్ గవర్నెన్స్ (జవాబుదారీపాలన). పారదర్శకమైన నిబంధనలు, పటిష్ఠ పర్యవేక్షణ ఉండాలి. ఎన్ అంటే నేషనల్ సావర్నిటీ (జాతీయ సార్వభౌమాధికారం). అంటే.. సృష్టించినవారికే డేటా చెందుతుంది. ఏ అంటే యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్ (అందుబాటు, సమ్మిళితం). అంటే.. ఏఐపై ఏ ఒక్కరికో గుత్తాధిపత్యం ఉండకూడదు. అందరికీ వృద్ధి కారకంగా ఉండాలి. వి అంటే వ్యాలీడ్, లెజిటిమేట్ (చెల్లుబాటు, చట్టబద్ధత). అంటే.. ఏఐ ఇచ్చే సమాచారం చట్టబద్ధంగా (ఆయా దేశాల చట్టాలకు లోబడి), ధ్రువీకరించదగినదిగా ఉండాలి. ఈ 21వ శతాబ్దపు ఏఐ ఆధారిత ప్రపంచంలో మానవ సంక్షేమానికి.. భారతదేశం రూపొందించిన ఈ 'మానవ్' విజన్ ఒక ప్రధానమైన లంకెగా ఉంటుంది" అని ప్రధాని వివరించారు. ఏఐని చూసి భయపడేవారు, దాంట్లో అదృష్టాన్ని చూసేవారు ఉంటారని.. ఏఐని చూసి భారత్ భయపడట్లేదని, దాన్నొక అదృష్టంగా, రేపటికి కార్యాచరణ ప్రణాళికగా చూస్తోందని ఆయన స్పష్టం చేశారు.

> "కృత్రిమ మేధ భవిష్యత్తులో ఏం చేస్తుందన్నది కాదు... దాంతో ఈరోజు మనం చేయదలచుకున్నామన్నదే అసలైన ప్రశ్న. మానవాళి గతంలో కూడా ఇలాంటి ప్రశ్నలను ఎదుర్కొంది. దీనికి అత్యంత శక్తిమంతమైన ఉదాహరణ.. అణుశక్తి. దాని విధ్వంసక శక్తినీ మనం చూశాం. దానివల్ల కలుగుతున్న ప్రయోజనాలనూ చూస్తున్నాం. ఏఐ కూడా అలా మానవాళి గతిని మార్చే శక్తి కలదే. దానికి సరైన దిశానిర్దేశం లేకపోతే విచ్ఛిన్నానికి దారి తీస్తుంది. సరైన మార్గంలో నడిపిస్తే అది ఒక పరిష్కారంలా మారుతుంది. ఏఐని యంత్ర కేంద్రీకృతం (మెషీన్ సెంట్రిక్)గా కాకుండా మానవ కేంద్రీకృతం (హ్యూమన్ సెంట్రిక్)గా.. నిర్లక్ష్యంగా కాకుండా సున్నితంగా, బాధ్యతాయుతంగా ఎలా అభివృద్ధి చేయాలన్నదే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యం."
> - ప్రధాని మోదీ

భారత్ ఆలోచన భిన్నం..

దశాబ్దాల క్రితం ఇంటర్నెట్ ప్రారంభమైనప్పుడు అది ఎన్ని ఉద్యోగాలను సృష్టిస్తుందో ఎవరూ ఊహించలేదని.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతుందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. కొన్ని దేశాలు, కంపెనీలు ఏఐని తమ వ్యూహాత్మక ఆస్తిగా భావిస్తాయని.. దాన్ని రహస్యంగా అభివృద్ధి చేయాలనుకుంటాయని.. కానీ భారత్ అందుకు భిన్నంగా ఆలోచిస్తుందన్నారు. "ఏఐ కోడ్స్ బహిరంగంగా ఉండి, అందరూ పంచుకుంటే.. లక్షలాది మంది యువ మేధావులు వాటిని మరింత సురక్షితంగా, మెరుగ్గా మార్చగలరు. ఏఐని ప్రపంచంలోని అందరి శ్రేయస్సు కోరేలా అభివృద్ధి చేయడానికి మనం కృతనిశ్చయంతో ఉందాం" అని పిలుపునిచ్చారు. అలాగే.. ఏఐ దుర్వినియోగంపైనా ప్రధాని ఆందోళన వెలిబుచ్చారు. డీప్‌ఫేక్ వీడియోలు, కల్పిత కంటెంట్ సమాజాలను అస్థిరపరుస్తున్నాయని.. డిజిటల్ ప్రపంచంలో కంటెంట్ వాస్తవమైనదా, ఏఐ సృష్టించిందా తెలిపే వాటర్‌మార్కింగ్స్ ఉండాలని అభిప్రాయపడ్డారు. సాంకేతికతలో మొదటి నుంచే నమ్మకాన్ని అంతర్భాగం చేయాలన్నారు. ఈ ఏఐ యుగంలో పిల్లల భద్రత విషయంలోనూ మరింత అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల పాఠ్యప్రణాళికను రూపొందించినంత జాగ్రత్తగా.. ఏఐ విషయంలో పిల్లలకు మార్గదర్శకత్వం చేయాలన్నారు. కాగా.. ప్రధాని ప్రసంగాన్ని ఏఐ సహాయంతో 11 భారతీయ భాషలతో పాటు బధిరులకు అర్థమయ్యేలాగా సైగల భాషలోకి అప్పటికప్పుడు అనువదించడం విశేషం.

లోకం తీరు



ఓపెన్ ఏఐ వర్సెస్ ఆంత్రోపిక్

ప్రధాని మోదీతో గ్రూప్ ఫొటో దిగే సమయంలో.. చేతులు కలపడానికి ఇష్టపడని శామ్ ఆల్ట్‌మన్, డేరియో

రాజకీయాల్లో అయినా వ్యాపారంలో అయినా.. ప్రత్యర్థులను శత్రువుల్లా చూడటం చాలా అరుదు! ఒక వేళ మనసులో కోపాలున్నా.. నలుగురు కలిసే వేదికల పైకి వచ్చినప్పుడు మొహమాటానికైనా చేతులు కలుపుతారు!! కానీ, చాట్ జీపీటీ, క్లాడ్ వంటి అత్యంత అధునాతన ఏఐ మోడళ్లను ప్రపంచానికి అందించిన ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ సంస్థల చీఫ్‌లు భిన్నంగా ప్రవర్తించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు ఓపెన్ ఏఐ శామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈవో డేరియో, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సహా అంతర్జాతీయ దిగ్గజ టెక్ సంస్థల అధిపతులు పలువురు హాజరయ్యారు. గురువారం ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీతో వీరందరూ గ్రూప్ ఫొటో కోసం వేదికపైకి వెళ్లారు. మోదీ తనకు కుడి, ఎడమల నిలబడిన సుందర్ పిచాయ్, శామ్ ఆల్ట్‌మన్‌ల చేతులు పట్టుకుని పైకి లేపి.. మిగతా అందరూ అలాగే చేశారు. పక్కపక్కనే ఉన్న శామ్ ఆల్ట్‌మన్, డేరియో ఒకరిచేతులు ఒకరు పట్టుకోకుండా పిడికిలి బిగించి నిలబడ్డారు. ఆ వీడియో క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. డేరియో ఒకప్పుడు ఓపెన్ ఏఐలో వైస్‌ప్రెసిడెంట్ (రిసెర్చ్)గా శామ్‌ఆల్ట్‌మన్ నాయకత్వంలోనే పనిచేశారు. 2021 లో ఆ సంస్థ నుంచి బయటకొచ్చేసి ఆంత్రోపిక్‌ను స్థాపించారు. ఓపెన్ ఏఐలో కంప్యూటర్ల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి సారిస్తున్నారే తప్ప.. ఏఐ మోడల్స్‌కు విలువలను నేర్పట్లేదని, అందుకే తాను బయటకొచ్చానని 2023లో ఓ మ్యాగజైన్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.



ఏ దేశమూ చేయలేనిది

భారత్ చేసి చూపింది

140 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు.. విస్తృతమైన యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ

» ఏఐ ఇంపాక్ట్ సదస్సులో మెక్రాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ప్రపంచంలో ఏ దేశమూ చేయలేని డిజిటల్ వ్యవస్థలను భారత్ అభివృద్ధి చేసిందని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ ప్రశంసించారు. ప్రజలందరికీ డిజిటల్ విధానంలో ఆధార్, యూపీఐ, ఆరోగ్య కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో గురువారం మెక్రాన్ మాట్లాడారు. 'నమస్తే' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. "ప్రపంచంలో ఏ దేశమూ చేయలేని దానిని భారత్ చేసి చూపింది. 140 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు, ప్రతినెలా 2 వేల కోట్ల లావాదేవీలు జరుగుతున్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ), 50 కోట్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీకార్డులు జారీ చేసిన వైద్యారోగ్య వ్యవస్థ.. ఇలా ఎన్నో. ఈ విజయాలు ప్రపంచానికి మార్గదర్శకం. భారత్ తన 140 కోట్ల మంది జనాభాను డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం సాధ్యం కాదని పదేళ్ల క్రితం ప్రపంచం మొత్తం పేర్కొంది. కానీ ఆ అంచనా తప్పు అని భారత్ నిరూపించింది. పదేళ్ల క్రితం ముంబైలో ఒక వీధి వ్యాపారి బ్యాంకు ఖాతా తీసుకోలేకపోయారు. ఇప్పుడదే వీధి వ్యాపారి తన ఫోన్‌లో డిజిటల్ చెల్లింపులను పొందుతున్నారు. ఇది టెక్నాలజీ కథ కాదు. ఇదొక నాగరికత అభివృద్ధి కథ. ఇప్పుడు ఏఐ కేవలం పెద్ద దేశాలే ఆడగల ఆట అని కొందరు అంటున్నారు. కానీ భారత్, యూరప్ మా భాగస్వాములు, మా దృక్పథాన్ని నమ్మే ప్రభుత్వాలు, సంస్థలు, పెట్టుబడిదారులతో కలిసి అందుకు భిన్నంగా చేసి చూపిస్తాం" అని మెక్రాన్ పేర్కొన్నారు. ఆవిష్కరణలతోపాటు బాధ్యతను, సాంకేతికతను, మానవత్వాన్ని కలిపే ఏఐ భవిష్యత్తు నిర్మితమవుతుందని చెప్పారు. ఆ భవిష్యత్తును రూపొందించడంలో భారత్, ఫ్రాన్స్ కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భారత్ బలంగా ఉండటమే కాదు ఆఫ్రికా కూడా బలంగా ఉండాలని.. విభజనపై కాకుండా కలపడంపై, నాశనం చేయడంపై కాకుండా సృష్టించడంపై, కేవలం మాటలు కాకుండా పంచుకోవడంపై ప్రపంచ దేశాలు దృష్టిపెట్టాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా జీ7 గ్రూపు అధ్యక్ష స్థానంలోని ఫ్రాన్స్, బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో ఉన్న భారత్ ముందుకు సాగుతాయని ఆయన చెప్పారు.



మోదీతో మెక్రాన్ కరచాలనం

ప్రధాని మోదీ-మెక్రాన్ భేటీ..

సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో మెక్రాన్ భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీకి ముందు మెక్రాన్, మోదీ చేతులు కలిపి ప్రేమ చిహ్నం చూపుతున్నట్టుగా ఏఐతో రూపొందించిన చిత్రాన్ని మెక్రాన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'స్నేహితులు ఎప్పుడు కలుస్తారో.. అప్పుడు సృజనాత్మకత వారిని అనుసరిస్తుంది. ఏఐ సదస్సు కోసం సిద్ధం' అంటూ క్యాప్షన్ పెట్టారు.

రఫేల్ డీల్‌తో భారత్ రక్షణ బలోపేతం

రఫేల్ యుద్ధ విమానాలు భారత్‌ను రక్షణపరంగా బలోపేతం చేస్తాయని, అలాంటి ఒప్పందాన్ని ఎందుకు విమర్శిస్తున్నారో తెలియదని మెక్రాన్ వ్యాఖ్యానించారు. రూ.3.25 లక్షల కోట్ల విలువైన 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలుకు భారత్ సిద్ధమైన విషయం తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు కూడా వస్తున్నాయి. గురువారం ఢిల్లీలో ఏఐ సదస్సు సందర్భంగా ఈ అంశంపై మెక్రాన్‌ను మీడియా ప్రశ్నించగా.. "రఫేల్ ఫైటర్లను తయారు చేసే దసో ఏవియేషన్‌కు, మీ ప్రభుత్వానికి మధ్య ఒప్పందం అది. ఇది మీ దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తుంది. భారత్‌లో ఉద్యోగాలను కూడా కల్పిస్తుంది. అలాంటి ఒప్పందాన్ని ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు. రక్షణ ఉత్పత్తుల్లో వీలైనన్ని భారత విడిభాగాలను వినియోగించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

రూ.70 వేల కోట్ల టర్నోవర్‌ను

దాచేసిన రెస్టారెంట్లు

» పన్ను ఎగవేతకు బిల్లింగ్‌లో భారీగా అక్రమాలు

» ముందు హైదరాబాద్‌లో తనిఖీలతో వెలుగులోకి.. తర్వాత ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో ఐటీ దాడులు

హైదరాబాద్/బెంగళూరు, ఫిబ్రవరి 19: హైదరాబాద్‌లో కొన్ని రెస్టారెంట్లపై గత నవంబరులో నిర్వహించిన సాధారణ తనిఖీలు.. దేశవ్యాప్తంగా రెస్టారెంట్ల రంగంలో ఓ భారీ పన్ను కుంభకోణాన్ని బయటపెట్టాయి. అనేక రెస్టారెంట్లు పన్ను ఎగవేయడానికి మొత్తం రూ.70 వేల కోట్ల టర్నోవర్‌ను లెక్కల్లో చూపకుండా దాచేశాయి. ఓ పేరొందిన బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫాంను దుర్వినియోగం చేస్తూ టర్నోవర్‌ను తగ్గించి చూపించాయని ఆదాయం పన్ను శాఖ అధికారులు గుర్తించారు. 2019-20 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు 1.77 లక్షల రెస్టారెంట్ల లావాదేవీలకు సంబంధించిన 60 టెరాబైట్ల డాటాను హైదరాబాద్‌లోని ఆయకార్ భవన్‌లోని డిజిటల్ ల్యాబ్‌లో ఫోరెన్సిక్ విశ్లేషణ చేశారు. ఇందుకు కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐ టూల్స్‌ను ఉపయోగించారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఆయా రెస్టారెంట్ల మొత్తం బిల్లింగ్ 2.43 లక్షల కోట్లలో రూ.13,317 కోట్ల లావాదేవీలను బిల్లింగ్ చేసిన తర్వాత లెక్కల్లోంచి తొలగించినట్లు అధికారులు గుర్తించారు. టర్నోవర్‌ను తగ్గించడానికి రెస్టారెంట్ల యజమానులు వివిధ మార్గాలను అనుసరించినట్లు కనుగొన్నారు. రెస్టారెంట్ల యజమానులు నగదు చెల్లింపులను ముందు బిల్లింగ్ సిస్టమ్‌లో నమోదు చేసినా తర్వాత వాటిలో కొన్నింటిని తొలగించారు. మధ్య మధ్యలో కొన్ని రోజుల బిల్లింగ్ రికార్డులను మాయం చేశారు. కొన్ని రెస్టారెంట్లు బిల్లింగ్ ఎంట్రీలను డిలీట్ చేయకపోయినా టర్నోవర్‌ను తగ్గించి చూపాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లలో 3,734 పాన్ కార్డులకు సంబంధించి రూ.5141 కోట్ల టర్నోవర్‌ను తగ్గించి చూపించారని ఐటీ అధికారులు గుర్తించారు. రెండు రాష్ట్రాల్లోని ఓ 40 రెస్టారెంట్లే రూ.400 కోట్ల టర్నోవర్‌ను తగ్గించి చూపాయి. చాలా రెస్టారెంట్లు అమ్మకాలను 27 శాతం తగ్గించి చూపాయని అధికారులు అంచనాకు వచ్చారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లకు చెందిన రెస్టారెంట్లు ఈ స్కామ్‌లో తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ముందు హైదరాబాద్, తర్వాత ఏపీలోని విశాఖపట్నంలో రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి.. అక్కడ గుర్తించిన అక్రమాల ఆధారంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించాలని నిర్ణయించింది.

ఉచితాలు ఎంత కాలం?

చెన్నై న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పప్పు బెల్లాల్లా ఉచిత పథకాలను పంచిపెట్టడం పట్ల భారత సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సరిగ్గా ఎన్నికలకు ముందే ప్రభుత్వాలు ఎందుకు సంక్షేమ, ఉచిత కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నాయని ప్రశ్నించింది. ఇలా పంచుకుంటూ పోతే, అభివృద్ధి పనులకు పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. దేశ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కలిగించే విధానాలను పునఃసమీక్షించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. తమిళనాడులో ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ 100 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని స్టాలిన్ ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం తమిళనాడు విద్యుత్ బోర్డ్ (టీఎన్ఈబీ) 23 ఆర్టికల్‌లోని నిబంధనలను సవరించేందుకు సిద్ధమైంది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. రెవెన్యూ లోటు అధికంగా ఉన్నప్పటికీ రాష్ట్రాలు పెద్దఎత్తున ఉచితాలు ఎలా ప్రకటిస్తున్నాయంటూ బెంచ్ విస్మయం వ్యక్తం చేసింది. దీనివల్ల దేశ ఆర్థికాభివృద్ధి దెబ్బ తింటుందని హెచ్చరించింది. రెవెన్యూ లోటు లేని రాష్ట్రాలు సైతం అదనంగా ఉన్న నిధులను రహదారుల అభివృద్ధికి, ఆస్పత్రులకు, స్కూళ్లకు ఉపయోగించవచ్చునని సూచించింది. అందరికీ ఉచితంగా ఆహారం, సైకిళ్లు, విద్యుత్ ఇవ్వడానికి బదులుగా.... ఉపాధి కోసం మార్గాలు తెరిచేందుకు అన్ని రాష్ట్రాలూ కృషి చేయాలని హితవు పలికింది. "దేశంలో మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నాం? సంక్షేమ చర్యల్లో భాగంగా విద్యుత్ చార్జీలు చెల్లించలేని వారికి ఉచితంగా అందిస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ చార్జీలు భరించగల వారికీ ఉచితంగా ఇస్తామనడం సబబేనా? పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ ఇస్తారా?" అని తమిళనాడు ప్రభుత్వాన్ని నిలదీసింది. ఉచితాలకు పెట్టే ఖర్చును విద్యా రంగానికి మళ్లించవచ్చునని, ఆ నిధులతో నిరుద్యోగ సమస్యను పరిష్కరించవచ్చు కదా అని సూచించింది. "ఉచిత ఆహారం, ఉచిత విద్యుత్.. ఇలా అన్నీ ఉచితంగా ఇస్తే ఆపై ఎవరు పని చేస్తారు? పని సంస్కృతికి చెల్లుచీటి ఇవ్వాలనుకుంటున్నారా?" అని బెంచ్ నిలదీసింది.

> "ఎన్నికలు జరిగేందుకు కొద్ది రోజుల ముందు ఉచితాలను ప్రకటించడం ఎంత కాలం కొనసాగుతుంది? ఈ ధోరణి ఇలాగే కొనసాగితే దేశ దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధి కుంటుపడిపోదా? ఈ దేశంలో అసలు ఏం జరుగుతోంది? ఉచితాలు ఎవరికి అవసరమో, ఎవరికి అవసరం లేదో కూడా చూడకుండా, విచక్షణా రహితంగా ప్రభుత్వ నిధులను పంచిపెట్టడం పూర్తిగా బుజ్జగింపు కిందకే వస్తుంది. అది దేశ ఆర్థికాభివృద్ధికి మంచిది కాదు."
> - సుప్రీంకోర్టు

దేశాభివృద్ధికి హానికరం

ప్రభుత్వ రాయితీలను అర్హులు మాత్రమే కాకుండా ఇతరులు కూడా పొందడం దేశాభివృద్ధికి హానికరమని బెంచ్ అభిప్రాయపడింది. అప్పుల భారంలో చిక్కుకున్న స్థితిలో ఉచితాలను ఏ విధంగా పంపిణీ చేస్తారనేది చెప్పాలని తమిళనాడు ప్రభుత్వాన్ని వివరణ కోరింది. తమిళనాడులో ఉన్నట్లుండి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించడం వెనుక ఆంతర్యమేమిటని అడిగింది. దీని వల్ల విద్యుత్ పంపిణీ కంపెనీలు (డిస్కమ్‌లు) నిధుల కొరతతో బడ్జెట్ లెక్కలకు తగ్గట్లు టారిఫ్ లను సవరించేందుకు ప్రయత్నించాల్సి వస్తోందని పేర్కొంది. విద్యుత్ టారిఫ్‌ను నోటిఫై చేసిన తర్వాత ఇంత బృహత్తర నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని తమిళనాడు విద్యుత్ బోర్డ్‌ను ప్రశ్నించింది. ఇది బుజ్జగింపు రాజకీయం కాదా? అని నిలదీసింది. ప్రజాస్వామ్యంలో ఒక పథకాన్ని ప్రకటించే ముందు, దాని కోసం నిధులు ఎలా సమకూర్చుతారనేది బడ్జెట్‌లో స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొంది. ఉచితాల వ్యయ భారం చివరకు పన్నులు చెల్లిస్తున్నవారిపై పడుతుందని, ఈ పరిస్థితి మారాల్సి ఉందని కటువుగా వ్యాఖ్యానించింది. తమిళనాడు ప్రభుత్వం అనే కాకుండా.. అన్ని ప్రభుత్వాలూ, రాజకీయ పార్టీలూ భారీగా ఉచితాలను ప్రకటించే ముందు పునఃసమీక్షించుకోవాలని సూచించింది. ఈ వ్యవహారంపై అభిప్రాయం తెలపాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం వాదనలు వినిపించారు.

శ్రీవారి వేదాశీర్వచనం టికెట్ల కుదింపు

▸▸ ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే కేటాయించాలని నిర్ణయం

తిరుమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వేదాశీర్వచనం టికెట్లను టీటీడీ కుదించింది. ఇకపై కేవలం ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే ఈ టికెట్లను కేటాయించాలని నిర్ణయించింది. ఐదారేళ్లుగా ప్రొటోకాల్ పరిధిలో లేనివారికీ వేదాశీర్వచనం టికెట్లు ఇవ్వడం ప్రారంభించారు. రోజుకు ఇరవై, ముప్పైలోపు ఉండే ఈ టికెట్లు ప్రస్తుతం వందకుపైగా దాటుతున్నాయి. చాలామంది ఈ టికెట్లు కొనుగోలు చేసి, ఆశీర్వచనం తీసుకోవడం హోదాగా భావిస్తున్నారు. రోజూ దాదాపు వందకుపైగా టికెట్లు ఇస్తున్న క్రమంలో సర్వదర్శన భక్తులు ఇబ్బంది పడుతున్నారని టీటీడీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే ఇకపై వేదాశీర్వచనం టికెట్లను ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకే కేటాయించాలనే నిబంధన పెట్టిన క్రమంలో రెండ్రోజుల్లో కేవలం 10లోపే టికెట్లు జారీ చేసినట్టు తెలిసింది.

బాలికపై హత్యాచారం కేసులో నిందితుడి తల్లిపైనా కేసు నమోదు

▸▸ కొడుకు అఘాయిత్యం చేసిన విషయం తెలిసీ.. పారిపోయినట్టు అనుమానం

▸▸ మున్సిపాలిటీకి కులవర్ధన్ మృతదేహం అప్పగింత



కులవర్ధన్ మృతదేహాన్ని చెత్త బండిలో తరలిస్తున్న మున్సిపల్ కార్మికులు

అన్నమయ్య/మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారి హత్యాచారం కేసులో నిందితుడు కులవర్ధన్‌తోపాటు అతడి తల్లి అంజనమ్మపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు కులవర్ధన్ ఇప్పటికే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేయడం, ఆ తర్వాత నీటి డ్రమ్ములో ముంచడం అతని తల్లికి తెలుసునని పేర్కొంటూ మృతురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసులో అంజనమ్మను రెండో నిందితురాలిగా చేర్చారు. కాగా, సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి బాలిక కనిపించలేదు. అప్పటికి అంజనమ్మ ఇంటి వద్దే ఉంది. సాయంత్రం 5 గంటలకుపైగా బాలిక అవ్వా తాతలు ఆమె కనిపించడం లేదనే విషయాన్ని గుర్తించారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటివరకు ఇంటి వద్దే ఉన్న అంజనమ్మ.. ఆ తర్వాత కనిపించలేదు. బాలికను తన కొడుకు ఇంట్లోకి పిలిచి అఘాయిత్యం చేసిన విషయం తెలిసే.. ఆమె బెంగళూరుకు వెళ్లిపోయిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

చెత్తబండిలో కులవర్ధన్ మృతదేహం తరలింపు

చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన కులవర్ధన్ ఆత్మహత్య తర్వాత.. అంత్యక్రియలు నిర్వహించేందుకు చివరికి కుటుంబసభ్యులు సహా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పోలీసులు మదనపల్లె మున్సిపల్ అధికారులకు లేఖ రాశారు. మున్సిపల్ కార్మికులు గురువారం సాయంత్రం మదనపల్లె ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉన్న కులవర్ధన్ మృతదేహాన్ని చెత్తబండిలో వేసుకుని, పట్టణ శివారులోని డంపింగ్ యార్డుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, సన్నిహితులు కులవర్ధన్ మృతదేహం వద్దని చెప్పడంతో.. 24 గంటలకు పైగా అది మార్చురీకే పరిమితం అయ్యింది.

రాస్తారోకోపై నాలుగు కేసులు

బాలికపై హత్యాచారం నేపథ్యంలో జరిగిన రాస్తారోకోపై మదనపల్లె వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో రెండు, టూటౌన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. మదనపల్లె నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ నిస్సార్ అహ్మద్‌తోపాటు 40 మంది పేర్లు చేర్చారు. అన్నమయ్య సర్కిల్, నీరుగట్టువారిపల్లె కాట్లాటవారిపల్లె జంక్షన్‌లో ఆందోళన సమయంలో విధులకు ఆటంకం కలిగించారని, పక్కకు తోసేశారని, రోడ్డుపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారన్న పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు.

మూడేళ్ల బాలికపై లైంగిక దాడి

▸▸ బిస్కెట్లు ఆశ చూపి 17 ఏళ్ల బాలుడి అఘాయిత్యం

▸▸ విశాఖలో దారుణం.. పోలీసుల అదుపులో నిందితుడు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై ఓ బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నిందితుడిని అదుపులోకి తీసుకుని జువెనైల్ కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగవరం ప్రాంతంలో మూడేళ్ల బాలికను ఓ బాలుడు (17 సంవత్సరాల 11 నెలల 11 రోజులు) బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బిస్కెట్లు కొనిస్తానని చెప్పి.. తనతో తీసుకెళ్లాడు. 5 గంటలకు బాలికను తీసుకువచ్చి, ఇంటి వద్ద వదిలిపెట్టి పరారైపోయాడు. బాలిక ఏడుస్తుండడంతో ఆమె కుటుంబసభ్యులు ఏం జరిగిందని ఆరా తీశారు. బాలికకు రక్తస్రావం కావడంతో పాటు మానసికంగా తీవ్ర ఆందోళనలో ఉండడంతో లైంగిక దాడి జరిగినట్టు గుర్తించారు. న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హార్బర్ ఏసీపీ విట్టలుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది సాక్ష్యాలు సేకరించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం బాలికను కేజీహెచ్‌కు తరలించారు. బాధిత బాలిక కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం నిందితుడిని గంగవరం ఆర్టీస్టాండ్ వద్ద గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అతడు నేరం అంగీకరించాడు. నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 5 (ఎం) రెడ్‌విత్ 6, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, జువెనైల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం

▸▸ పీలేరులో బాలుడికి స్థానికుల దేహశుద్ధి

▸▸ పోలీసుల అదుపులో నిందితుడు

పీలేరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఓ మానవ మృగం చేతిలో ఏడేళ్ల చిన్నారి బలైన ఘటనను మరువక ముందే అన్నమయ్య జిల్లా పీలేరులో నాలుగేళ్ల చిన్నారిపై పదహారేళ్ల బాలుడు లైంగిక దాడి యత్నానికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పీలేరు-మదనపల్లె మార్గంలో ఉన్న కాలనీకి చెందిన 16 ఏళ్ల ఓ బాలుడు ఇంటి వద్దే ఉంటూ కూలీ పనులకు వెళ్తుంటాడు. గురువారం అతను ఆ కాలనీలోనే ఓ ఇంటి నిర్మాణం పనికి వెళ్లాడు. మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో అటుగా వచ్చిన నాలుగేళ్ల చిన్నారిని మరుగుకు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఓ మహిళ ఈ ఘటనను చూసి గట్టిగా కేకలు వేయడంతో పాటు ఆ బాలుడిని పట్టుకుంది. దీంతో గుమిగూడిన ప్రజలు అక్కడే ఆ బాలుడికి దేహశుద్ధి చేశారు. దీంతో భయపడిన అతను అక్కడి నుంచి పరారయ్యాడు. పీలేరు పోలీసులు గురువారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల దాడిలో గాయపడ్డ అతడికి పీలేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చిన్నారిపై లైంగిక దాడికి యత్నానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పలు విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు అక్కడ ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి బాధిత చిన్నారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు.



కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ్ శర్మ కుటుంబ సమేతంగా గురువారం రాత్రి దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆయనకు శేషవస్త్రం, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

పారిశ్రామికవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి

▸▸ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు మంత్రి కొండపల్లి హామీ

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వర్గాలకు ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర సచివాలయంలోని కార్యాలయంలో మంత్రిని కలిసి ఇంజనీరింగ్, ఎంఎస్‌ఎంఈ రంగాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిపింది. ఎంఎస్‌ఎంఈలు పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించేలా ప్రోత్సహించేందుకు స్థిరమైన, పరిశ్రమలకు అనుకూలమైన విధానాన్ని తీసుకురావాలని ఏపీ చాంబర్స్ ప్రతినిధులు మంత్రిని కోరారు. వీటిపై మంత్రి కొండపల్లి సానుకూలంగా స్పందించారు.

వినుకొండ పరిసరాల్లో భూ ప్రకంపనలు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పట్టణానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో భూమి కంపించినట్టు భూగర్భ శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. రిక్టర్ స్కేలుపై తీవ్రత 3.5గా నమోదైనట్టు అధికారులు తెలిపారు. తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో వినుకొండ పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. భూకంప కేంద్రం తక్కువ లోతులో ఉండటం వల్ల ప్రకంపనల తీవ్రత స్పష్టంగా తెలిసినట్టు సమాచారం. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్టు ఇప్పటివరకు నివేదికలు అందలేదు.

మల్లన్న 13 రోజుల హుండీ ఆదాయం రూ.5.61 కోట్లు

▸▸ శ్రీశైలంలో మహా శివరాత్రి కానుకల లెక్కింపు

శ్రీశైలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదిదంపతులకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఉభయ దేవాలయాలు, అన్నప్రసాద భవనం, పరివార దేవాతాలయాల హుండీలలో 13 రోజులుగా భక్తుల నుంచి స్వామి. అమ్మవార్లకు మొక్కులు, కానుకల రూపంలో రూ.5,61,81,535 ఆదాయం వచ్చినట్టు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే 124.500 గ్రాముల బంగారం, 5.550 కిలోల వెండి వస్తువులు కానుకగా సమర్పించారని వెల్లడించారు.

వీఐటీ ఉపాధ్యక్షునికి గౌరవ డాక్టరేట్



శంకర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

చెన్నై, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్‌కు థాయ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. థాయ్‌లాండ్‌లోని 'రాజమంగళం యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ కృంగ్‌తెప్' (ఆర్‌ఎంయూటీకే) ద్వారా 'ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ గౌరవ డిగ్రీని ఆయనకు ప్రదానం చేశారు. ప్రివి కౌన్సిల్ ఆఫ్ థాయ్‌లాండ్ పాలకొర్న్‌సువనరథ్, రాజమంగళ యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ పిచ్చైజన్మనీ తదితరులు ఈ డాక్టరేట్‌ను ఓ ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ విశ్వనాథన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. భారత్, థాయ్‌లాండ్ ఉమ్మడి సంస్కృతి, జ్ఞాన వ్యవస్థలను గుర్తు చేసుకున్నారు. ఇరుదేశాల మధ్య చురుకైన విద్యా సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో వీఐటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, రమణి బాలసుందరం, అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, డాక్టర్ శ్రవణ్ కృష్ణ తదితరులు కూడా పాల్గొన్నారు.

ఏపీకి తీరని అన్యాయం చేస్తున్న బీజేపీ

▸▸ వేల్పూరు రచ్చబండలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం విడిపోయి పదకొండేళ్లు గడుస్తున్నా రాజధాని ఏర్పాటు చేసుకోలేని ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ తీరని అన్యాయం చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరులో గురువారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ప్రశ్నించడం మానేసి బీజేపీకి బానిసలుగా మారాయని ఆరోపించారు. రాష్ట్రానికి 11 ఏళ్ల క్రితమే ప్రత్యేక హోదా రావాల్సి ఉందని, కానీ చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు బీజేపీని అడగకుండా మోదీకి భజనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ఇప్పటికే రూ.11 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తూ బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేస్తుంటే నిలదీయాల్సిన నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొరియా న్యాయం

దక్షిణకొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్‌యోల్ ఇక సుదీర్ఘ జైలుజీవితం గడపాల్సి ఉంటుంది. 2024 డిసెంబరులో దేశంలో సైనికపాలన విధించేందుకు ఆయన చేసిన ఓ ప్రయత్నం ఈ శిక్షకు కారణం. పార్లమెంటును అదుపులోకి తీసుకొని, రాజకీయనేతలను అరెస్టు చేయాల్సిందిగా భద్రతాదళాలను ఆదేశించిన ఆయనకు ఈ శిక్ష సరిపోదని, మరణశిక్ష విధించాల్సిందేనని ప్రాసిక్యూటర్లు న్యాయ స్థానంలో గట్టిగా వాదించారు. సైనికపాలన నిర్ణయాన్ని కొద్దిగంటల్లోనే ఉపసంహరించుకున్నా, తన దుశ్చర్యకు తీవ్ర పశ్చాత్తాపాన్ని ప్రకటించినా, ఆయన అటు అధికారాన్నీ నిలబెట్టుకోలేకపోయారు, ఇటు శిక్షనీ తప్పించుకోలేకపోయారు. ఎంత పెద్ద తప్పుచేసినా తమను తాము సమర్థించుకొనే నాయకులను, వారిని గుడ్డిగా సమర్థించే దిగువస్థాయి నేతలను చూస్తున్న మనకు దక్షిణకొరియా పరిణామాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలోనే ఆయన పదవి పోగొట్టుకొనే పరిస్థితులను సృష్టించుకున్నాడు, కుర్చీని రక్షించుకొనే ప్రయత్నంలో మరిన్ని తప్పటడుగులు వేశాడు. భార్యకు గిఫ్ట్‌రూపంలో వచ్చిన ఒక బ్యాగ్ ఈయన రాజకీయజీవితాన్ని తిరగరాసిందంటారు. ఈ మార్షల్ లా ప్రకటించడానికి కొన్ని నెలలముందు ఆమె ఒక పాస్టర్ నుంచి సుమారు లక్షన్నర రూపాయలు విలువచేసే బ్యాగ్‌ను బహుమతిగా స్వీకరించారు. మొదట్లో అధ్యక్షకార్యాలయం దానిని దుష్ప్రచారంగా కొట్టిపారేసినా, ఆ తరువాత వెలుగుచూసిన ఒక వీడియోలో పాస్టర్‌నుంచి ఆమె బహుమతి స్వీకరిస్తున్న దృశ్యాలు బయటపడి, అధ్యక్ష కార్యాలయం తప్పు ఒప్పుకోవాల్సివచ్చింది, అధికార పార్టీ క్షమాపణలు కోరింది. పాస్టరే రహస్య కెమెరాతో ఈ ఘట్టాన్ని చిత్రీకరించారనట్టుగా ఓ ప్రచారం ఉంది. అప్పటికే పలు అవినీతి ఆరోపణలతో అధ్యక్షులవారి భార్యపట్ల ప్రజల్లో సదభిప్రాయం లేనందున, ఈ సంఘటన యూన్‌సిక్‌యోల్ పరువుప్రతిష్ఠలను మరింత దిగజార్చింది. ఒక ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు కోసం అమాంతంగా భూమి ధరలు పెంచారని, అక్రమంగా అనుమతులు ఇచ్చి యోన్ కుటుంబీకులు బాగుపడ్డారని తీవ్రప్రచారం జరిగిన నేపథ్యంలో అధికారపార్టీ నుంచి కొందరు బయటకుపోయారు కూడా.

ప్రజల్లో ఆదరణ తగ్గి, నమ్మకం సన్నగిల్లుతున్నప్పుడు నాయకుడు కొత్త ఎత్తులు వేస్తాడు. వారిని మాయచేయగలనని అనుకుంటాడు. ఉత్తరకొరియాను బూచిగా చూపి ప్రజల్లోనూ, స్వపక్షంలోనూ తనపై పెరిగిపోతున్న వ్యతిరేకతని అధిగమించగలనని ఆయన భ్రమపడ్డాడు. విపక్షనేతలు దేశవ్యతిరేకశక్తులనీ, దేశద్రోహులతో రహస్య మంతనాలు సాగిస్తున్నారనీ, దేశం తీవ్ర ప్రమాదంలో పడిందనీ, ఉత్తరకొరియా కమ్యూనిస్టు దళాలనుంచి దానిని రక్షించుకోవాల్సి ఉన్నదనీ బెదిరిస్తూ ఆయన సైనికపాలన విధించాడు. అయితే, ప్రజలూ వారి నాయకులూ ఆయన కుట్రని సాగనివ్వలేదు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న నాయకుడు మరో నియంతగా తయారైనాడని గ్రహించిన వేలాది ప్రజలు ఎవరి ప్రోద్బలమూ లేకుండా, స్వల్పకాలంలోనే రోడ్లమీదకు వచ్చి, నినాదాలతో, నిరసనలతో అధినాయకుడిని గడగడలాడించారు. ఉత్తచేతులతో సైన్యం చేతుల్లో ఉన్న తుపాకులు లాక్కున్నారు. స్వపక్ష, విపక్షాలకు చెందిన రెండు వందలమంది ఎంపీలు రాత్రికిరాత్రి గేట్లు దూకి, కంచెలు దాటి పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి అక్కడ ఏకకంఠంతో అధ్యక్షుడి నిర్ణయాన్ని తిరగదోడారు. నెత్తిన యుద్ధవిమానాలు తిరిగే వాతావరణంలో బతుకుతూండే దక్షిణకొరియన్లకు పొరుగుదేశం ఎంత ప్రమాదకరమైనదో తెలిసినప్పటికీ, ఉత్తరకొరియా బూచిని చూపి తమ దేశాధ్యక్షుడు తన తప్పుడు పనులను సమర్థించుకోవడానికి వారు ఒప్పుకోలేదు. అధ్యక్షుడి ఆదేశాలు ఉన్నప్పటికీ, జనాన్ని కొట్టకుండా, కాల్చకుండా వారి నిరసనలను సైన్యం గౌరవించడం మరో విశేషం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి వారూ వీరూ అన్న తేడాలేకుండా అంతా మద్దతు ఇవ్వడంతో యూన్ సుక్‌యోల్ మారు మాట్లాడకుండా గద్దెదిగాల్సివచ్చింది. తిరుగుబాటుకు ప్రయత్నించారన్న ఆరోపణలమీద ఆయనపై దర్యాప్తు సాగింది. నాలుగుదశాబ్దాల క్రితం వరకూ సైనికపాలనను అనుభవించిన దక్షిణకొరియా ప్రజలు నియంతృత్వం తిరిగి తలెగరేయకుండా జాగ్రత్తపడినందుకు మెచ్చుకోవాలి. దక్షిణకొరియాలో అరెస్టయిన తొలి సిట్టింగ్ ప్రెసిడెంట్‌గా రికార్డులకు ఎక్కిన సుక్‌యోల్ ఇకపై మిగతా జీవితం జైల్లో గడపాల్సివస్తుంది.

> యూరోపియన్ యూనియన్, అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలలో వ్యవసాయం, పాడి ఉత్పత్తులు వివాదాస్పద అంశాలుగా ఉన్నాయి. స్థానికంగా పాల ఉత్పత్తిని పెంపొందించి దేశీయ పాడి ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం వల్ల గ్రామీణ కుటుంబాల ఆదాయాలు పెరిగి, వారికి మరింత ఆర్థిక శ్రేయస్సు సమకూరుతుంది.

పేదల పెన్నిధిగా ‘పాడి’ పథం

జీవన దృశ్యాలు కొన్ని ఎప్పటికీ మనతో ఉంటాయి. దశాబ్దాల నాటి ఒక పల్లె జీవన దృశ్యం ఒక స్ఫూర్తిదాయక భావచిత్రంలా నా మనసులో నిలిచిపోయింది. రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో ఉన్నప్పటి మాట ఇది. ఆ రోజు కోళ్లు కూయక ముందే నిద్ర నుంచి మేల్కొన్నాను. పొగమంచు ఆ పల్లెను దట్టంగా కమ్మేసి ఉంది. ఆ ఊరులో ఉన్న పాల సేకరణ కేంద్రంకు వెళ్లేందుకు సమాయత్తమయ్యాను. ఒక మామూలు ఇంటిలో ఆ కేంద్రం ఉన్నది. లోపల పలువురు మహిళలు బారులు తీరి ఉన్నారు. ఒక్కొక్కరు తమ చేతుల్లో ఉన్న ఇత్తడి పాత్రను ఒక చిన్న వెయింగ్ మెషీన్ మీద ఉంచుతున్నారు. క్షణాల్లో ఒక ప్రింటెడ్ స్లిప్‌ను తీసుకుని తమ పాత్రల్లోని పాలను ఒక పెద్ద డబ్బాలో పోస్తున్నారు. ఆ మహిళల్లో అక్షరాస్యులు ఒక్కరూ లేరు. తాము సరఫరా చేసిన పాల పరిమాణాన్ని, ఆ పాలలో కొవ్వు ఎంత ఉన్నదో నమోదు చేసి ఉన్న ఆ ప్రింటెడ్ స్లిప్‌ను ఆత్మవిశ్వాసంతో చూపారు. పాల పరిమాణం, అందులోని కొవ్వును బట్టి వారికి చెల్లింపులు జరుగుతాయి. ఆ మహిళలు సరఫరా చేసిన పాలతో నిండిపోయిన పెద్ద డబ్బాలను చిన్న వాహనం మీదకి చేర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పాల ఉత్పత్తి కేంద్రాలకు పంపుతారు. ఇది చదివాక మీకిప్పుడు అమూల్ గుర్తొస్తోందా? అవును, మన దేశంలో పాల ఉత్పత్తిని ఇతోధికంగా పెంచిన శ్వేత విప్లవాన్ని సాధించిన అమూల్ పాడి పరిశ్రమ నమూనా అది. అనేకానేక ఆవులు, గేదెలతో కూడిన పాల ఉత్పత్తి కేంద్రం లేదా ఒకటి లేదా రెండు గేదెలు ఉన్న ఒక కుటుంబం అమూల్ నమూనా సహకార పాడి పరిశ్రమలో భాగమే.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

నాటి ఆ పల్లె జీవన దృశ్యానికి వర్తమాన ప్రాసంగికత ఉన్నది. ఒక కొత్త ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఉనికిలోకి వస్తోన్న కాలమిది. ప్రతి దేశమూ సొంత సహజ వనరులు, ఆర్థిక బలాల ప్రాతిపదికన భద్ర భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఆరాట పడుతున్న రోజులివి. మనం కూడా అభివృద్ధి చెందడానికి ఉత్తమ మార్గం ఏమిటో తెలుసుకోవలసిన సమయమిది. మనం అనుసరించాల్సిన అభివృద్ధి సాధన మార్గం పాత సంపన్న దేశాల అభివృద్ధి పథానికి భిన్నంగా ఉండి తీరాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తన పెత్తనాన్ని నిలుపుకోవడానికి ఆ పాత సంపన్న దేశాలు నానా విధాలుగా ప్రయత్నిస్తున్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు.

మళ్లీ పాడి పరిశ్రమ విషయానికి వద్దాం. పాశ్చాత్యదేశాలు ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో అనుసరించే పద్ధతులనే ఈ రంగంలోనూ అనుసరిస్తున్నాయి. పారిశ్రామిక సంస్థల తరహాలో భారీ స్థాయిలో పాలను ఉత్పత్తి చేస్తాయి. ఉత్పత్తి కేంద్రాల్లో భారీ యంత్రీకరణ విధిగా ఉంటుంది. పాల ఉత్పత్తి కార్యకలాపాలు భారీ స్థాయిలో ఉన్నప్పుడే పాల ఉత్పత్తి భారీ పరిమాణంలో ఉంటుందని, తద్వారా మరింత అధికంగా విక్రయించి అధిక లాభాలు ఆర్జించడం సాధ్యమవుతుందనే భావన పాశ్చాత్య పాడి పరిశ్రమ నమూనాకు ప్రాతిపదిక. అయితే అటువంటి భారీ లాభార్జనకు పెద్ద మూల్యమే చెల్లించవలసివస్తోంది. క్రిమి సంహారక మందులు, యాంటీ బయోటిక్స్ మొదలైన బాహ్య ఉత్పాదకాలపై అధికంగా ఆధారపడడం



వాతావరణ కాలుష్యానికి, ఆహార భద్రతా సమస్యలకు దారితీస్తోంది. పాల సరఫరా సగటు ఆదాయపరులకూ అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వాలు సబ్సిడీలనిస్తున్నాయి. అయితే గిరాకీ కంటే పాల సరఫరా అధికంగా ఉండడంతో పాడి పరిశ్రమ సమస్యలు సంక్లిష్టమయ్యాయి. దీంతో ఉత్పత్తిదారులకు కొత్త మార్కెట్లు అవసరమవుతున్నాయి.

విదేశీ పాడి ఉత్పత్తులను తమ మార్కెట్‌లోకి అనుమతించే విషయమై ప్రపంచ దేశాలు తర్జన భర్జనపడుతున్నాయి. విదేశీ పాడి ఉత్పత్తులను అనుమతిస్తే తమ పాల ఉత్పత్తిపైన ప్రతికూల ప్రభావం పడుతుందని, రైతుల శ్రేయస్సు దెబ్బతింటుందని అభివృద్ధి చెందుతున్న దేశాలు సంశయిస్తున్నాయి. ఈ అంశం సంపన్న, పేద దేశాల మధ్య వివాదాస్పదంగా ఉండడంలో ఆశ్చర్యం లేదు. మెర్కోసూర్ (బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే, బొలీవియాల స్వేచ్ఛా వాణిజ్య కూటమి) దేశాలతో వాణిజ్య ఒప్పందం తమకు నష్టదాయకంగా పరిణమించవచ్చని యూరోపియన్ యూనియన్ దేశాలు సంకోచిస్తున్నాయి. పాడి ఉత్పత్తులలో లాటిన్ అమెరికా దేశాలు తమకు పోటీ కావడాన్ని యూరోపియన్ దేశాలు భరించలేకపోతున్నాయి మరి. ఇటీవల యూరోపియన్ యూనియన్, అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలలో కూడా వ్యవసాయం, పాడి ఉత్పత్తులే అత్యంత వివాదాస్పద అంశాలు కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని మన పాడి పరిశ్రమ అభివృద్ధి నమూనా ఎలా భిన్నమైనదో, మన ఆర్థిక భద్రతకు అది ఎలా భరోసా కల్పిస్తుందో అర్థం చేసుకోవల్సిన అవసరమున్నది.

ప్రపంచ అగ్రగామి పాల ఉత్పత్తిదారుల్లో భారత్ ఒకటి. నేడు ప్రపంచ పాల ఉత్పత్తిలో నాల్గవ వంతును మన దేశమే ఉత్పత్తి చేస్తోంది. గత దశాబ్దంలో మన పాడి పశువుల రంగం ఏడు శాతం అభివృద్ధిని సాధించింది. ఇదెలా సాధ్యమయింది? పాడి ఉత్పత్తుల రంగంలోని కార్పొరేట్ కంపెనీల వల్ల కాదు, పాల ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్న లక్షలాది కుటుంబాల వల్లే ఆ పెరుగుదల సాధ్యమయింది. నేను తొలుత ప్రస్తావించిన రాజస్థానీ మహిళల లాంటి సామాన్య పౌరులే పాడి పశువుల పెరుగుదలకు ప్రధాన కారకులు. ఇది అద్వితీయమైన పెరుగుదల. ఈ అభివృద్ధి లక్షలాది కుటుంబాలకు మంచి ఆదాయాన్ని సమకూరుస్తోంది. వారు ఆ ఆదాయాన్ని తమకు మరింత శ్రేయోదాయక జీవితాన్ని సమకూర్చుకునేందుకు వినియోగిస్తున్నారు.

ఈ ఆర్థికాభివృద్ధి నమూనాలో మరో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి, వ్యయాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచడం. దీనివల్ల వినియోగదారులకు ఆహారం మరింత చౌకగా అందుబాటులో ఉంటుంది. రైతులకూ మంచి ఆదాయం సమకూరుతుంది. ఉత్పాదకాలను పరిమితంగా ఉపయోగించడమనేది మరో అంశం. పారిశ్రామిక తరహా పాల ఉత్పత్తి వ్యవస్థల్లో పశువులకు సోకే వ్యాధులను నిరోధించేందుకు చేసే వ్యయం భారీ స్థాయిలో ఉంటుంది. పశుగణాలను ఆరోగ్యకరంగా ఉంచేందుకు యాంటీ బయోటిక్స్‌ను నిత్యం ఉపయోగిస్తారు. భారతీయ రైతులు పశుపోషణలో పాటించే పద్ధతులు ఆరోగ్యకరమైనవి. జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ మన సంప్రదాయ పశుపోషణ పద్ధతులను తప్పక ప్రోత్సహించాలి. యాంటీ బయోటిక్స్ వాడకాన్ని తగ్గించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

దేశీయ ఉత్పత్తులను వినియోగించుకోవడాన్ని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎగుమతులే లక్ష్యంగా ఉండే ఉత్పాదక కార్యకలాపాల వల్ల సంక్షేమం సమకూరదు. గ్రామీణ కుటుంబాలు సొంత గృహాలలో పండించుకున్న కూరగాయలను ఎక్కువగా వినియోగించుకోవాలి. అలాగే పట్టణ కుటుంబాలు పరిసర ప్రాంతాలలో పండించే కూరగాయలు, పండ్లను ఎక్కువగా వినియోగించుకోవాలి. స్థానిక ఉత్పత్తుల వినియోగం పెరుగుదలతో స్థానిక మార్కెట్లు బలపడతాయి. పాల వినియోగం పెరుగుతున్నందున స్థానికంగా ఉత్పత్తి అయ్యే పాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రాధాన్యమివ్వాలి. మన పాడిపరిశ్రమకు లక్షలాది కుటుంబాలు ఆలంబనగా ఉన్నాయి. వారి సామూహిక కృషిని ఇతోధికంగా ప్రోత్సహించాలి. తద్వారా సామాన్య ప్రజలు మరింత ఆదాయ లబ్ధిని పొందుతారు.

(‘సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్’ డైరెక్టర్ జనరల్, ‘డౌన్ టు ఎర్త్’ సంపాదకురాలు)

రెక్కలు విరిగిన విద్యార్థి విప్లవాలు

నిన్న బంగ్లాదేశ్‌లో, మొన్న మయన్మార్‌లో ముగిసిన, మరో పక్షం రోజుల్లో నేపాల్‌లో జరగనున్న పార్లమెంటరీ ఎన్నికలు దక్షిణాసియా రాజకీయ మనఃస్థితిని నిర్దేశిస్తున్నాయి. ఈ మూడు పార్లమెంటరీ ఎన్నికలు కేవలం ప్రజాస్వామిక పరివర్తనలు మాత్రమే కాదు, అవి విద్యార్థుల తిరుగుబాటుతో సుదీర్ఘంగా కొనసాగిన రాజకీయ అల్లకల్లోల పరిస్థితుల నుంచి పర్యవసించిన చరిత్రాత్మక సంఘటనలు.

బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ ఛాత్ర శిబిర్, జాతీయోబాదీ ఛాత్రదళ్ నాయకత్వంలో యువజనులు షేక్ హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన తిరుగుబాటులో యువనేతలు నహీద్ ఇస్లాం, సర్జిస్ ఆలం కీలకపాత్ర వహించారు. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వాన్ని శాసనోల్లంఘన ఉద్యమం ద్వారా ప్రతిఘటించడంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు అగ్రగాములుగా నిలబడ్డారు. ప్రజాస్వామ్య అనుకూల శక్తులు అయిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీతోను, నేషనల్ యూనిటీ గవర్నమెంట్‌లోని ప్రజాస్వామ్యవాదులతోను విద్యార్థులు కలిసికట్టుగా, 2021లో కుట్రతో అధికారాన్ని కైవసం చేసుకున్న సైనికాధికారులను తీవ్రంగా వ్యతిరేకించారు.


నేపాల్‌లో ఉవ్వెత్తున ఎగసిన జెన్–జీ యువజనుల నిరసనలు ప్రభుత్వ వ్యవస్థలోను, సమాజంలోను పెచ్చరిల్లిపోయిన అవినీతిని ప్రతిఘటించి, నిర్మూలించడమే లక్ష్యంగా జరిగాయి. 2008 అనంతరం నేపాల్ రాజకీయాలలో చరిత్ర తిరస్కృతికి గురైన రాజరిక కాలం నాటి కులీన వర్గాలే మళ్లీ పెత్తందారులు కావడాన్ని జెన్–జీ తరం సహించలేకపోయింది. నేపాల్ చరిత్రాత్మక ఉద్యమాల (1990 జన్ ఆందోళన్, 2006 పీపుల్స్ మూవ్‌మెంట్ మొదలైనవి) వలే కాకుండా జెన్–జీ యువజనుల సమీకరణ చాలా నిష్పాక్షికంగా జరిగింది. సామాజిక మాధ్యమాల ద్వారా అపూర్వరీతిలో జెన్–జీ నిరసనకారుల మధ్య సమన్వయం సాధ్యమయింది. రాబోయే ఎన్నికలలో సంప్రదాయ రాజకీయవర్గాలను వ్యతిరేకిస్తున్న శక్తులను పటిష్ఠపరచడంలో యువ ఉద్యమకారులు తీవ్ర కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా 2022లో ఖాట్మండ్ మేయర్ పదవికి ఎన్నికైన స్వతంత్ర అభ్యర్థి బాలెన్ షాకు పూర్తి మద్దతునిస్తున్నారు. సంప్రదాయేతర రాజకీయ శక్తుల వైపు జెన్–జీ మొగ్గు చూపుతోందనడానికి ఇది స్పష్టమైన తార్కాణం. అయితే నేపాల్‌లో జెన్–జీ నిరసనకారులు దేశవ్యాప్త యువజన పార్టీగా సంఘటితం కాలేదు.


ఈ మూడు దేశాల– బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్– లోను యువజనుల నిరసనలు, ఉద్యమాల తరువాతనే ఎన్నికలు జరగడం గమనార్హం. రాజకీయ మార్పులను సాధించడంలో విద్యార్థి ఉద్యమాల ప్రభావశీలతను అది ధ్రువీకరిస్తోంది. ఈ విద్యార్థి ఉద్యమాలు ప్రభుత్వాలను కూల్చివేయడంలో విజయవంతమవుతున్నాయి, సందేహం లేదు. కొత్త పాలకులను ఎన్నుకునేందుకు ఎన్నికల నిర్వహణను అనివార్యం చేయగలుగుతున్నాయి. తీరా ఎన్నికల అనంతరం అధికార వ్యవస్థలను కైవసం చేసుకుంటున్నది మాత్రం సువ్యవస్థిత పార్టీలు, సంప్రదాయ రాజకీయ శక్తులే కావడం విస్మరించలేని వాస్తవం.

విద్యార్థి ఉద్యమాల ప్రభావశీలతకు, వాటి రాజకీయ లక్ష్యాల సాధనకు మధ్య ఉన్న అంతరానికి నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ) ఒక తాజా ఉదాహరణ. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటు నుంచి ప్రభవించిన ఈ పార్టీ కన్వీనర్ నహీద్ ఇస్లాం ఇటీవలి పార్లమెంటరీ ఎన్నికలలో ఢాకా నుంచి విజయం సాధించారు. ఢాకాతో పాటు కేవలం అయిదు స్థానాలలో మాత్రమే ఎన్‌సీపీ విజయం సాధించింది. ఈ యువ విప్లవకారులు ఒక సంఘటిత రాజకీయ శక్తిగా ఎందుకు ప్రభవించలేకపోయారు? హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి పోరాటం ఒక తరం మార్పుకు ఆరంభంగా కనిపించింది. అయితే అది ఆరంభంగానే మిగిలిపోయింది. ఎన్నికల పోరాటంలో సంపూర్ణ విజయంగా పర్యవసించలేదు.. బంగ్లా విద్యార్థుల పోరాటం సువ్యవస్థిత పాలక వర్గాలను కదిలించి వేసింది. అయితే వారిని పూర్తిగా రంగం నుంచి తొలగించలేకపోయింది. తారీఖ్ రెహ్మాన్ నాయకత్వంలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ మళ్లీ ఢాకాలో అధికారానికి వచ్చింది. బంగ్లా సంప్రదాయ పాలక పార్టీలలో అది ఒకటి. మౌలికంగా ప్రగతిశీల కొత్త శక్తులేవీ అధికారానికి రాలేదు.

> విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడతాయి. ప్రజా చర్చలను ప్రభావితం చేస్తాయి. అధికార పీఠాలపై ఉన్న వారిని కూలదోస్తాయి. అయితే ఉద్యమకారులు రాజ్యాధికారంలో భాగస్వాములు కావడం జరగదు. విద్యార్థి ఉద్యమాల చరిత్ర పాఠమిది. వీధుల్లో నిర్వహించే పోరాటాలకు మద్దతు పొందడమనేది ఎన్నికలలో విజయ సాధనకు మౌలికంగా భిన్నమైనది. మన ఇరుగుపొరుగు దేశాల పార్లమెంటరీ ఎన్నికలే అందుకు నిదర్శనం.

ఇటీవలే ముగిసిన మయన్మార్ ఎన్నికలలో కూడా ఇటువంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. సైన్యం





మద్దతు ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యూఎస్‌డీపీ) నిర్ణయాత్మక విజయం సాధించింది. విద్యార్థుల క్రియాశీలత పార్లమెంటరీ పోరాట పద్ధతులుగా పరిణమించలేదు. చారిత్రకంగా మయన్మార్‌లో ప్రభావశీల పౌర రాజకీయ శక్తి నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ. కుట్రతో అధికారంలోకి వచ్చిన సైనికాధికారులు ఆ ప్రజాస్వామిక సంస్థను పూర్తిగా అణచివేశారు. ఆంగ్‌సాన్ సూకీపైనే ఆధారపడి ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని అభివృద్ధి పరచుకోవడంలో ఎన్‌ఎల్‌డీ విఫలమవడం కూడా దాని అణచివేతకు దారితీసింది. సూకీ అధికారంలోకి వచ్చిన తరువాత, 1988 విప్లవంలో ప్రముఖ పాత్ర వహించిన విద్యార్థినాయకులు ఎవరినీ ఆమె ఏ విధంగానూ ప్రోత్సహించలేదు.

విద్యార్థి ఉద్యమాలు విశాల సమాజం నుంచి సంపూర్ణ మద్దతును పొందుతున్నాయి. రాజకీయ, పాలనా వ్యవస్థల్లో మౌలిక మార్పులపట్ల విస్తృత స్థాయిలో ఆశాభావాలను నెలకొల్పుతున్నాయి. విశ్వవిద్యాలయాలు చైతన్యశీల భావాలకు నెలవులు. అక్కడి విద్యార్థి లోకంలో భావవ్యాప్తి శీఘ్రగతిన జరగడం పరిపాటి. వ్యవస్థలను ప్రతిఘటించడంలో ముందుండడమే కాకుండా, ఆ కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే ఎలాంటి చిక్కులనైనా ఎదుర్కోవడానికి వారు సాహసిస్తారు. ఆ సాహస గుణం వల్లే విద్యార్థి ఉద్యమాలు ప్రభావదాయకమూ, సంచలనాత్మకమూ అవుతున్నాయి.

నేపాల్ పార్లమెంటుకు త్వరలో జరగనున్న ఎన్నికలు భారత్‌తో సహా ఇరుగు పొరుగు దేశాలనే కాకుండా అంతర్జాతీయ సమాజం దృష్టిని కూడా విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మున్నెన్నడూ లేని రీతిలో జెన్–జీ నిరసనలు ప్రజ్వరిల్లడమే అందుకు ప్రధాన కారణం. ఆ ఉద్యమానికి చెప్పదగ్గ ప్రభావశీల నాయకులు ఎవరూ లేరు. ఆ ఉద్యమం చాలావరకు వికేంద్రీకృతంగా జరిగింది. పార్లమెంటరీ ఎన్నికలలో పోటీ చేస్తున్న యువ నాయకుల్లో కొంతమందికి మునిసిపాలిటీల స్థాయిలో పాలనానుభవం ఉన్నది. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఉద్యమానికి నేషనల్ సిటిజన్స్ పార్టీ వలే నేపాల్ యువ ఉద్యమకారులను సంఘటితపరిచిన ఒక దేశవ్యాప్త సంస్థ ఏదీ లేదు. ఏ ఉద్యమానికి అయినా పటిష్ఠ సంస్థాగత నిర్మాణమూ, దీర్ఘకాలిక లక్ష్యమూ, నిబద్ధత తప్పనిసరిగా ఉండాలి. బంగ్లాదేశ్‌లో వలే నేపాల్‌లో కూడా యువ ఉద్యమకారులు ఎన్నికలలో ప్రభావశీల విజయాలు సాధించలేకపోయేందుకే ఆస్కారమున్నది.

యువజన ఉద్యమాలు, నిరసన పోరాటాలూ స్వతఃసిద్ధంగా తాత్కాలికమైనవి. సువ్యవస్థిత రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, మత సంబంధ సంస్థల కార్యకర్తల వలే విద్యార్థి ఉద్యమకారులు లక్ష్యంపై దృష్టి కేంద్రీకరించి సుదీర్ఘకాలం పోరాడేందుకు అవసరమైన యంత్రాంగం ఉండదు. సరైన, పటిష్ఠ నాయకత్వ లోపం గురించి మరి చెప్పనవసరం లేదు. మద్దతుదారులు కూడా ఉద్యమంపై త్వరితంగా ఆసక్తి కోల్పోవడం కద్దు. ఏ సమస్యల పరిష్కారానికి ఉద్యమం ప్రారంభమయిందో వాటిని విస్మరిస్తారు. నిజానికి చాలా మందికి ఆ సమస్యలపై సరైన, లోతైన అవగాహన ఉండదు. లక్ష్య సాధన పట్ల నిబద్ధత కూడా ఉండదు.

విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడతాయి. సమాజంతో సంభాషిస్తాయి. ప్రజా చర్చలను ప్రభావితం చేస్తాయి. అధికార పీఠాలపై ఉన్న వారిని కూలదోస్తాయి. తాము నిలదీసిన సమస్యలను పరిష్కరించేందుకు, ఎలుగెత్తిన లక్ష్యాల పరిపూర్తికై రాజ్యవ్యవస్థలో అంతర్భాగమయ్యేందుకు పోరాడుతాయి. అదొక ఎడతెగని పోరాటం! విద్యార్థి ఉద్యమాల చరిత్ర పాఠమిది. ఇది పునరావృతమవుతూనే ఉంటుంది. వీధుల్లో నిర్వహించే పోరాటాలకు మద్దతు పొందడమనేది ఎన్నికలలో విజయసాధనకు మౌలికంగా భిన్నమైనది. ఉద్యమిస్తున్న వేళ లభించే ప్రాధాన్యం, మహత్వాన్ని అధికార కైవసంగా భ్రమపడకూడదు. మన ఇరుగుపొరుగు దేశాల పార్లమెంటరీ ఎన్నికలే అందుకు నిదర్శనం.

■ రమీ నిరంజన్ దేశాయ్
ఇండియా ఫౌండేషన్
(ది ప్రింట్)

సామాజిక న్యాయం ఎక్కడ?

మనది ప్రజాస్వామ్య దేశం. ప్రజలు ఇచ్చిన అధికారంతో అందరికీ సమన్యాయం కల్పిస్తామని, కుల, మత, ప్రాంత, లింగ, పేద–ధనిక భేదాలు లేకుండా రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తామని ప్రజా ప్రతినిధులు ప్రమాణం చేస్తారు. కానీ, జరుగుతున్నది ఏమిటి? అధికారంలోకి వచ్చే వరకు ఒక మాట, ఆ తర్వాత మరో మాట పాలకులకు అలవాటుగా మారింది. ఫలితంగా ప్రజలకు సమాన అవకాశాలు, సమన్యాయం దక్కడం లేదు. ఉపాధి అవకాశాలు సన్నగిల్లాయి. నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చింది. రోజురోజుకూ ప్రజల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. ప్రపంచంలో చాలా దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే.. మనం కుల, మతాల ఊబిలో కూరుకుపోతున్నాం. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పక్షం సహించలేకపోతోంది. కేసులు నమోదవుతున్నాయి. ఒకప్పుడు ప్రధాని, ముఖ్యమంత్రి ఒక మాట చెప్పారంటే.. అది ఒక శాసనం. ఎంతో విలువైనది. ఇచ్చిన మాట కచ్చితంగా అమలు చేస్తారన్న భరోసా ప్రజల్లో ఉండేది. కానీ ఏం జరుగుతోంది? వారి మాటకు విలువ తగ్గుతోంది. ప్రజా శ్రేయస్సు ముందు వారి ప్రచారకాంక్ష పతాక స్థాయికి చేరింది. కెమెరాల చూపును బట్టి వారి హావభావాలు, ప్రసంగాలు, నిర్ణయాలు ఉంటున్నాయి. ఇది విపరీత ధోరణి.

ఇక బడ్జెట్ లెక్కలకు, వాస్తవ లెక్కలకు పొంతన ఉండడం లేదు. పార్లమెంట్, అసెంబ్లీల సాక్షిగా చెబుతున్న ఈ లెక్కలు గాడి తప్పుతున్నాయి. వీటిని కాగ్ నివేదికలు ధ్రువపరుస్తున్నాయి. బడ్జెట్ సమావేశాలంటే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూసేవారు. తమ వర్గానికి, తమ ప్రాంతానికి ఏ విధమైన లబ్ధి చేకూరనుంది? ఏయే రంగాలపై ప్రభావం పడుతుంది? ఏ పథకాలకు కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయి? కొత్త పథకాలు ఏమైనా వస్తున్నాయా? వంటి చర్చలు జరిగేవి. నేడు సామాన్యుల్లో ఆ ఉత్సుకత కొరవడింది.

బడ్జెట్ అంటే కార్పొరేట్‌లకు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రధానమైంది. వారి ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. ఇక క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేశారంటే.. ఇందులో కచ్చితంగా కార్పొరేట్, ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధానపరమైన నిర్ణయాల కోసమేనని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక సామాజిక న్యాయం ఎక్కడ లభిస్తుంది? ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను, ఈ బడ్జెట్‌లో మధ్య తరగతి వర్గాలకు కేటాయింపులపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు వెంటనే ఆమె సమాధానం ఇవ్వలేకపోయారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీటిని గమనించినప్పుడు బడ్జెట్ ఓ ప్రహసనంగా మారిపోయింది.

ప్రజాపాలన అంటే ఏవో ఒకటి, రెండు పథకాలు పేదల మొహాన కొట్టడం కాదు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం. ప్రశ్నించే తత్వాన్ని పాదుగొల్పడం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించడం. ప్రతి ఒక్కరికీ తిండి, గూడు, విద్య, ఉపాధి, ఆరోగ్యం మొదలైనవి కల్పించే విధంగా వ్యవస్థను రూపొందించడం. కానీ, పుట్టుకతో కుల, మత, లింగ పరమైన వివక్ష ఉన్న మన దేశంలో ఇది సాధ్యమేనా? ఓట్ల రాజకీయం నడుస్తున్నంత కాలం, ప్రశ్నించే వారిని అణగదొక్కుతున్నంత కాలం ప్రజల ఆర్థిక స్థితిగతులు మారవు. ఇవి మారకుంటే మేధో వికాసం జరగదు. ఆకలి, అనారోగ్యం జమిలిగా చుట్టేస్తాయి. పాలకులు ఒక వర్గానికే కొమ్ము కాస్తూ.. వారి ప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్న వర్తమానంలో కార్పొరేట్లు మరింత వృద్ధి చెందుతున్నారు. ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే వారు అడుగుతున్న రాయితీలతో పాటు కోరిన కోర్కెలన్నీ తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటు విషయంలోనూ, ఖాయిలా పడిన వాటికి ఇదే సూత్రం వర్తించాలి. వీరికీ రాయితీలు కల్పించాలి. అప్పుడే పారిశ్రామికీకరణలో సామాజిక న్యాయం జరుగుతుంది. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కానీ, వీటిపై పాలకులు ఎందుకో మక్కువ చూపరు. కార్పొరేట్లయితే ఎన్నికల వేళ కోట్లు కుమ్మరిస్తారు కదా! ఇదే విషయాన్ని ఎన్నికల బాండ్లు ధ్రువపరుస్తున్నాయి.

> ప్రజా పాలన అంటే ఏవో ఒకటి, రెండు పథకాలు పేదల మొహాన కొట్టడం కాదు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం. ప్రశ్నించే తత్వాన్ని పాదుగొల్పడం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించడం. ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, విద్య, ఉపాధి, ఆరోగ్యం మొదలైనవి కల్పించే విధంగా వ్యవస్థను రూపొందించడం.



147 కోట్ల జనాభా ఉన్న సువిశాల భారతదేశంలో అప్పులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇవి సుమారు 200 లక్షల కోట్లకు చేరుకోనున్నాయి. అదే సమయంలో కార్పొరేట్ సంస్థల ఆదాయం వృద్ధి చెందుతోంది. వీరు ప్రపంచ ధనవంతులతో పోటీ పడుతున్నారు. దేశ సంపదలో 46శాతం, ఒక శాతం మంది దగ్గర గుట్టగా పడి ఉంది. పది శాతం మంది దగ్గర 75శాతం సంపద పోగు పడింది. మిగిలిన 90 శాతం మంది వద్ద కేవలం 25 శాతం సంపదే ఉంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం, ప్రపంచంలోని టాప్–100 మంది సంపన్నుల్లో 25 మంది భారత్‌లోనే ఉన్నారు. 2025 నాటికి దేశంలో వంద కోట్లకు పైబడి సంపద ఉన్న సంపన్నులు 284 మంది వరకు ఉంటారని ఆ నివేదిక తేల్చింది. ఈ సంఖ్య ఏటికేడాది పెరుగుతూనే ఉంటుంది. అదే సమయంలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవన స్థితిగతులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. వీరి పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలి. సంపద పునఃపంపిణీ జరగాలి. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఇచ్చే సబ్సిడీలు–రాయితీలు 4–5 లక్షల కోట్లకు మించడం లేదు. బడ్జెట్‌లో పేదలు కట్టే పన్నులలో తగిన వాటా శ్రమజీవులు పొందాలి. ఎక్కువ సంపద ఉన్న వారిపై పన్నులు వేసి, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలి. పేదరిక నిర్మూలనకు ఈ మార్గాన్ని అనుసరించాలి. కానీ, అలా జరగడం లేదు. మోదీ పాలనలో కార్పొరేట్‌లపై పన్నును 35 నుంచి 22శాతానికి తగ్గించారు. సంపద పన్ను, వారసత్వ పన్ను చట్టాలను రద్దు చేశారు. కార్పొరేట్లకు 20 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారు. పేదలు, సామాన్యులపై మాత్రం పన్నుల వడ్డన కొనసాగుతూనే ఉంది. దీనిని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? దేశంలో సామాజిక న్యాయం ఎక్కడ కనిపిస్తోంది?!

ఐక్యరాజ్యసమితి 2009 నుంచి ఏటా ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. సమాజాల మధ్య సంఘీభావం, సామరస్యం, సమాన అవకాశాలను ప్రోత్సహించేందుకు పేదరికం, నిరుద్యోగాన్ని తొలగించేందుకు కావాల్సిన ప్రాముఖ్యతను గుర్తించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగం సైతం ఇదే విషయాన్ని బోధపరుస్తోంది. కానీ, మన ప్రభుత్వాలు వీటిని పట్టించుకోవడం లేదు.

గౌతమ బుద్ధుడు చెప్పినట్లు ‘నాయకుడు ఆదర్శంగా ఉండాలి. ధర్మపాలన సాగించాలి. హింసను తగ్గించాలి. శాంతి మార్గం పాటించాలి.’ ప్రజలు పాలకుడిని నిశితంగా గమనించి, అనుసరిస్తారు. పాలకుడు ధర్మంగా ఉంటే ప్రజలు అలాగే ఉంటారు. పాలకుడు కుటిల ఆలోచనలతో ఉంటే ప్రజలు అదే మార్గం పడతారు. అది చివరకు పాలకుడి నెత్తిన భస్మాసుర హస్తంగా మారుతుంది. యథా రాజా తథా ప్రజా!

● దేవగళ్ల రామకృష్ణ
జర్నలిస్ట్
(నేడు సామాజిక న్యాయ దినోత్సవం)





ఎన్నారై సమీపంలో వైట్ ఫీల్డ్ పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పనులను వేగవంతం చేయాలి

● ఎంటీఎంసీ పర్యటనలో కలెక్టర్ అన్సారియా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గురువారం ఆమె స్థానిక అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాజ గ్రామంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో డాగ్స్ కెన్నల్స్, ఆపరేషన్ రూమ్, ఫుడ్ ఫీడింగ్ ఏరియా, రికార్డులను తనిఖీ చేశారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు సజావుగా నిర్వహించాలని సూచించారు. గ్రామంలోని 17.18 ఎకరాల ఈస్ట్ లేక్ వద్ద రూ.2.70 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు, మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. ఎన్నారై సమీపంలో రూ.46 లక్షలతో 0.75 ఎకరాల్లో నిర్మిస్తున్న వైట్ ఫీల్డ్ పార్కులో పనులను పరిశీలించి, పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాడేపల్లిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్టేషన్ నుంచి పాతూరి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ స్ట్రీట్ స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రూ.1.69 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఉండవల్లి సెంటరును సందర్శించారు. కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, తహసీల్దార్లు దినేష్ రాఘవేంద్ర, సీతారామయ్య, అదనపు కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్లు శ్రీకాంత్, శ్రీనివాసరావు, డీసీపీ అశోక్, ఎస్‌సీ లీలాకృష్ణ, ఏడీసీఎల్ ఈఈ బసవేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సాయంత్రం 6.17 (శుక్రవారం)
సహరి : ఉదయం 5.13 (శనివారం)

పీపీపీ పద్ధతిలో.. ఐఆర్ఆర్

● 96.2 కి.మీ పొడవు, 75 మీ. వెడల్పుతో..
● భూసమీకరణ అనంతరం 30 నెలల్లోగా నిర్మాణం
● రాజధాని మౌలిక సదుపాయాల కోసం రూ.40,847 కోట్లు
● అసెంబ్లీలో ఎమ్మెల్యే కన్నా ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం

తుళ్లూరు, గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)ను నిర్మిస్తున్నట్లు మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డుపై అసెంబ్లీలో గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాజధానిలోని ట్రంక్ రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్ తదితర సంస్థల ద్వారా రూ.40,847 కోట్లు సమకూర్చామన్నారు. ఇన్నర్ రింగురోడ్డుకు భూమిని భూసమీకరణ, భూసేకరణ పద్ధతిలో సేకరిస్తున్నామన్నారు. భూ సమీకరణ తర్వాత రోడ్డు నిర్మాణానికి 24 నుంచి 30 నెలల సమయం పడుతుందన్నారు. 96.2. కి.మీ పొడవు, 75 మీటర్ల వెడల్పుతో 8+4 వరసల్లో రెండు దశల్లో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. గుంటూరు జిల్లాలో 14, పల్నాడు జిల్లాలో 3, కృష్ణ జిల్లాలో 6, ఎన్టీఆర్ జిల్లాలో 3 గ్రామాలు, మొత్తం 26 గ్రామాలలో ఐఆర్ఆర్ నిర్మాణం ఉంటుందని చెప్పారు.



మొదటి దశకు డీపీఆర్ కూడా సిద్ధమైందని భూ సమీకరణ ప్రారంభించామన్నారు.

55 ట్రంకు రోడ్ల నిర్మాణం

రాజధాని అమరావతి పరిధిలో 55 ట్రంకు రోడ్ల నిర్మాణం చేపట్టామని మంత్రి తెలిపారు. 45 ట్రంక్ రోడ్లకు రూ.18,779 కోట్లతో టెండర్లు పిలవగా పనులు ప్రారంభమయ్యాయన్నారు. 2027 ఏప్రిల్‌కి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ట్రంక్‌రోడ్లు, లేఅవుట్ రోడ్లు, భవనాలకు సంబంధించి ఇప్పటికే నిర్మాణ సంస్థలకు రూ.6,229 కోట్లు చెల్లించామన్నారు.



ఈ-1 రోడ్డుకు టెండర్లు

మంగళగిరి(గుంటూరు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని వరద ముప్పు నుంచి సంరక్షించడంలో భాగంగా కృష్ణానది కుడి కరకట్ట, ఈ-1 రోడ్డు బలోపేతానికి ఏడీసీఎల్ చర్యలు తీసుకుంది. ఈ-1 రోడ్డు నిర్మాణం, అభివృద్ధి కోసం టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసింది. కృష్ణానదిని ఆనుకుని 7.200 కి.మీ మేర ఉండే ఈ-1 రోడ్డును మూడు భాగాలుగా విభజించి వరదపోటును తట్టుకునేలా పనులు చేపట్టనున్నది. ఈ-1 రోడ్డు 0.300 కి.మీ. నుంచి 2.480 కి.మీటర్ల వరకు రూ.104.55 కోట్ల అంచనాతో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏడీసీఎల్) టెండరును ఆహ్వానించింది. 2.480 కి.మీ నుంచి 4.990 కి.మీ వరకు రూ.101.73 కోట్లతో, 4.990 కి.మీ నుంచి 7.200 కి.మీ వరకు రూ.102.31 కోట్ల అంచనాతో వేర్వేరుగా టెండరును ఏడీసీఎల్ ప్రకటించింది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలు 18 నెలల్లో రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. మొత్తంగా రెండేళ్లలో ఈ రోడ్డును పూర్తి చేసి అప్పగించాల్సి ఉంటుంది.



ఆస్పత్రి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

వినుకొండలో రేపు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

వినుకొండటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మూడో శని వారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సీఎం చంద్రబాబునాయుడు వినుకొండకు రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం కలెక్టర్ కృతిక శుక్లా అధికారులతో గురువారం వినుకొండ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. విధుల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జూనియర్ కళాశాలలో జరుగుతున్న హెలిప్యాడ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రతా పరమైన అంశాలతో పాటు ట్రాఫిక్ తదితరాలను పరిశీలించిన ఎస్పీ కృష్ణారావు పోలీసులకు పలు సూచనలు చేశారు.

మహాశివరాత్రికి.. స్త్రీ శక్తి

ఆర్టీసీకి రూ.56 లక్షల వరకు లబ్ధి

● 1.70 లక్షలకి పైగా ఉచిత ప్రయాణం
● గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ప్రయాణాల్లో స్త్రీ శక్తి జోష్ నింపింది. కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంతో పెద్దసంఖ్యలో మహిళలు శైవ క్షేత్రాలను సందర్శించారు. పండుగ తిరునాళ్లు, ఉత్సవాలకు రెండు రోజుల పాటు ఆర్టీసీలో మహిళా భక్తుల ప్రయాణాలు రెట్టింపయ్యాయి. మహా శివరాత్రి ఆదివారం రాగా, రెండో శనివారం మహిళా భక్తులు అత్యధికంగా బస్సుల్లో వెళ్లి ఆలయాలను దర్శించుకున్నారు. గుంటూరు-1, గుంటూరు-2, మంగళగిరి, పొన్నూరు, తెనాలి డిపోల వారీగా పరిశీలిస్తే స్త్రీ శక్తి పథకంతో మహిళా భక్తులు పెద్దఎత్తున ప్రయాణాలు చేశారు. మహా శివరాత్రి పురస్కరించుకుని జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సాధారణ షెడ్యూల్ బస్సులతో పాటు అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాలైన శ్రీశైలంతో పాటు అమరావతి, క్వారీ, కోటప్పకొండ, గోవాడ శైవక్షేత్రాలకు బస్సులను ఏర్పాటు చేశారు. దాంతో శైవక్షేత్రాలకు మహిళా భక్తులు క్యూ కట్టారు. స్త్రీ శక్తి పథకం అమల్లో ఉండటంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు శని, ఆదివారాలు ఫుల్ అయ్యాయి. దీంతో గత ఏడాదితో పోలిస్తే స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక మహిళా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. శని, ఆదివారాల్లో జిల్లాలోని ఐదు డిపోల పరిధిలో లక్షా 70 వేల మందికి పైగా మహిళా ప్రయాణికులకు జీరో టిక్కెట్లు అందజేశారు. 14న 97వేల 859 మంది ప్రయాణించగా ప్రభుత్వం నుంచి రూ.30 లక్షల 96వేల 880, ఆదివారం 81వేల 349 మంది ప్రయాణించడంతో రూ.25 లక్షల 47వేల 410 ఆర్టీసీకి లబ్ధి కలిగింది. అంతేగాక ఆర్టీసీలో ఓఆర్ కూడా రెండు రోజుల్లో గణనీయంగా పెరిగింది. ఒక్కో బస్సు 100 మంది వరకు ప్రయాణికులతో రాకపోకలు సాగించాయి. సగటున 80 వరకు ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.



బస్సు వద్ద మహిళా ప్రయాణికుల రద్దీ



నేడు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

● మిర్చి యార్డు చైర్మన్‌గా కుర్రా అప్పారావు
● చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ

22న గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

8

ఉపాధి పథకంపై బీజేపీ కుట్రలు

మహాత్మాగాంధీ పేరు తొలగించడం దుర్మార్గం ● వేల్పూరులో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పేదలు వలస వెళ్లే అవసరం లేకుండా సొంతూళ్లలోనే పని కల్పించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా గురువారం ఆమె శావల్యాపురం మండలం వేల్పూరుకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ఉపాధి పథకంపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదని, పని ప్రదేశాల్లో ఇచ్చే పనిముట్లు, తాగునీరు, మజ్జిగ తదితరాలను నిలిపేశారని, కొత్తగా జాబ్‌కార్డులు ఇవ్వలేదని, అందరికీ పని కల్పించడం లేదని పలువురు షర్మిళకు వివరించారు. పథకాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌తో కలసి పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. అనంతరం షర్మిళ మాట్లాడుతూ ఉపాధి పథకానికి జాతిపిత మహాత్మాగాంధీ పేరు తొలగించడం దుర్మార్గమన్నారు. నాథూరాం గాడ్సేకి, ప్రధాని మోడీకి ఏ మాత్రం తేడా లేదని, గాడ్సే గాంధీజీని చంపితే, గాంధీజీ పేరున్న ఉపాధి పథకాన్ని మోదీ చంపుతున్నారన్నారు. పథకాన్ని నీరుగార్చి రాష్ట్రాలపై భారం మోపేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. ఉపాధిలో 40 శాతం వాటాను చెల్లించే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు లేదని చెప్పారు. తొలుత వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయపాటి రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు షర్మిలకు ఘనంగా స్వాగతం పలికారు. గంటవారిపాలెం నుంచి వేల్పూరు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు.



వేల్పూరులో రచ్చబండలో మాట్లాడుతున్న షర్మిళ

డీసీసీబీలో భోక్తలను వదలం

● 27న మహాజన సభ సమావేశం ● చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు


సమావేశంలో మాట్లాడుతున్న మక్కెన, పక్కన సీఈవో ఫణికుమార్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన భోక్తలను వదిలేది లేదని చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు స్పష్టం చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్జీఆర్ సహకార భవన్‌లో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాబ్ అధికారులు మూడు వారాలుగా తనిఖీలు నిర్వహించిన నివేదికను, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను చైర్మన్‌కు వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ వినుకొండ బ్రాంచ్‌లో జరిగిన అక్రమాలపై ఇప్పటికే ఇప్పటికే విచారణ నివేదిక అందిందన్నారు. ఈ నెల 27న జరిగే మహాజన సభ సమావేశంలో వినుకొండ బ్రాంచ్ అక్రమాల బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలానే బ్రాంచ్‌లలోని మొండి బకాయిలను వెంటనే రికవరీ చేయాలని ఆదేశించారు. వసూళ్ళకు సంబంధించి ప్రత్యేక అధికారులను కూడా నియమించాలని వివరించారు. అలానే బ్యాంకులో డిపాజిట్‌లు పెంచి వ్యాపారాభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఈవో వీవీఎస్ ఫణికుమార్ పలువురు అధికారులున్నారు.

వైఎస్సార్ పేరు తొలగింపు


తొలగించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి పేరు

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విభాగానికి మాజీ సీఎం డాక్టర్ వైఎస్సార్ పేరును గురువారం వర్సిటీ అధికారులు తొలగించారు. బుధవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకులు వీసీ కె.గంగాధరరావుకి ఇచ్చిన వినతపత్రం ఆధారంగా తీసుకొని 24 గంటల్లోనే వర్సిటీ యంత్రాంగం చర్యలు తీసుకుంది. గత పాలకులు వైసీపీ నేతల మెప్పుకోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును ఇంజనీరింగ్ కళాశాలకు పెట్టారని విమర్శ చేశారు.

గ్రామ పంచాయతీలకు ఊరట

● ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు శుభవార్తగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 'పంచాయతీలపై ఆంక్షలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక మెమో గురువారం జారీ చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధులను ఇప్పటికే అమలు చేసి, కొలిచిన పనులకు వినియోగించుకోవడానికి స్పష్టమైన అనుమతి మంజూరు చేసింది. 2026 జనవరి 5న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభల తీర్మానాలు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల అమలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. పనులు సక్రమంగా పూర్తి చేసి, మెజర్‌మెంట్ పుస్తకాల్లో నమోదు చేసినట్లయితే, సంబంధిత బిల్లులను చెల్లించుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ అనుమతి జారీ చేసింది. మూడు పంచాయతీరాజ్ సంస్థలకు ఇప్పటికే జారీ చేసిన మార్గదర్శకాల మేరకు, పూర్తయిన పనులకు నిధుల వినియోగంపై ఉన్న అనుమానాలకు ఈ ఉత్తర్వులు చెక్ పెట్టినట్లయ్యింది. విజయవాడలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కార్యాలయం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు వేగవంతం కానున్నాయి.

గ్రామాల అభివృద్ధి పారిశుధ్య మెరుగుదల, స్థానిక సంస్థల ఆర్థిక స్థిరత్వానికి ఇది దోహదం చేస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ మైలవరపు, అదనపు కమిషనర్ ఎం.సుధాకర్ రావు, ముఖ్య గణాంక అధికారి జి.వీరాంజనేయులు తదితరులకు ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి తరిమెల కృష్ణమోహన్, సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు.

భూకంపం.. భయం

బొల్లాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువారం తెల్లవారు జామున భూమి కంపించింది. 2:30 గంటల సమయంలో పెద్ద శబ్దం వినిపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు. బొల్లాపల్లి, మూగచింతలపాలెం, వెల్లటూరు, పేరూరిపాడు, నెహ్రూనగర్ తండాలో ఇళ్లలోని వస్తువులు కదిలినట్లు చెబుతున్నారు. గతంలో కూడా ఇలానే రాత్రి 7 గంటల సమయంలో భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. ఆయా గ్రామాల్లో భూకంపం గురించే చర్చ సాగుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

జాతీయ స్థాయిలో చలపతి ఉద్ఘోష్ 2 కే 26


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ వైవీ ఆంజనేయులు

తాడికొండ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు చలపతి ఉద్ఘోష్ 2కే26 జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. బుధవారం కళాశాలలో చలపతి ఉద్ఘోష్ 2కే26 పోటీల 50 అడుగుల ప్లెక్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్ర, శనివారాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నూతన కృత్రిమ మేధస్సు ఆవిష్కరణలు, స్టార్టప్‌లు సిద్ధం చేసినట్లు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని కోరారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా రూ.5లక్షల బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్యేలు, జబర్దస్త్ టీమ్స్ పాల్గొంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డి.కిరణ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూ, కనెక్ట్ కన్సల్ట్ అవగాహన ఒప్పందం


ఒప్పంద పత్రాలు చూపుతున్న వీసీ గంగాధరరావు, కంపెనీ సీఈవో ఎం.సుకుమార్

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం నూతనంగా 5 డిప్లమా కోర్సులతో ముందడుగు వేస్తోందని సీడీఈ డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ, అమెరికా కేంద్రంగా ఉన్న కనెక్ట్ కన్సల్ట్ ఐటీ సంస్థ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. సంబంధిత పత్రాలపై వర్సిటీ రిజిస్ట్రార్ జి.సింహాచలం, కంపెనీ సీఈవో ఎం.సుకుమార్ సంతకాలు చేశారు. వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఇది దోహదపడుతుందన్నారు. డిప్లమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డేటా, ఏఐ, మిషన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ అండ్ డెవలప్‌మెంట్ ఆపరేషన్ ఇంజనీరింగ్ కోర్సులకు అవగాహన ఒప్పందం జరిగిందని తెలిపారు. ఈ డిప్లమా కోర్సులు సంవత్సరం కాలవ్యవధిలో పూర్తిచేయవచ్చని తెలిపారు. ప్రవేశానికి డిగ్రీ అర్హతని తెలిపారు. తప్పనిసరిగా ఇంటర్మీడియట్‌లో గణితశాస్త్రం చదివి ఉండాలని స్పష్టం చేశారు. ఆచార్య వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఫ్లెక్స్ రెస్యూమే గోడ పత్రిక ఆవిష్కరణ

తన కార్యాలయంలో ఫ్లెక్స్ రెస్యూమే గోడ పత్రికను వీసీ కె.గంగాధర్‌రావు ఆవిష్కరించారు. ఈ అప్లికేషన్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలకు దరఖాస్తు చేసే విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఇది ఏఐ ఎనేబుల్ అప్లికేషన్ అని, ఇది ఏటీఎస్ కూడా చేస్తుందన్నారు. ఉద్యోగానికి మ్యాచ్ అయ్యేట్లు రెస్యూమ్ తయారు చేస్తుందని ఈసీఓ ఎ. గిరిధర్ తెలిపారు. ఆర్అండ్‌డీ సమన్వయ కర్త డాక్టర్ పి.సుధాకర్, సీడీఈ ఎగ్జామ్స్ కోఆర్డినేటర్ దిట్టకవి రామచంద్రన్, అంబాసిడర్ ఎస్.చరణ్ గౌతమ్, మార్కెటింగ్ హెడ్ చందు పాల్గొన్నారు.



మిర్చియార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,03,290	
అమ్మకాలు	1,01,211	
నిల్వ	26,671	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	23000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	24000
దేవనూరు డీలక్స్	15500	24500
ఆర్మూరు	13000	16500
ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19500
నెంబరు. 5	13000	20500
273	----	----
341	14000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	17000
బ్యాడిగి 355	14000	23000
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11500

జడ్పీ రెగ్యులర్ సీఈఓగా జ్యోతి బసు


జ్యోతి బసును అభినందిస్తున్న జడ్పీ ఉద్యోగులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం డీఎల్‌డీఓ క్యాడర్‌లో గుంటూరు జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న వీర్ల జ్యోతి బసు రెగ్యులర్ సీఈఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జడ్పీ కార్యాలయ సిబ్బంది సీఈఓ ను కలిసి అభినందనలు తెలిపా రు. పరిపాలనలో చూపిన నిబద్ధత ఈ పదోన్నతికి కారణమని ఉద్యోగులు పేర్కొన్నారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా మరింత కృషి చేస్తానని తెలిపారు. మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రగతికి సహకరించాలని సీఎంకు వినతి


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ప్రగతి కోసం సంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన కలిశారు. పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న, చేయాల్సిన అభివృద్ధి పనులను వివరించారు. పొన్నూరు అభివృద్ధికి సహకారం అందించడంతో పాటు అవసరమైన నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి సహకార అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మెప్మా మేతపై కేసు నమోదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రుణాల మంజూరులో భారీ స్కాం జరిగింది. 81 బోగస్ గ్రూపులను సృష్టించి నిధులు మింగేశారు. కలెక్టర్ కృతికా శుక్లా విచారణకు ఆదేశించడంతో దాదాపు రూ.9.59 కోట్ల మేర స్కాం జరిగినట్లు రెండవ పట్టణ సీఐ షేక్ ఫిరోజ్ గురువారం వెల్లడించారు. సమాఖ్య అధ్యక్షురాలు షేక్ ఆఖిల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మెప్మా రుణాల కుంభకోణంలో ఎనిమిది మంది ఉద్యోగులు తుమ్మ దీప, విజయ ప్రణతి, షేక్ ఉమ ర్వలి, ఎం.మల్లికార్జునరావు, జి.భూదేవి, జి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, డి.బాలాంజనేయులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నరసరావు పేట ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకులో రూ.4.09 కోట్లు, ఇండియన్ బ్యాంక్‌లో రూ.2.87 కోట్లు, జీడీసీసీబీ పిడుగురాళ్ల నుంచి రూ.1.82 కోట్లు బోగస్ గ్రూపుల పేరుతో రుణాలు తీసుకున్నట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. అయితే సదరు శాఖ అధికారుల నుంచి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం.



ఎక్స్‌ప్రెస్‌లకు కరెంటు బుకింగ్ సౌకర్యం

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డివిజన్ మీదగా ప్రయాణించే పలు రైళ్లకు కరెంటు బుకింగ్ సౌకర్యాన్ని రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించింది. 12747 గుంటూరు - వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, బేగంపేట, సనత్‌నగర్, లింగంపల్లిలో కరెంటు బుకింగ్ సౌకర్యాన్ని ఏప్రిల్ 2 నుంచి అమలు చేయనుంది. 12748 వికారాబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో కరెంటు బుకింగ్ అమలు చేసేందుకు నిర్ణయించింది. అలానే తత్కాల్, ప్రీమియం తత్కాల్ కోటాలను కూడా సవరించింది. ఇదేవిధంగా సింహాద్రి, జన్మభూమి, గోల్కొండ, వయా వరంగల్ ఇంటర్‌సిటీ, ఛత్రపతి శంభాజీ నగర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా మార్గమధ్యలో కొన్ని స్టేషన్లలో కరెంటు బుకింగ్ సౌకర్యాన్ని ఏప్రిల్ నుంచి తీసుకురానుంది. దీని వల్ల రైళ్ల బయలు దేరడానికి గంట ముందు కూడా మిగిలిపోయిన టిక్కెట్‌లు కరెంటు బుకింగ్‌లోకి వస్తాయి.

గుంటూరు సిటీ వార్తలు

గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఓటమే విజయానికి నాంది

● జీఎస్‌టీ అదనపు కమిషనర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓటమి రేపటి విజయానికి పునాది అని, కృషి దీక్ష పట్టుదలతో ఎంత కఠినమైన పరిస్థితులనైనా ఎదుర్కొని విద్యార్థులు విజయం సాధించాలని కేంద్ర జీఎస్‌టీ అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం టీజేపీఎస్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో కామర్స్ కాంక్లేవ్ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామర్స్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని, తమ ప్రతిభ పాటవాలు చూపించి భవిష్యత్తుకి బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజేపీఎస్ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న పి.సుశాంత్, డి.ఫణి, షేక్ ఖాసీం ప్రథమ బహుమతి, జేకేసీ కళాశాలకు చెందిన గాయత్రి, డి.వినోద్, ఎస్ వెంకట పద్మజ ద్వితీయ బహుమతి, జేకేసీ కళాశాలకు చెందిన ఆర్ రాజరాజేశ్వరి, ఆర్.గీతాంజలి, షేక్ నస్రీన్ తృతీయ బహుమతిని సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, కార్యదర్శి కేవీ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలిలో షర్మిల పర్యటన

● మార్కెట్ సెంటర్‌లో బహిరంగ సభ

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం తెనాలి పట్టణంలో పర్యటించనున్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ యాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆమె పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెనాలి పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించనున్నారు. పట్టణంలో తలపెట్టిన సభను కాంగ్రెస్ శ్రేణులు, ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షుడు యన్నం సుధీర్‌బాబు, ఎండీ ఖలీల్ పిలుపునిచ్చారు.




అంబటి వ్యవహారం ఆత్మహత్యా సదృశ్యం

● దాసరి రాజామాస్టారు



దాసరి రాజామాస్టారు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంబటి రాంబాబు వ్యవహారం ఆత్మహత్యా సదృశ్యమని టీడీపీ నేత దాసరి రాజామాస్టారు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. 18 రోజులు రిమాండ్ ఖైదీగా ఉండి జైలు నుంచి విడుదలైన తరువాత కూడా కుప్పిగంతులేయడం ఆయన అపరిపక్వ రాజకీయానికి నిదర్శనమన్నారు. ఇదంతా ఆయన కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నానన్నారు. అంబటి వ్యవహారంతో జగన్‌రెడ్డి పార్టీకి కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. తిరుపతి లడ్డూ విషయాన్ని డైవర్ట్ చేయడానికి అంబటి, జగన్‌రెడ్డి కలసి సృష్టించిన వివాదమే ఈ రాద్ధాంతమని రాజామాస్టారు పేర్కొన్నారు.











నేతన్నకు భరోసా

● ఏడాదికి రూ.25వేల చొప్పున రూ.245 కోట్లు కేటాయింపు

● 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.150 కోట్లు



సత్తెనపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో చేనేతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరనుంది. రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నేతన్నపై వరాల జల్లు కురిపించారు. మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడికి ఏడాదికి రూ. 25 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 81 వేల మగ్గాలకు రూ.245 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు రూ.150 కోట్లను కేటాయించటంతో చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● టీడీపీ గత హయాంలో అనేక సంక్షేమ పథకాలు

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. అందులో ఏసీఐ సీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకం ద్వారా కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాది పాటు రూ.15వేల వరకు ఆరోగ్య బీమా వర్తించేది. చేనేత కార్మికులకు వృత్తి పరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ళ నొప్పులు, కంటి చూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో చేనేత కార్మికుల కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం పాలై ఏ వైద్యశాలల్లోనైనా వైద్యం చేయించుకొని బిల్లు పెడితే రూ.15వేలు ఇచ్చేవారు. అదే విధంగా గుణకర్ బీమా యోజన పథకంలో రూ.80కే ఇన్సూరెన్స్ కల్పించే వారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ. 1.50 లక్షలు ఇచ్చే వారు. నేషనల్ హ్యాండ్ లూమ్స్ డెవలప్‌మెంట్ స్కీమ్ పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు పది శాతం రాయితీ ఇచ్చే వారు. నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ పథకంలో కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ. 50వేలు బ్యాంక్ రుణాలు ఇచ్చేవారు. అదేవిధంగా మగ్గం నేసే కార్మికులకు వర్క్ షెడ్ కోసం రూ.75వేలు ఇచ్చేవారు. వీటితో పాటు 2019 ఎన్నికల ముందు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు టీడీపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేతన్నకు అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్న నేస్తం పేరుతో మగ్గానికి రూ.24వేలిచ్చి చేతులు దులుపుకుంది.

● ఒక్కో హామీని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం నేతన్నకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. గత బడ్జెట్‌లో నేతన్నకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించి అమలు చేసింది. అంతే కాకుండా ముడి నూలుపై ఉన్న ఐదు శాతం జీఎస్‌టీని రాష్ట్ర ప్రభుత్వం భరించి రీయింబర్స్‌మెంట్ చర్యలను చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో వర్క్ షెడ్లు, ముద్ర రుణాలు అందజేస్తోంది. తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నేతన్న భరోసా పథకానికి రూ. 245 కోట్లు నిధులు కేటాయించింది. ఈ పథకంలో భాగంగా మగ్గం నేసే ప్రతి నేత కార్మికుడికి ఏడాదికి రూ.25వేలు చొప్పున ఇవ్వనున్నారు. అదే విధంగా ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ రూ.150 కోట్లను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఏకోపాధ్యాయ బోధన

● గతి తప్పుతున్న ప్రాథమిక పాఠశాలల నిర్వహణ



కొనకంచివారిపాలెంలో ఎలిమెంటరీ పాఠశాల

రొంపిచర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, రెడ్డిపాలెం క్లస్టర్ల పరిధిలో 46 ప్రాథమిక పాఠశాలలున్నాయి. అచ్చయ్యపాలెం, తురుమెళ్ళ, సుబ్బయ్యపాలెం, అన్నవరప్పాడు, ముత్తనపల్లి, ఇంద్రగిరి, కొనకంచివారిపాలెం పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే బోధన చేస్తున్నారు. రెడ్డిపాలెం కాంప్లెక్స్ పరిధిలోని బెహరావారిపాలెం, విప్పర్ల, సంతగుడిపాడు క్లస్టర్ పరిధిలో కర్లకుంట, సంతగుడిపాడు, గ్రామాల్లోని పాఠశాలల్లోనూ ఈ పరిస్థితి ఉంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో.. ఇబ్బందులు తలెత్తుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కొనకంచివారి పాలెంలో సుమారు 30 మంది విద్యార్థులతో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు నెట్టుకురావడం కష్టంగా మారింది. సంతగుడిపాడు, రొంపిచర్ల క్లస్టర్లకు ఒక ఉపాధ్యాయుడిని అదనంగా ఉంచుతున్నారు. వీరు ఏ పాఠశాలలో ఉపాధ్యాయుడు రాకపోతే అక్కడ బోధించాల్సి ఉంటుంది. కొనకంచివారి పాలెంలో ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లడంతో ఇబ్బందిగా మారింది. రెడ్డిపాలెం క్లస్టర్ పరిధిలో అదనపు ఉపాధ్యాయుడు లేరు. రొంపిచర్ల దేవుడు మాన్యం, సుబ్బారెడ్డి కాలనీల పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొత్తం తొమ్మిదిమంది పని చేస్తున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు బదిలీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో బ్రహ్మేశ్వరరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులను కేటాయించే అవకాశం ఉందని తెలిపారు.

నేడు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

● మిర్చి యార్డు చైర్మన్‌గా కుర్రా అప్పారావు

● చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు) పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నది. చైర్మన్‌గా కుర్రా అప్పారావుతో పాటు పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. గుంటూరు రింగురోడ్డులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్‌లో భారీ జనసందోహం మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అప్పారావు అనుచరగణం భారీ ఏర్పాట్లు చేసింది. తొలుత సాయంత్రం నాలుగు గంటలకు రింగురోడ్డులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఎన్డీఏ కూటమి ఐకత్యని చాటేలా టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి నాయకులు, కార్యకర్తలతో పాటు భారీగా జనసమీకరణ చేస్తున్నారు. ప్రమాణ



స్వీకారోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ స్థాయి నాయకులు హాజరౌతారని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తెలిపారు.

పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ బలోపేతానికి కృషి చేస్తున్న కుర్రా అప్పారావుకు ఊహించని రీతిలో మిర్చి యార్డు చైర్మన్ పదవి వరించడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అప్పారావు తండ్రి రత్తయ్య గతంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019 - 24 మధ్య ప్రతిపక్షంలో పార్టీ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న సమయంలో అప్పారావు అండగా నిలిచారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకున్నారు. ఈ క్రమంలో ఆయన కోరుకోకుండానే మిర్చియార్డు చైర్మన్ పదవి వెతుక్కుంటూ వచ్చింది. కుర్రా అప్పారావుకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.



పసుపు జెండాలతో నిండిన గుంటూరు రింగురోడ్డు



ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, యార్డు చైర్మన్ అప్పారావు



● రాత్రింబవళ్లూ పనులు చేస్తున్న నిర్మాణ సంస్థ

● శాఖమూరు సమీపంలో 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్'

● 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం

● గతేడాది సెప్టెంబరు 3న మంత్రి లోకేశ్ శంకుస్థాపన

● శతజయంతి వేడుకలు.. మార్చి 16న ప్రారంభం

శరవేగంగా అమరజీవి స్మృతివనం

నిర్మాణ పనులు



పొట్టి శ్రీరాములు స్మృతివనం నమూనా చిత్రం

మంగళగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు, తెలుగు రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు స్మారకంగా అమరావతిలో నిర్మిస్తున్న 'పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజధాని అమరావతిలోని శాఖమూరు, పెదపరిమి గ్రామాల మధ్య 6.8 ఎకరాల విస్తీర్ణంలో 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఈ స్మృతివనాన్ని నిర్మిస్తున్నారు. రాష్ట్రం కోసం, తెలుగు జాతి కోసం త్యాగం చేసిన త్యాగధనుల స్మృత్యర్థం ఈ స్మృతి వనానికి ఆ పేరు పెట్టారు. రాష్ట్ర విభజన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసినందుకు గుర్తుగా 58 అడుగుల ఎత్తున్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.

● పరుగులు పెడుతున్న పనులు..

పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణ పనులు పరుగులు పెడుతున్నాయి. కిందటేడాది సెప్టెంబరు 3న మంత్రి నారా లోకేశ్ పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఐదు నెలల్లో చాలా వరకు పనులు జరిగాయి. పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే పిల్లర్లు, బేస్‌మెంట్ పూర్తి చేసుకుని రెండంతస్తుల భవనం నిర్మాణం జరుగుతోంది. దాదాపు 18 అడుగుల లోతు వరకూ పిల్లర్లు వేసి, దాని మీద బేస్‌మెంట్ వేశారు. నేలమట్టం నుంచి 10 అడుగుల ఎత్తులో వేదికను నిర్మించి, దానిపై రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆ నిర్మాణంపై 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంశ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

● మార్చి నాటికి పూర్తయ్యేలా పనులు..

గతేడాది మార్చి 16 నుంచి ఈ మార్చి 16 వరకు పొట్టి శ్రీరాములు శత జయంతి సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించింది. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. మార్చి 16 నాటికి స్మృతి వనం నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పనులు జరుగుతున్నాయి. కాగా భవన నిర్మాణ స్లాబులు పూర్తయిన వెంటనే విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. విగ్రహం తయారీకి 25 టన్నుల కాంస్యాన్ని వాడనున్నారు. ఇప్పటికే విగ్రహం మోకాళ్ల వరకూ పూర్తయినట్లు తెలుస్తోంది. కాగా విగ్రహాన్ని నిలబెట్టడానికి 50, 60 టన్నుల ఐరన్ గడ్డర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియను పూర్తి చేయడానికి 20 రోజుల వరకూ సమయం పట్టే అవకాశం ఉంది. రెండంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో పొట్టి శ్రీరాములుకు సంబంధించిన వస్తువులు, ఆయన రాసిన లేఖలు, ప్రభుత్వంతో చేసిన సంప్రదింపుల పత్రాలు అందుబాటులో ఉండేలా మ్యూజియంను ఏర్పాటు చేస్తారు. సందర్శకులకు ఆయన జీవిత విశేషాలను తెలిపే షార్ట్ ఫిలిం ప్రదర్శించేందుకు వీలుగా 60 సీట్లతో మినీ థియేటర్‌ను నిర్మిస్తున్నారు. రెండో అంతస్తులో కుర్చీలో ఆసీనులై ఉన్న 9 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. సందర్శకులు నివాళులు అర్పించేందుకోసం ప్రత్యేకంగా ఈ ఏర్పాటు చేస్తున్నారు.



రాత్రిపూట కూడా కొనసాగుతున్న పనులు

మరో ఏడాది..

ఈ ఏడాది మార్చి 16 నాటికి స్మారక విగ్రహ ఏర్పాటు పూర్తవుతుంది. కాగా మెమోరియల్ పార్కు నిర్మాణానికి ఇంకో ఏడాది సమయం పట్టే అవకాశం ఉన్నట్లు ట్రస్టు సభ్యులు చెబుతున్నారు. ఈ ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ఆడిటోరియాన్ని నిర్మిస్తారు. ఈ ఆరెకరాల ప్రదేశంలో అన్ని రకాల మూలికలు అందుబాటులో ఉండేలా ఒక ప్రత్యేకమైన మూలికావనాన్ని ఏర్పాటు చేసి సుందర వనంగా తీర్చిదిద్దనున్నారు.

వినియోగదారుల కమిషన్ చైర్మన్‌గా

నరసింహారావు బాధ్యతలు



జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ వీవీఎల్ నరసింహారావు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ వీవీఎల్ నరసింహారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో సెక్రటరీ గౌరవ్‌కుమార్ మంగళవారం గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ వీవీఎల్ నరసింహారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల మేరకు నరసింహారావు ప్రస్తుత ఇన్‌చార్జి చైర్మన్ విజయలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించారు. లా డిగ్రీ అనంతరం నరసింహారావు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి మెడికల్ నెగ్లిజెన్స్ అంశంపై పీహెచ్‌డీ చేశారు. రంగారెడ్డి జిల్లా వినియోగదారుల ఫోరం, విశాఖపట్నం వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా పనిచేశారు. ఏపీ సీపీడీసీఎల్‌కు లా ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నరసింహారావు మాట్లాడుతూ వినియోగదారులు చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని, కొనుగోలు చేసిన వస్తువులకు, సేవలకు సంబంధించి నాణ్యతతో పాటు వారంటీకి సంబంధించి ఏ చిన్న లోపానికైనా సంబంధిత బాధ్యుల నుంచి నష్టపరిహారం కోరుతూ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని చెప్పారు.

22న గ్రామీణ డాక్

సేవక్ సమ్మేళనం

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ● రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల మంది జీడీఎస్‌లు హాజరు ● శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ఏర్పాట్లు

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం ఈ నెల 22న ఆదివారం సాయంత్రం గుంటూరు నగర శివారులోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో జరగనుంది. గతేడాది డిసెంబరు రెండో వారంలో మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ కార్యక్రమం జరగగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో సమ్మేళనానికి గుంటూరు వేదిక కానుంది. గ్రామీణ పోస్టుమెన్లను గౌరవించడానికి కేంద్ర తపాలశాఖ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జీడీఎస్‌లు ఇండియా పోస్టుకు వెన్నెముకగా ఉన్నారు. అలానే ప్రజలు, తపాల శాఖ మధ్యన నమ్మకమైన వారధులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ భారత దేశానికి మెయిల్, బ్యాంకింగ్, బీమా తదితర సేవలను అందించడంలో పోస్టుమెన్‌ల పాత్ర కీలకం. ఈ నేపథ్యంలో జీడీఎస్ సమ్మేళనాల ద్వారా వారిలో నూతనోత్తేజాన్ని నింపడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది.



శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, కమిషనర్ మయూర్ అశోక్

మంత్రి పెమ్మసాని చొరవ

కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చొరవ తీసుకొని రాష్ట్రస్థాయి గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనాన్ని గుంటూరులో ఏర్పాటు చేయించారు. ఈ సమ్మేళనాలు గ్రామీణాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఆర్థిక చేరిక, ప్రజాసేవల పంపిణీ కోసం పోస్టాఫీసులను ఆధునిక, పౌర కేంద్రాలుగా మార్చడంపై దృష్టి పెడుతున్నాయి. మెయిల్ డెలివరీ, సేవింగ్ అకౌంట్ సముపార్జన, బీమా పాలసీ సేకరణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు జీడీఎస్‌లను ఈ సమ్మేళనంలో సత్కరిస్తారు. అలానే జీడీఎస్‌ల కోసం కేంద్రం తీసుకుంటున్న చొరవను హైలైట్ చేస్తున్నాయి. వాటిల్లో పోస్టుమెన్‌ల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశం కల్పించడం, అలవెన్సులను పెంచడం, యూనిఫాం మెరుగుపరచడం వంటివి ఉన్నాయి.

కలెక్టర్ పరిశీలన

ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఈ కార్యక్రమం బుడంపాడు, ఏటుకూరు బైపాసు జంక్షన్ల మధ్యన ఉన్న శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో జరగనుంది. సాయంత్రం 5.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని సీఎంవో నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమాచారం అందింది. దీంతో ఆమె గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, తపాలశాఖ అధికారులతో కలిసి సమ్మేళనం జరిగే ప్రాంగణంలో పర్యటించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లు గురించి చర్చించారు. తాగునీరు, వైద్య శిబిరం, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు.



హరేకృష్ణ

ప్రేమను మేలుకొలుపుదాం


భౌతిక ప్రపంచంలో మనం సాధారణంగా 'ప్రేమ' పేర్కొనే భావనను... భగవద్గీత, ఇతర వైదిక శాస్త్రాల్లో 'కామం'గా పరిగణిస్తారు. వాటి ప్రకారం నిజమైన ప్రేమకు, భౌతికమైన కామానికి మధ్య స్పష్టమైన తేడా ఉంది. ఆత్మేంద్రియ ప్రీతి వాంఛ- తారే బలి కామ... సొంత ఇంద్రియాలను తృప్తి పరచుకోవాలనే కోరికను 'కామం' అంటారు. భౌతిక ప్రపంచంలోని సంబంధాలు తరచుగా వ్యక్తిగత ఆనందం లేదా ఇంద్రియ తృప్తి మీద ఆధారపడి ఉంటాయి. ఎప్పుడైతే ఆ తృప్తి ఆగిపోతుందో ఆ సంబంధం లేదా ప్రేమ... కోపంగా (క్రోధంగా), ద్వేషంగా మారుతుంది. కృష్ణేంద్రియ ప్రీతి ఇచ్ఛా ధరే ప్రేమ నామ... భగవంతుణ్ణి (శ్రీకృష్ణుణ్ణి) సంతోషపెట్టాలనే కోరికను 'ప్రేమ' అంటారు. అది నిస్వార్థమైనది. ఇక 'రూపాంతరం చెందడం' అనే విషయానికి వస్తే... ప్రతి జీవునికి భగవంతునిపట్ల సహజమైన, నిత్యమైన ప్రేమ ఉంటుంది. కానీ జీవుడు భౌతిక సృష్టితో లేదా రజోగుణంతో సంపర్కంలోకి వచ్చినప్పుడు ఆ ప్రేమ... కామంగా రూపాంతరం చెందుతుంది. కాబట్టి సొంత సుఖాన్ని ఆశించే భావనను శాస్త్రాలు ప్రేమగా కాకుండా కామంగా గుర్తిస్తాయి.

శ్రీ చైతన్య మహాప్రభువుల బోధ ప్రకారం... ప్రతి జీవుని హృదయంలో కృష్ణునిపట్ల ప్రేమ నిద్రాణమై ఉంటుంది. నిత్యం భక్తి సాధన ద్వారా... ముఖ్యంగా శ్రవణం (వినడం) కీర్తనం (జపించడం) ద్వారా ఆ ప్రేమ మేలుకొంటుంది. భగవద్గీత, శ్రీమద్భాగవత శ్లోకాల ద్వారా శ్రీ చైతన్య మహాప్రభువు దీన్ని సమర్థించిన వివరణ ఈ విధంగా ఉంది.

హృదయ శుద్ధీకరణ: సాధన భక్తిలో మొదటి దశ శ్రవణం, కీర్తనం. శ్రీమద్భాగవతం ప్రకారం ఎవరైతే శ్రీకృష్ణుని కథలు వింటారో... వారి హృదయంలో పరమాత్మగా ఉన్న శ్రీకృష్ణుడు ఒక శ్రేయోభిలాషిగా వ్యవహరిస్తాడు. ఆ భక్తుని హృదయంలో భౌతిక భోగాల పట్ల ఉన్న కోరికలను, అమంగళకరమైన విషయాలను భగవంతుడే స్వయంగా ప్రక్షాళన చేస్తాడు. ఈ విధంగా... నిత్యం భగవంతుడి గురించి వినడం, కీర్తించడం ద్వారా భక్తుని హృదయం పునీతమవుతుంది.

బుద్ధియోగం: భక్తుడు నిత్యం ప్రేమపూర్వకంగా సేవలో నిమగ్నమైనప్పుడు... భగవంతుడు అతణ్ణి ప్రత్యేకంగా అనుగ్రహిస్తాడు. ఎవరైతే తనను నిరంతర ప్రేమతో తనను ఆరాధిస్తారో... వారికి తనను చేరుకొనే మార్గాన్ని బుద్ధిని (బుద్ధియోగం) ప్రసాదిస్తానని 'భగవద్గీత'లో భగవంతుడు చెప్పాడు. జ్ఞానం ద్వారా భక్తుడు భగవంతుడి తత్త్వాన్ని అర్థం చేసుకొని ఆయనను సమీపిస్తాడు. దీనికోసం శ్రీ చైతన్య మహాప్రభువులు బోధించిన యుగధర్మం... నిత్యం శ్రీహరి నామ సంకీర్తన. ప్రధానంగా 'హరే కృష్ణ' మంత్రాన్ని రోజూ జపించడం.

> శ్రీ చైతన్య మహాప్రభువు, రూప గోస్వామి వివరించిన ప్రకారం భక్తి ఈ క్రింది దశలలో అభివృద్ధి చెందుతుంది. **శ్రద్ధ:** మొదటిది భగవంతుడి మీద నమ్మకం. **సాధుసంగం:** భక్తులతో సాంగత్యం. **భజన క్రియ:** గురువు ఆదేశానుసారం భక్తిని ఆచరించడం (దీన్నే సాధన భక్తి అంటారు) **అనర్థ నివృత్తి:** హృదయంలోని కల్మషాలు తొలగిపోవడం. **నిష్ఠ:** భక్తిలో స్థిరత్వం. **రుచి:** భగవంతుడి సేవ పట్ల ఆసక్తి. **ఆసక్తి:** భగవంతుడి పట్ల గాఢమైన అనురక్తి. **భావ:** ప్రేమకు పూర్వ దశ. **ప్రేమ:** అంతిమంగా, ఇది పరిపూర్ణమైన కృష్ణ ప్రేమగా (ప్రేమభక్తి) మారుతుంది. కాబట్టి సాధన భక్తి ద్వారా హృదయం శుద్ధి కావడం, భగవంతుని అనుగ్రహంతో సరైన బుద్ధిని పొందడం ద్వారా భక్తుడు శ్రీకృష్ణునితో తన సంబంధాన్ని పునరుద్ధరించుకుంటాడు, ప్రేమభక్తిని పొందుతాడు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

తెలుసుకుందాం

రూపాలు అనంతం లీలలు అపారం

ఆలయాలలో మనకు శివుడు సాధారణంగా లింగ రూపంలో కనిపిస్తాడు. కానీ శివరూపాలు అనంతం. శివలీలలు అపారం. ఆగమశాస్త్రాలు పలు రూపాలను వివరించాయి. ఆ రూపాల ఆధారంగా శివలీలల గురించి మనం తెలుసుకోవచ్చు. ప్రతి శివరూపం వెనుక ఒక పురాణ గాథ ఉంది. ప్రతి గాథలోనూ శివతత్త్వ మహత్తు నిండి ఉంది. ఆ రూపాలు పరవశింప చేస్తాయి. ఆ గాథలు తన్మయత్వం కలిగిస్తాయి. అభీష్ట వరదాయకాలైన ఈ శివరూపాల్ని ధ్యానించినా, ఈ గాథల్ని స్మరించినా శివానుగ్రహం తప్పక కలుగుతుందనేది పెద్దల మాట. ఆ రూపాలలో కొన్ని:



శ్రీ లింగమూర్తి: శివరూపం అనగానే గుర్తుకువచ్చేది శివలింగం. 'లిం' అంటే సృష్టి, 'గం' అంటే లయం. ఈ చరాచర సృష్టి ఎక్కడినుంచి మొదలవుతుందో, తిరిగి దేనిలో కలిసిపోతుందో అదే శివలింగం. శివలింగం పరమేశ్వరుడైతే, పీఠం పార్వతీదేవి రూపం. కాబట్టి అది శివశక్తుల సమష్టి రూపం. అంతేకాదు, ఇందులో త్రిమూర్తులు కూడా కలిసి ఉన్నారు. భూమిలో ఉండే నలుచదరపు భాగం బ్రహ్మగా, పీఠంలోని ఎనిమిది పలకలు విష్ణువుగా, పైన మనకు దర్శనమిచ్చే గుండ్రటి భాగం శివరూపంగా గ్రహించినవారికి శివలింగం అంతర్యం అర్థమవుతుంది.

శ్రీలింగోద్భవమూర్తి: పూర్వం ఒకసారి బ్రహ్మ, విష్ణువు తామే గొప్పవారమని ఒకరితో ఒకరు కలహించుకున్నారు. వారి గర్వం పోగొట్టడానికి శివుడు ఆది, అంతం లేని అగ్నిస్తంభంలా దర్శనమిచ్చాడు. ఆ శివలింగం మొదలు కనుక్కోడానికి శివుడు వరాహంగా, తుదిభాగాన్ని దర్శించడానికి బ్రహ్మ హంసగా ప్రయత్నించి విఫలమయ్యారు. అప్పుడు శివుడు ఆ లింగం నుంచి (లింగోద్భవమూర్తిగా) ఉద్భవించాడు. బ్రహ్మను వేదాధిపతిగా, విష్ణువును తనతో సమానమైన దైవంగా అనుగ్రహించాడనేది ఐతిహ్యం.

శ్రీకల్యాణ సుందరమూర్తి: పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు ప్రజల్ని కష్టాలు పెడుతూ పీడించసాగాడు. పార్వతీ పరమేశ్వరుల పుత్రుడి వల్లనే తనకు మరణం కలగాలని బ్రహ్మ నుంచి వరం కూడా పొందాడు. రోజురోజుకూ పెరిగిపోతున్న అతని ఆగడాలను అరికట్టాలని అందరూ శివుణ్ణి వేడుకున్నారు. లోకకల్యాణం కోసం హిమవంతుడి కుమార్తె పార్వతీదేవిని శివుడు పరిణయం చేసుకున్నాడు. అంగరంగ వైభవంగా జరిగిన ఆ వివాహంలో స్వామి 'కల్యాణసుందరమూర్తి'గా దర్శనం ఇచ్చాడు.

శ్రీ అర్ధనారీశ్వరమూర్తి: పార్వతీపరమేశ్వరులిద్దరూ ఒకటేననీ, వేరువేరు కాదనీ తెలిపే రూపం అర్ధనారీశ్వర రూపం. పూర్వం భృంగి అనే భక్తుడు పార్వతీదేవిని విడిచిపెట్టి, శివునికి మాత్రమే ప్రదక్షిణలు చేశాడు. పార్వతీదేవి అవమానంతో అలిగి కైలాసాన్ని విడిచిపెట్టింది. గౌతమ మహర్షి ఆశ్రమంలో శివుడికోసం కఠిన వ్రతం ఆచరించి, శివుని శరీరంలో సగభాగాన్ని పొందింది. కుడివైపు శివుడు, ఎడమవైపు అమ్మవారు ఉండే ఈ రూపాన్ని దర్శించుకుంటే భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది.

శ్రీచంద్రశేఖరమూర్తి: లోకానికి వెలుగును ఇచ్చే చంద్రుడు ఒకప్పుడు చీకటిలో మగ్గిపోయాడు. తన మామ దక్షప్రజాపతి ఇచ్చిన శాపం వల్ల రోజురోజుకూ క్షీణించిపోయాడు. భయంకరమైన కుష్టువ్యాధితో బాధపడుతూ.... శివుడి గురించి ఘోర తపస్సు చేశాడు. శివానుగ్రహంతో నెలలో పదిహేను రోజులు పెరిగేటట్టు, పదిహేను రోజులు తరిగేటట్టు వరం పొందాడు. ఎప్పటికీ తరుగుదల లేని రేఖగా శివుని శిరస్సుపై ఉండే భాగ్యాన్ని కూడా పొందాడు. అప్పటినుంచి శివుడు 'చంద్రశేఖరమూర్తి'గా పిలుపునందుకుంటున్నాడు.

శ్రీ గంగాధరమూర్తి: పూర్వం సగర చక్రవర్తి కుమారులు తమ యాగాశ్వం కోసం వెతుకుతూ... ముని శాపానికి గురై బూడిద కుప్పలుగా మారిపోయారు. వారికి ఉత్తమ గతులు కలగాలంటే దేవలోకంలో ఉన్న గంగ కిందికి దిగిరావాలి. అందుకోసం సగర చక్రవర్తి వంశస్థుడైన భగీరథుడు తీవ్ర తపస్సు చేశాడు. గంగ భూమిపైకి దూకితే దాన్ని నియంత్రించే శక్తి ఒక్క శివుడికే ఉందని తెలుసుకొని... ఆయనను ప్రార్థించాడు. అందుకు అంగీకరించిన శివుడు గంగను తలపై ధరించాడు. భగీరథ ప్రయత్నం ఫలించింది. శివునికి 'గంగాధరమూర్తి' అనే నామం ప్రాప్తించింది.

శ్రీ సోమాస్కందమూర్తి: తారకాసుర సంహారం కోసం పరమేశ్వరుడు తన రేతస్సును అగ్నిదేవుడికి ఇచ్చి కాపాడమన్నాడు. అతడు దాన్ని తట్టుకోలేక ఒక రెల్లుగడ్డి వనంలో వదిలిపెట్టాడు. ఆ శరవనంలోనే స్కందుడు జన్మించాడు. ఆరుగురు కృత్తికలు ఆయనను పెంచారు. అనంతరం నందీశ్వరుడు వచ్చి, స్కందుణ్ణి కైలాసానికి తీసుకొని వెళ్ళాడు. తన కుమారుణ్ణి దేవతల సేనానాయకుడిగా పరమశివుడు నియమించాడు. ఆ సందర్భంగా శివపార్వతులు... కుమారస్వామిని తమ మధ్యలో ఉంచుకొని అందరికీ దర్శనం ఇచ్చిన రూపమే 'సోమాస్కందమూర్తి' రూపం.

శ్రీహరిహరమూర్తి: హరిహరుల మధ్య భేదం లేదని తెలిపేందుకు శివుడు ఈ రూపాన్ని ధరించాడు. పూర్వం దేవతలు లోకం అశాంతిగా ఉందంటూ విష్ణువు వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. శాంతిని ఇచ్చేవాడు శంకరుడేనని విష్ణువు వారికి తెలిపాడు. అందరూ కలిసి కైలాసానికి వెళ్ళారు. అక్కడ వారికి శివదర్శనం కాలేదు. అప్పుడు దేవతలందరూ ఒక వ్రతం ఆచరించారు. చివరిగా విష్ణు హృదయంలోని అక్షయ లింగాన్ని కూడా ఆరాధించగా, వారికి పరమేశ్వరుడు... కుడివైపు శివుడు, ఎడమవైపు విష్ణువు కలిసి ఉన్న రూపంలో... శ్రీహరిహరమూర్తిగా దర్శనమిచ్చాడు.



డి.యన్.వి. ప్రసాద్,
స్థపతి, 9440525788

భక్తి జ్ఞాన సాధకుడు

బోధన, సాధన... ఈ రెండిటికీ సమస్థానం ఇవ్వడమే రామకృష్ణ పరమహంస విలక్షణత. ఆయనది నిరంతర అన్వేషణ. ఆధ్యాత్మికతను బోధించడంతోపాటు అనుభవంలోకి తెచ్చుకున్నారు. ఆ క్రమంలో పరిపూర్ణత కోసం ఎంతగానో అన్వేషించి, చివరకు సఫలీకృతులు అయ్యారు. 'నిత్య ధ్యానం' అనే ఒకే ఒక అంశం మీద సంపూర్ణ ధ్యాసతో... ఆ సంకల్పశాలి సాధించినది అనంతం. భక్తి, జ్ఞాన, కర్మ యోగాల మిశ్రిత రూపం ఆయన జీవితం.

శ్రీరామకృష్ణుల తొలి పేరు గదాధరుడు. ఆయన స్వస్థలం మన దేశంలోని బెంగాల్ ప్రాంతంలో ఉన్న ఒక పల్లెటూరు. ఆయన బాల్యమంతా కళాభిరుచితో కొనసాగింది. ప్రకృతితో నిత్యానుబంధం బలపడింది. వయసు పెరుగుతున్నకొద్దీ ఆధ్యాత్మిక అంశాలపై చూపు కేంద్రీకృతమవుతూ వచ్చింది. దక్షిణేశ్వర కాళీమాత ఆలయాన పూజాదికాల నిర్వహణ ప్రధాన బాధ్యత అయింది. భక్తి భావ తన్మయత్వం ఆయనను 'పరమహంస'గా తీర్చిదిద్దింది. పరమసత్యం ఆయన అనుభవంగా మారింది. సంప్రదాయ గురుప్రబోధం నవ్య కాంతి కిరణంగా భాసించింది. పర్యవసానంగా నిర్వికల్ప సమాధి స్థితి భావన ఒక అనుభూతి రూపాన్ని సంతరించుకుంది. శారదాదేవితో వివాహం, ఆమె ధార్మికంగా ఆయన శిష్యురాలు కావడం, దీక్షాయుత జీవిత సాధనం... ఇవన్నీ పరిణామ క్రమంలో భాగాలు. కథలు, పాటలు, నిత్య జీవన ఉదాహరణల వివరణతో కొంతకాలం గడిచింది. ఒకనాడు ఆయనను చూడడానికి వచ్చిన నరేంద్రుడు అడిగిన (దైవాన్ని మీరు చూశారా? అనే) ఒక ప్రశ్నకు సమాధానమే వారి గురుశిష్య బంధాన్ని చరిత్రాత్మకంగా మలచింది. ఆనందుల కృషి ఫలంగానే రామకృష్ణ మిషన్ సంస్థాపన, విస్తరణ జరిగింది.



పఠనం కన్నా సాధనే మిన్న

సృష్టి సమస్తం ఏకత్వమే. అన్నిటా ఉండేది దైవత్వమే. భగవాన్ ఒక్కరే, మతాలన్నిటి ప్రబోధం ఒక్కటే.. ఇవీ పరమహంస ప్రధాన బోధనలు, ఆచరణ రూపాలు. మానవ సేవను మాధవసేవగా ఆయన దర్శించారు. జీవశక్తికి, జ్ఞాన యుక్తికీ అవినాభావ సంబంధం ఎటువంటిదో ఆయన జీవితమే నిరూపిస్తోంది. ఆనందం అంటే ఏమిటి, ఎక్కడ ఉంటుంది? దృశ్య-అదృశ్య ప్రపంచాల మధ్య ఏముంది? భక్తి అనేది ఏ అనుభవాన్ని ఇస్తుంది?... వీటికి జవాబులు పరిపూర్తిగా లభించేది శ్రీరామకృష్ణుల నుంచే. భారతీయ తత్త్వ సారాంశమంతటినీ రంగరించి ఆయన లోకానికి అందించారు. సందేశ వాహిని ఖండాంతరాలకు చేరేలా పూలబాటను పరిచారు. అలా ఆయన సమస్త భారతీయుల హృదయాలను ప్రభావితం చేశారని విదేశీ చరిత్రకారులెందరో ప్రస్తుతించారు. 'ఎప్పుడూ తీసుకోవడం కాదు, ఇవ్వడం అలవరచుకోవాలి. ఎదిగిన వ్యక్తిగా లోకం గుర్తించాలంటే ఒదిగి ఉండాల'ని ఆయన హితవు పలికేవారు. పఠనం కన్నా సాధన మార్గమే సదా పరిరక్షిస్తుందని రామకృష్ణ పరమహంస ప్రగాఢ విశ్వాసం, స్వీయ అనుభవం కూడా. భక్తి, భజన, స్తోత్ర రూపాలలో సత్ఫలితాలు కలుగుతాయని నిరూపించారు. ఆయనది ఒక అవతార పరంపర. త్యాగ చింతన, భక్తి వాహిని ఆయనలోని అంతర్భాగాలు. మానవులు కోరాల్సిందీ, వారికి కావాల్సిందీ ధనార్జన కాదు, ధర్మ ఆర్జన. ఆ సంపాదన ఏ రీతిలో ఉండాలో ఆ మహనీయుడి జీవితమే వెల్లడిస్తుంది.


సత్య చింతనకు మారుపేరే దైవం

'లోకంలోని అన్ని మార్గాలు సత్యానికే దారి చేస్తాయి. ఆ సత్య చింతనకు మారుపేరే దైవం' అనేది రామకృష్ణుల నమ్మకం. ఆయన ఎప్పుడూ దక్షిణేశ్వర కాళీ ఆలయాన... ఆ తల్లి పాదాల దగ్గరే ఉండేవారు. ఆహారం లేదు. నిద్ర రాదు, అసలు అలసటే తెలియదు. గంటలూ, రోజుల తరబడీ అమ్మ పద సన్నిధిలోనే ఉండేవారు. భవ్య దీపాన్ని గురువుగా ఆయన వెలిగిస్తే, అది కలకాలం పదిలంగా ఉండేలా మనసా వాచా కర్మణా పరిశ్రమించినవారు స్వామి వివేకానంద. విద్య, వైద్య, సామాజిక సేవారంగాల్లో సైతం రామకృష్ణ మిషన్ ఎప్పుడూ ముందువరుసనే ఉంటోంది. ఇప్పటికీ ఆధ్యాత్మికపరంగా మార్గదర్శకత్వం వహిస్తోంది.

> రామకృష్ణులది దివ్య చరితం. అది నిరంతర కథామృతం. అన్ని యోగాల సారాన్ని ఒడిసిపట్టిన బోధన ఆయనది. అనేక మానవ నవ సందేహాలు, సమస్యలకు భవ్య దివ్య పరిష్కారాలు ఆయనవి. అవన్నీ వేద ప్రబోధానికి ఆచరణీయ సాధన మార్గాలే. ఆయన సరికొత్త సిద్ధాంతమేదీ ప్రతిపాదించలేదు. భక్తి ఉద్యమంలాంటిది సాగించాలని ప్రయత్నించలేదు. విరివిగా పుస్తక రచనలు కొనసాగించలేదు. తన విశ్వాసాల వ్యాప్తి గురించి కనీస ఆలోచనైనా చేసేవారు కాదు. దైవం ఉనికి గురించి మాత్రమే పరితపించిన మనసు ఆయనది.

• జంధ్యాల శరత్ బాబు
9948345013

యోగా



శరణాగతి అంటే...

కొన్ని నెలల క్రితం. ఒక మధ్య వయసు పేషెంట్ కార్డియాలజీ కన్సల్టేషన్ గదిలో నా ముందు కూర్చొని ఉన్నారు. అతని రిపోర్టుల్లో మెరుగుదల కనిపించింది, అతనికి ఇచ్చిన మందులు పని చేస్తున్నాయి, అయినప్పటికీ అతను అశాంతిగా కనిపిస్తున్నారు. "డాక్టర్! మీరు చెప్పిన ప్రతిదీ చేస్తున్నాను. కానీ ఇప్పటికీ ఆందోళనగా ఉంది. ఏదైనా మళ్ళీ జరిగితే పరిస్థితి ఏమిటి?" అని అడిగారు. ఆయన ప్రశ్న కేవలం గుండెకు సంబంధించినది కాదు. నియంత్రణకు సంబంధించినది.

కర్మణ్యే వాధికారస్తే...

ఆధునిక వైద్యులుగా ప్రమేయం, సరిదిద్దడం, స్థిరీకరించడంలో మేము శిక్షణ పొందాం. కార్డియాలజిస్టులుగా, మేం కచ్చితత్వంతో పని చేస్తాం. కానీ వైద్యం తన పరిమితులను చేరే దశ ఒకటి వస్తుంది, జీవితం ఒక పెద్ద ఇంటలిజెన్స్ కింద కొనసాగుతోంది... అది శరీరానికి చెందిన సొంత స్వస్థత వ్యవస్థ. గుండె సమస్యల్లో చాలావరకూ తీవ్రమైన ఒత్తిడి వల్ల అధ్వాన్నంగా మారుతాయి. నిరంతర భయం, ఎక్కువగా ఆలోచించడం లాంటివి నాడీ వ్యవస్థను అప్రమత్తమైన ఒక స్థితిలో ఉంచుతాయి. ఒత్తిడి హార్మోన్లు తీవ్ర స్థాయిలో ఉంటాయి, నిద్ర చెదిరిపోతుంది, గుండె దాని స్వాభావికమైన సానుకూల లయను కోల్పోతుంది. శరీరం కేవలం వ్యాధి వల్ల కాకుండా, నిరోధకత వల్ల ఇబ్బంది పడుతుంది. ఇక్కడే 'శరణాగతి' అనే సూత్రం శక్తిమంతంగా మారుతుంది. శరణాగతి అంటే వదులుకోవడం కాదు, ఫలితాల పట్ల అధికంగా ఉన్న అనుబంధాన్ని విడిచిపెట్టడం. దీన్నే 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచనా' అని భగవద్గీత మనకు గుర్తు చేస్తోంది. అంటే 'మనకు కర్మల మీద తప్ప కర్మ ఫలాల మీద నియంత్రణ ఉండదు' అని అర్థం.

సర్వ ధర్మాన్ పరిత్యజ్య...

వైద్యులుగా మనం సమర్థతతో వ్యవహరించాలి. రోగులుగా మనం క్రమశిక్షణ పాటించాలి. నిరంతరమైన ఆందోళన ఫలితాలను మెరుగుపరచదు, అది చేసేది వ్యవస్థను కలవరపెట్టడం మాత్రమే. దీన్ని మేము 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానంలో సున్నితంగా అభ్యసిస్తాం. మేము కూర్చుంటాం, హృదయం మీద ధ్యాస ఉంచుతాం, అంతర్గత శుద్ధీకరణ సహజంగా జరగడానికి వీలు కలిగిస్తాం. మనం పురోగతిని కొలవడం మానేసి, అంతర్గతమైన ఒత్తిడిని సడలించినప్పుడు, ప్రశాంతత గాఢమవుతుంది. మన అంతశ్చేతన ఆదేశం లేకుండా భౌతికమైన గుండె కొట్టుకుంటున్న విధంగానే... ప్రతిఘటన తగ్గినప్పుడు ఆధ్యాత్మికమైన ఎదుగుదల సంభవిస్తుంది. భగవద్గీత 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అని కూడా హామీ ఇస్తోంది - ఉన్నతమైన సూత్రానికి శరణాగతులు కావాలంటోంది. ఇది బలహీనత కాదు, విశ్వాసం.

శాంతి నుంచి విశ్వాసం

"మీ వంతు పని నిజాయితీగా చేయండి. మీ మందులు తీసుకోండి. క్రమం తప్పకుండా నడవండి. ఆలోచనాత్మకంగా తినండి. తరువాత, జీవితాన్ని ప్రవహించనివ్వండి" అని నా రోగులకు తరచుగా చెబుతూ ఉంటాను. గట్టిపడిన ధమని రక్తపోటును పెంచుతుంది. అనువుగా ఉండే నాళం అడాప్ట్ చేసుకోగలదు. అలాగే కరడుగట్టిన అహంకారం బాధను పెంచుతుంది, వశ్యత కలిగిన మనస్సు వేగంగా స్వస్థత పొందుతుంది. 'శరణాగతి' అంటే భావోద్వేగపరమైన పరిపక్వత. మనం బాధ్యతగా వ్యవహరించడానికి, ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోడానికి ఇది వీలు కలిగిస్తుంది. ప్రయత్నం అవసరమే, కానీ శాంతి అనేది విశ్వాసం నుంచి వస్తుంది.... వైద్యంలో, ధ్యానంలో నేను నేర్చుకున్న పాఠం ఇదే. ప్రయత్నం, శరణాగతి కలిసి ఉన్నప్పుడు... హృదయం భౌతికంగానూ, ఆధ్యాత్మికంగానూ సహజమైన తన లయను కనుగొంటుంది.




డాక్టర్ శరత్‌రెడ్డి
కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్.
9440087532

శ్రమ దినాలు

దైవమార్గం

క్రైస్తవులు పాటించే శ్రమ దినాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. వీటిని 'తపఃకాల ఘడియలు', 'ఉపవాస ప్రార్థనలు'... ఇలా రకరకాలుగా పిలుస్తారు. మొన్న బుధవారం మొదలైన ఈ శ్రమదినాలు 40 రోజులపాటు జరుగుతాయి. ఏప్రిల్ మూడో తేదీతో ముగుస్తాయి. నలభై సంఖ్య... మరణించే సమయానికి ఏసు వయసును సూచిస్తుంది. శ్రమదినాల సందర్భంగా... మానవాళి కోసం క్రీస్తు శిలువ మోసుకుంటూ పడిన శ్రమలను విశ్వాసులు ధ్యానిస్తారు. ఉపవాస దినాలు... ఇంద్రియ సౌఖ్యాలను వీడి, క్రీస్తుకోసం త్యాగమయ జీవితాన్ని గడుపుతూ, క్రీస్తువాక్కుపై ధ్యానాన్ని కొనసాగించాలనీ, తపఃకాలం... క్రీస్తు శిలువపై పడిన యాతనను, క్రైస్తవులు చేసిన త్యాగ కృత్యాలను గుర్తు చేసుకోవాలనీ సూచిస్తాయి.


ప్రార్థించడం, ఉపవాసం పాటించడం, దాతృత్వం ప్రకటించడం అనే మూడు సూత్రాలు ఈ తపఃకాలానికి మూడు స్తంభాలు. మొదటిది దైవ సంబంధమైనది. రెండోది పంచేంద్రియాలను అదుపులో పెట్టుకొని దేవుడికోసం పరితపించడం. మూడోది దాతృత్వంతో, దయాదాక్షిణ్యాలతో సమాజంలోని తోటివారికి సహాయ సహకారాలు అందించడం. క్రైస్తవులు తాము చేసిన పాపాలకు పశ్చాత్తాపపడుతూ, మారిన హృదయంతో కొత్త నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం కలిగించే రోజులు కాబట్టి వీటిని 'పరిణామ దినాలు'గా కూడా కొందరు భావిస్తారు. ఉపవాసంతో శరీరాన్ని శుష్కింపజేసుకోవడం అనేది కేవలం మనిషిలోని అహంకారం తగ్గడానికి, దేవుడికి దగ్గర కావడానికి మాత్రమే. నిరశన దీక్షతో నీరసించి అనారోగ్యానికి గురి కావడానికి కాదు.



క్రీస్తు శిలువపై మరణించింది శుక్రవారం కాబట్టి... సాధారణంగా ఈ శిలువ మార్గం ఘట్టాలన్నిటినీ భక్తి శ్రద్ధలతో.. ఈ నెల రోజులపాటు, ప్రతి శుక్రవారం స్మరించుకుంటారు. నిర్దోషి అయిన క్రీస్తుకు అన్యాయంగా మరణశిక్ష విధించడం, ఆయన శిరసుపై ముళ్ళ కిరీటాన్ని పెట్టడం, రాతి స్తంభానికి కట్టి, కొరడాలతో కొట్టడం, శిలువ భారం మోయలేక ఆయన మూడుసార్లు పడిపోవడం, కొయ్య శిలువపై ప్రభువు కాళ్ళకు, చేతులకు మేకులు కొట్టడం. ఆయన శిలువ పైనుంచి మాట్లాడడం, మరణించడం లాంటి సంఘటనలను ధ్యానించడం, ఇతర కార్యక్రమాలను ప్రతి మందిరంలో నిర్వహించడం సంప్రదాయం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

సందేశం



సంకల్ప శుద్ధితో ఉపవాసం

రంజాన్ ఉపవాస దీక్ష పాటించడానికి ముందు సహరీ, ఇఫ్తార్‌ల గురించి పరిజ్ఞానం ఉండడం చాలా అవసరం. నిర్ణీత సమయానికి ముందు కానీ, సమయం దాటిన తరువాత కానీ సహరీ, ఇఫ్తార్ చేస్తే ఉపవాసం వ్యర్థమయ్యే ప్రమాదం ఉంది. నమాజ్‌లో కానీ, రోజా (ఉపవాసం)లో కానీ, హజ్ సమయంలో కానీ సమయపాలనకు, క్రమశిక్షణకు ఇస్లాం చాలా ప్రాధాన్యం ఇస్తుంది. ఏది చేసినా పరిజ్ఞానంతో చేయాలి. దానికోసం అంతిమ మహాప్రవక్త మహమ్మద్ తన ఆచరణ ద్వారా నిర్ధారించిన నియమాలను మాత్రమే అనుసరించాలి. "రాత్రి నల్లదనం నుంచి ఉషోదయపు తెల్లదనం ప్రస్ఫుటం అయ్యేవరకూ ఆహారం, పానీయాలు తీసుకోండి. తరువాత రాత్రి చీకటి పడేవరకూ ఉపవాసం ఉండండి" అని దీని గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఆదేశించారు.

సహరీ, ఇఫ్తార్ అంటే...

రాత్రి చివరి, మూడో జాములో చేసే భోజనాన్ని 'సహరీ' అంటారు. "సహరీ పాటించండి. అందులో మీకు చాలా శుభం ఉంది" అని దైవ ప్రవక్త తెలిపారు. "మీలో మంచి వైపు పిలిచేవారు, చెడు వైపు వెళ్ళకుండా వారించేవారు తప్పకుండా ఉండాలి. అటువంటి వారికి శిక్షణ సహరీ నుంచే లభిస్తుంది. సహనం, సమయపాలన, త్యాగం, ఓర్పు, క్షమ, లైంగిక వాంఛలను అదుపులో ఉంచడం, మనో నిగ్రహం, జవాబుదారీతనం... వీటన్నిటికి దారి ఏర్పడుతుంది. దీనికి సంకల్పశుద్ధి తప్పనిసరి. ఇతరుల మెప్పు కోసం కాఉండా, అల్లాహ్ ప్రసన్నతను, అనుగ్రహాన్ని పొందడానికే చెయ్యాలి. కాబట్టి మనసులో గట్టిగా సంకల్పించుకోవాలి" అని ఉపదేశించారు. ఇక, మగ్రిబ్ నమాజ్‌కు ముందు ఉపవాసాన్ని విరమిస్తూ తీసుకొనే ఆహారాన్ని 'ఇఫ్తార్' అంటారు. సూర్యుడు అస్తమించిన వెంటనే ఇఫ్తార్ చేయాలి. జాప్యం చేయకూడదు. ఎందుకంటే ఉపవాస లక్ష్యం ఆకలితో ఉంచడం కాదు... విధేయతా భావం జనించడానికి మాత్రమే.

సుగుణాలు పెరగడానికి...

రంజాన్ మాసం స్నేహ సంబంధాలను పెంపొందించే నెల. తోటివారికి సేవలందించే నెల. తమ ప్రేమను, ఆనందాన్ని తినుబండారాల రూపంలో, రుచికరమైన ఫలాల రూపంలో ఇఫ్తార్ సమయంలో పంచుతారు. ఇది చాలా పుణ్యప్రదమైన కార్యం. "ఉపవాసం పాటించిన వ్యక్తితో ఇఫ్తార్ చేయించినవారి అపరాధాలను అల్లాహ్ మన్నించడం జరుగుతుంది. అతను చేసే ఈ సత్కార్యం అతణ్ణి నరకాగ్ని నుంచి విమోచనం కలిగించే సాధనం. ఇఫ్తార్‌లో ఖర్జూర పండ్లు వినియోగించడం ప్రవక్త సంప్రదాయం. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం చేసిన వ్యక్తి చేసిన విజ్ఞాపనను దైవం స్వీకరిస్తాడు. తిరస్కరించడు" అని 'హదీస్' గ్రంథం స్పష్టం చేస్తోంది. ఉపవాసాల ద్వారా మనిషి ఆకలి అంటే ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. తద్వారా సమాజంలోని నిరుపేదలను, అన్నార్తులను ఆదుకొనే గుణం అలవడుతుంది. ఉపవాస వ్రతం వల్ల మనిషిలో దైవభీతి, పాపభీతి, జవాబుదారీతనం లాంటి సుగుణాలు జనిస్తాయి.

• మహమ్మద్ వహీదుద్దీన్


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీమ్ బాషా

9వ తరగతి విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు ప్రారంభించాలి

● డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి విద్యార్థులకు 10వ తరగతి సిలబస్‌తో బ్రిడ్జి కోర్సులు ప్రారంభించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఆదేశించారు. గురువారం ఆయన ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా జరుగుతున్న ప్రత్యేక తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా 6నుంచి 9వ తరగతి విద్యార్థులకు తరగతికి తగ్గ సామర్థ్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. మధ్యాహ్న భోజన విషయంలో రాజీపడవద్దని స్పష్టంచేశారు. ఇదే పాఠశాల ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. హెచ్‌ఎం షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

బ్రూనో బలిదానం పుస్తకం ఆవిష్కరణ

సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు గురువారం ఆవిష్కరించారు. స్థానిక రైలుపేటలో జరిగిన కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్రాధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు, సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్‌కమిటీ కన్వీనర్ రమేష్, సుభాని, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని ప్రారంభించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని సామాజికవేత్త డాక్టర్ రాజా సుందర్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం శాసన సభ సమావేశాల సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామికి ఆయన వినతి పత్రం అందజేశారు. రాజసుందరంబాబు మాట్లాడుతూ, సమస్యపై మంత్రి వేగంగా స్పందించారని, వెంటనే కలెక్టర్‌తో మాట్లాడారని వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో నల్లపు నీలాంబరం, స్టాలిన్, డేవిడ్ విలియమ్స్, తదితరులున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు: అనారోగ్యం కారణంగా ఐద్వానగర్ 4వ లైనుకు చెందిన తమ్మిశెట్టి సురేశ్(36) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేశ్ మద్యానికి బానిసవడంతో అతని లివర్ దెబ్బతింది. రెండు రోజుల క్రితం ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉందని చెప్పాడు. గురువారం సురేశ్‌ను జీజీహెచ్‌కు తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ప్రయత్నిస్తుండగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఈ వ్యర్థాలను బాధ్యతగా అందజేయాలి

● కమిషనర్ కె.మయూర్ అశోక్

● ప్రజల సౌకర్యార్థం ప్రతి వార్డులో ప్రత్యేక కౌంటర్లు


కంపోస్టు యార్డులో పరిశీలన చేస్తున్న కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పేరుకుపోయిన ఈ-వ్యర్థాలను బాధ్యతాయుతంగా అందజేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. శుక్రవారం ఈ-వ్యర్థాల సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ఆయన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నగరంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, నిరుపయోగంగా ఉన్న సెల్‌ఫోన్లు, బ్యాటరీలు, చార్జర్లు, కంప్యూటర్ భాగాల వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను ఆ కౌంటర్లలో అప్పగించాలని సూచించారు. ఫ్రిజ్‌లు, టీవీలు ఉంటే జీఎంసీ కాల్ సెంటర్ 0863 2345103 లేదా 9505378036కు తెలియజేస్తే ఇంటి వద్దకే వచ్చి సేకరిస్తారన్నారు. స్వచ్ఛ గుంటూరు నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములై పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

● మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు, వ్యర్థాల పునర్వినియోగం దిశగా గుంటూరు నగరపాలక సంస్థ వేగంగా అడుగులు వేస్తోందని నగర కమిషనర్ అన్నారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్ సమీపంలో ఆయా ప్లాంట్ల ఏర్పాటుకు పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. నాయుడుపేటలో గుర్తించిన ప్రాంతాన్ని ప్లాంట్ల ఏర్పాటుకు వీలుగా తక్షణమే సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను, ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్రమైన మ్యాప్‌లను రూపొందించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ, ఈఈ విష్ణు, డీసీపీ సూరజ్ కుమార్, డీఈఈ సతీష్ కుమార్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, సర్వేయర్ సుభాని పాల్గొన్నారు.

● సీఎం పర్యటన నేపథ్యంలో ప్రత్యేక చర్యలు

ఈ నెల 22న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గుంటూరు పర్యటన నేపథ్యంలో రోడ్లపై గోతులు లేకుండా ప్యాచ్ వర్కులు, డ్రైన్ల శుభ్రం, ఆక్రమణల తొలగింపు చేపట్టాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏటుకూరు రోడ్‌లోని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి సత్యసాయి స్పిరిచ్యువల్ సొసైటీ ట్రస్ట్ ప్రాంగణం వరకు కమిషనర్ పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

మహిళా కార్మికులకు రక్షణ ఇవ్వని లేబర్ కోడ్‌లు

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి


మాట్లాడుతున్న కె.ధనలక్ష్మి, పాల్గొన్న దండా లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు తదితరులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నూతనంగా తెచ్చిన కార్మికచట్టాలతో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. స్థానిక పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ, పగలే మహిళలకు రక్షణ లేని పరిస్థితులలో ప్రభుత్వాలు మాత్రం రాత్రి సమయంలోనూ పనిచేయాలని చెప్పడం దుర్మార్గమని అన్నారు. శ్రామిక మహిళా సమస్యలు చర్చించేందుకు, వివిధ రకాల అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్‌లు ఏప్రిల్ 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో నిర్వహిస్తున్నామని, వీటిని జయప్రదం చేయాలని కోరారు. బి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, రమణ, వై.నేతాజీ, బి.ముత్యాలరావు, ఏవీఎన్ కుమారి, కె.శ్రీనివాసరావు, ధనలక్ష్మీ, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మారుతి దేవాలయ వార్షికోత్సవాలు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్‌లోని మారుతి దేవాలయ 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను జగద్గురువులు గంభీరానంద స్వామి ఆలయ ప్రదక్షిణం చేసి ప్రారంభించారు. అనంతరం వేద పండితులు గణపతి పూజ పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశం, కలశస్థాపనలు చేసి, శ్రీ సిద్ధి, బుద్ధి సమేత గణపతి స్వామి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాదనం, మోదక హోమాలు జరిగాయి. కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్, సభ్యుడు కొరపాటి రామారావు తదితరులు పర్యవేక్షించారు.

ముగిసిన సుందరకాండ ప్రవచన మహా యజ్ఞం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలనగర్ మూడో లైన్‌లోని గణేష్ గాయత్రి సంతోషిమాత దేవస్థానంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న సుందరకాండ పారాయణ ప్రవచనం, శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమం గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు ప్రవచనంలో భాగంగా డాక్టర్ దీవి నరసింహ దీక్షిత్ సుందరకాండలోని శ్లోకాలు, మంత్రాలను వివరించారు. అనంతరం పాలకమండలి అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాదు, ఆడిటర్ లక్కరాజు శ్యామ్ ప్రసాదు, అనురాధ, రవి శ్రీనివాస్, కట్టమూరు శ్రీనివాస్, అర్చకులు సుబ్బారావు, ఉదయ్ కుమార్ శర్మ తదితరులు డాక్టర్ నరసింహ దీక్షిత్‌ను ఘనంగా సత్కరించారు.

బ్రిటన్ రాజు తమ్ముడు ఆండ్రూ అరెస్టు



లండన్, ఫిబ్రవరి 19: బ్రిటన్ రాజు చార్లెస్-3 తమ్ముడు, మాజీ యువ రాజు ఆండ్రూ మౌంట్‌బాటన్ విండ్సర్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అమెరికా లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు దేశ రహస్యాలకు సంబంధించిన పత్రాలు అక్రమంగా చేరవేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలపై థేమ్స్‌వ్యాలీ పోలీసులు ఆండ్రూను అదుపులోకి తీసుకున్నారు. గురువారమే ఆండ్రూ 66వ పుట్టినరోజు. ఆండ్రూను అరెస్టు చేసినప్పటికీ పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేరును ప్రస్తావించలేదు. 'అధికార దుర్వినియోగం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేశాం. ఆ వ్యక్తి పేరును బయటపెట్టకూడదని ప్రభుత్వం ఆదేశించింది' అని థేమ్స్‌వ్యాలీ పోలీస్ అసిస్టెంట్ చీఫ్ కానిస్టేబుల్ ఒలీవర్ రైట్ తెలిపారు. ప్రస్తుతం ఆండ్రూ నివాసం ఉంటున్న తూర్పు ఇంగ్లండ్‌లోని సాండ్రింఘమ్ ఎస్టేట్‌లోకి గురువారం ఆరు పోలీసు వాహనాలు వెళ్లినట్లు స్థానిక మీడియా తెలిపింది. బెర్క్‌షైర్, నార్ఫోక్‌లలో ఆండ్రూకు చెందిన నివాసాల్లో సోదాలు చేస్తున్నట్లు ఒలీవర్ రైట్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంలో ఆండ్రూ చాలాకాలంగా తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎప్‌స్టీన్‌కు చెందిన దీవిలో బాలికలను ఆండ్రూ లైంగికంగా వేధించినట్లు ఆరోపణలున్నాయి. వాటిని ఆయన ఎప్పటికప్పుడు ఖం డిస్తూ వచ్చారు. ఇటీవల అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్‌కు చెందిన 30 లక్షల పత్రాల్లో ఆండ్రూకు చెందినవి కూడా ఉన్నాయి. బాలికలతో అభ్యంతరకంగా ఉన్న ఫొటోలు కూడా బయటకు రావటంతో ఆయన నేరాలపై సమగ్రదర్యాప్తు జరిపించాలని బ్రిటన్ ప్రజల నుంచి డిమాండ్లు పెరిగాయి. దీంతో ఆండ్రూపై దర్యాప్తులో పోలీసులకు సహకరిస్తామని రాజకుటుంబం ఈ నెల ప్రారంభంలో ప్రకటన విడుదల చేసింది. అయితే, లైంగిక వేధింపులపై కాకుండా ప్రస్తుతం అధికార దుర్వినియోగం ఆరోపణలపైనే దర్యాప్తు ప్రారంభమైనట్లు థేమ్స్‌వ్యాలీ పోలీసులు ప్రకటించారు. గత కొన్ని దశాబ్దాల్లో బ్రిటన్ రాజకుటుంబంలోని ఓ సీనియర్ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేయటం ఇదేతొలిసారి.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది: రాజు చార్లెస్

ఆండ్రూ అరెస్టుపై బ్రిటన్ రాజు చార్లెస్-3 స్పందించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. వ్యక్తులకంటే వ్యవ స్థే ఉన్నతమైనదని, అందరూ చట్టానికి లోబడి ఉండాల్సిందేనని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఆండ్రూ దేశ వాణిజ్య రాయబారిగా పనిచేసిన సమయంలో పాల్పడిన అవకతవకలపై ప్రధాని స్పందిస్తూ.. 'ఆండ్రూ అయినా, మరో వ్యక్తి అయినా చట్టం ముందు అందరూ సమానమే. మనం ఇప్పుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు గురించి మాత్రమే మాట్లాడుతున్నాం. కానీ, ఇంకా లెక్కకు మిక్కిలి కేసులు ఉన్నాయి' అని తెలిపారు.

రాజదర్పం నుంచి పాతాళంలోకి..

బ్రిటన్ దివంగత రాణి ఎలిజబెత్-2కు ప్రస్తుత రాజు చార్లెస్ మొదటి కుమారుడు కాగా, ఆండ్రూ రెండో కుమారుడు. ఆయనకు వంశపారంపర్యంగా యువరాజుగా, యార్క్ ప్రభువు (డ్యూక్)గా అధికార హోదా దక్కాయి. ఈ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆయన అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో స్నేహం, బాలికలను లైంగికంగా వేధించటం, ఆ మోజులో పడి దేశ రహస్య పత్రాలను ఎప్‌స్టీన్‌కు లీక్‌చేయటం వంటి అనేక నేరాలకు ఆండ్రూ పాల్పడ్డారు. 1960 ఫిబ్రవరి 19న పుట్టిన ఆండ్రూ.. బ్రిటీష్ రా యల్ నేవీలో 22 సంవత్సరాలు సేవలందించారు. వివిధ ఆరోపణలు, విమర్శల నేపథ్యం లో గతఏడాది నవంబరు 3న ఆండ్రూకు ఉన్న యువరాజు, డ్యూక్ ఆఫ్ యార్క్ బిరుదులను రద్దుచేయటంతోపాటు రాజకుటుంబ సభ్యుడి హోదాను రద్దు చేస్తూ రాజు చార్లెస్ ప్రకటన చేశారు. అప్పటి నుంచి ఆండ్రూ సాధారణ జీవితం గడుపుతున్నారు.

ఇంటికి చేరుకున్న అంబటికి పలువురి పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బెయిల్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం సిద్ధార్థనగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటిని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జీ అంబటి మురళీకృష్ణ(పొన్నూరు), బలసాని కిరణ్‌కుమార్ (ప్రత్తిపాడు), వైసీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పలువురు నాయకులు పరామర్శించారు.

మసీద్ సమీపంలో బార్ ఏర్పాటుపై అభ్యంతరం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతిరోడ్డు బండ్లమూడి గార్డెన్స్ అంబేడ్కర్ నగర్‌లో మసీద్ పక్కనే ఏర్పాటుచేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌ను ఎక్సైజ్ అధికారులు అడ్డుకోవాలని అంబేడ్కర్‌నగర్ మసీద్ ఎ మురాద్ అధ్యక్షుడు పి.జోమామ్ ఖాన్ కోరారు. దీనిపై వారం క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదుచేశామని చెప్పారు. మద్యం షాపులు విద్యాసంస్థలకు, ప్రార్థనా స్థలాలకు 100 మీటర్లకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు చెబుతున్నాయని, ఈ చట్టాల్ని ఉల్లంఘించి ఈ బార్‌ను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు జోక్యం చేసుకొని అడ్డుకోవాలని కోరారు.

గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను పరిరక్షించుకోవాలి


రిలే దీక్షల్లో నాయకులు నరసింహారావు, అమర్‌నాథ్ ఉద్యోగులు

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పేరుతో గుంటూరు-2 గ్యారేజ్‌ను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకుడు మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. గుం టూరు-2 డిపో జేఏసీ చైర్మన్, కన్వీనర్‌లు పి.అమర్‌నాథ్, ఎస్‌టీ దత్తు ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే దీక్షలను ఆయన గురువారం ప్రారంభించి ప్రసంగించారు. రూ. కోట్ల ఆస్తులను కాపాడుకునేందుకు ఉద్యోగులంతా సంఘటితమై పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. జేఏసీ నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లో గ్యారేజ్‌ను ప్రైవేటు పరం కానివ్వమని, అవసరమైతే ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈయూ జోనల్ నాయకుడు కంఠంనేని వెంకట నరసింహారావు రిలే దీక్షలకు హాజరై సంఘీబావం తెలియజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎమ్ఎస్ రెడ్డి, శ్రీనివాసరావు, విజయ్ కుమార్, రవిశంకర్ తదితరులున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గద్దర్ ప్రత్యేక అవార్డుల జ్యూరీ కమిటీ చైర్మన్‌గా తమ్మారెడ్డి భరద్వాజ



'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్'లో భాగమైన స్పెషల్ అవార్డుల జ్యూరీ కమిటీలో ప్రభుత్వం కీలక మార్పు చేసింది. ఈ కమిటీకి ఇదివరకు చైర్మన్‌గా నియమించిన దర్శకుడు కె.రాఘవేంద్ర రావు స్థానంలో దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజను నియమించింది. ఈమేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. గద్దర్ అవార్డులు కాకుండా... ఇందులో భాగంగా మరో ఎనిమిది రకాల ప్రత్యేక అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేయనుంది. ఈ ప్రత్యేక అవార్డుల జ్యూరీ కమిటీకే తమ్మారెడ్డి భరద్వాజను తాజా చైర్మన్‌గా నియమించింది.

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి)

భావోద్వేగాల 'నవాబ్ కేఫ్'



శివ కందుకూరి, రాజీవ్ కనకాల, తేజు అశ్విని ప్రధాన పాత్రల్లో ప్రమోద్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'నవాబ్ కేఫ్'. హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా వి పపుడిప్పు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ 'మా నవాబ్ కేఫ్' సినిమా పట్ల టీమ్ అంతా వంద శాతం సంతృప్తితో ఉంది. ఈ సినిమాలోని ఎమోషన్ అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకుల సమయం, డబ్బుకి న్యాయం చేసేలా మా సినిమా ఉంటుంది' అని అన్నారు. 'ఫ్యామిలీ అంతా కలసి చూడదగ్గ చిత్రమిది' అని నిర్మాత వెంకట్ ఆర్ పపుడిప్పు చెప్పారు.

హిట్ కొట్టబోతున్నాం

- వంశీ నందిపాటి



'ఇప్పటి వరకు మా 'హే బల్వంత్' సినిమా గురించి చాలా సార్లు చాలా వేదికలపై చెప్పాం. 650కి పైగా థియేటర్లలో సినిమా విడుదల చేయబోతున్నాం. విజయంపై మాకున్న నమ్మకానికి నిదర్శనమిది. మూడు గంటల సమయాన్ని ప్రేక్షకులు మాకిస్తే.. నెలకు సరిపడా ఆరోగ్యాన్ని మేము వారికిస్తాం. మంచి కథ, మంచి వినోదం, హృదయాలను కదిలించే భావోద్వేగాలున్న చిత్రమిది' అని అన్నారు నిర్మాత వంశీ నందిపాటి. సుహాస్, శివానీ నగరం జంటగా గోపి అచ్చర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. హీరో సుహాస్ మాట్లాడుతూ 'నేను గ్యారంటీ ఇస్తున్నాను. ఈ మూవీ అందర్నీ ఆకట్టుకుంటుంది' అని పేర్కొన్నారు.

ఈ ఏడాది 2 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం

- రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు వస్తున్నాయి
- వాటిలో యువతకు ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలి
- కంపెనీల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు
- జాబ్ క్యాలెండర్‌లో అధ్యాపక పోస్టులు ఉండాలి
- విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై లోకేశ్ సమీక్ష


అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నందున వాటిలో యువతకు ఉపాధి కల్పనపై దృష్టిపెట్టాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలపై గురువారం ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రౌండ్ అయిన పరిశ్రమల్లో ఈ ఏడాది 2లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. రియలన్స్, సీబీజీ, జూపిటర్ లాంటి కంపెనీలకు అవసరమయ్యే నైపుణ్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. కరిక్యులమ్‌లో మార్పులకు ప్రముఖ కంపెనీల సలహాలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే కొన్ని కంపెనీలు సొంతంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశాయని, వాటిని అధ్యయనం చేసి, అదే తరహాలో ఐటీఐలకు అనుబంధంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. వీలైనంత త్వరగా నైపుణ్యం పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. కాగా పోర్టల్‌కు 25 రంగాల డేటా అనుసంధానం చేశామని, 20 వేల మంది విద్యార్థులు, 60 వేల మంది నిరుద్యోగులకు ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలు నిర్వహించామని అధికారులు వివరించారు. యూనివర్సిటీలు, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపక పోస్టుల భర్తీపై సమీక్షించారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా మెగా డీఎస్సీ తరహాలో ఉగాదికి ఇవ్వబోయే జాబ్ క్యాలెండర్‌లో ఈ పోస్టులు పెట్టాలని మంత్రి స్పష్టంచేశారు. కోచింగ్ సెంటర్లకు నిబంధనల రూపకల్పనకు ప్రజాభిప్రాయం తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, నారాయణ భరత్‌గుప్తా, గణేష్‌కుమార్ పాల్గొన్నారు.



ఏపీ ఎస్ఎస్‌డీసీ అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్

నేడు హస్తినకు చంద్రబాబు

- ఏఐ సదస్సుకు హాజరు
- ఐబీఎం సహా పలు సంస్థలతో కీలక ఎంవోయూలు



న్యూఢిల్లీ/ అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'కు సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరు కానున్నారు. ఏపీని సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సదస్సులో పాల్గొంటున్న ఆయన.. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతారు. ఉదయం జైపూర్ నుంచి ఢిల్లీకి చేరుకుంటారు. తర్వాత భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌కు వెళ్తారు. ఉదయం 9.30గంటలకు 'ఏఐ యాక్సిలరేటర్స్: ప్యూయలింగ్ ఇండియాస్ ఎకనమిక్ గ్రోత్' అనే అంశంపై జరిగే ప్లీనరీ సెషన్‌లో ఆయన అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి పాల్గొంటారు. అనంతరం ఏపీలో ఏఐ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి కల్పనకు సంబంధించిన కొన్ని ఎంవోయూలు రాష్ట్రప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రముఖ ఐటీ సంస్థ ఐబీఎంతో ఒప్పందం చేసుకోనుంది. క్వాంటమ్‌తో పాటు ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతో, క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీతోనూ ఎంవోయూ కుదుర్చుకోనుంది. 'ఏఐ ట్యూటర్' ఏర్పాటుకోసం ఐఐటీ మద్రాస్ కూడా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో ఏపీలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ప్రకటన చేయనున్నారు. అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాదితోనూ సీఎం సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గొంటారు. 'కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో చంద్రబాబు పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యూకే ప్రతినిధి బృందంతోనూ భేటీ అవుతారు. బ్రిటన్ ఏఐ, ఆన్‌లైన్ సేఫ్టీ విభాగం మంత్రి కనిష్క నారాయణ్, భారత్‌లో యూకే హైకమిషనర్ లిండి కామరాన్, వాతావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్టర్ కౌన్సెలర్ శాలీ టేలర్ తదితరులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆరాంకో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుక్రైర్, అడోబ్ సీఈవో శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హేలీతో సీఎం విడివిడిగా భేటీ అవుతారు. అనంతరం ఢిల్లీ నుంచి బయల్దేరి అమరావతికి చేరుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి హాజరు

కాగా.. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ వివాహానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి జైపూర్‌కు చేరుకున్న సీఎం.. అక్కడి వృందావన్ ప్యాలెస్‌లో జరిగిన పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రాత్రికి జైపూర్‌లోనే బస చేసి శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్తారు.

26 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

- మార్చి 10 వరకు కార్యక్రమం: మంత్రి మనోహర్

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత్వ నమోదు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుందని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులతో గురువారం సాయంత్రం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సభ్యత్వ నమోదుతో అన్ని వర్గాల వారినీ, అన్ని రంగాల వారినీ కలుసుకుని పార్టీకి దగ్గర చేసే గొప్ప అవకాశం ఈ నెల 26 నుంచి మార్చి 10వరకు కలుగుతుందన్నారు. దీనిద్వారా పార్టీ క్షేత్రస్థాయి బలాన్ని చాటిచెబుదామని, స్థానిక ఎన్నికలకు సభ్యత్వ నమోదును సన్నద్ధతగా భావిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పిఠాపురం నియోజకవర్గంలో గురువారం లాంఛనంగా ప్రారంభమైందన్నారు. '2020లో 5 నియోజకవర్గాల్లో పైలెట్ విధానంలో మొదలుపెట్టిన కార్యక్రమం.. గతేడాది 12.18 లక్షలకు చేరింది. మొదటి ఏడాది 94 వేల మంది చేరితే అది ప్రతి ఏటా పెరుగుతూ వెళ్లింది. కరోనా సమయంలోనూ 3.30 లక్షల మందిని సభ్యులుగా చేర్చాం. ప్రతి నియోజకవర్గం నుంచి 75 నుంచి 100 మంది సాధక్‌ల పేర్లను సత్వరమే అందజేయాలి. ఉద్యమి సభ్యత్వం తీసుకున్న వారు రూ.400 చెల్లించాలి. వీరికి ప్రమాద బీమా ప్రయోజనాలు అందుతాయి. అలాగే పార్టీకి పరోక్షంగా సహాయసహకారాలు అందించే వారిని ప్రదాత అని పిలుస్తాం. సాధక్‌లకు అందుబాటులో ఉండేలా.. ప్రత్యేక కాల్ సెంటర్ ఈ రెండు వారాలూ పనిచేస్తుంది. జెన్ జీ తరం సరికొత్తగా ఆలోచిస్తోంది. వారిని పార్టీకి దగ్గర చేయాలి. సభ్యత్వ నమోదును పరిశీలించేందుకు, సమన్వయపరచేందుకు రెండ్రోజుల్లో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి పరిశీలకులను నియమిస్తాం. ఇతర రాష్ట్రాల్లోనూ సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వారి కోసం వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకునే ఆప్షన్ కల్పించాం. సభ్యత్వ నమోదును రెండు వారాలు ఊరూ వాడా పండుగలా నిర్వహిద్దాం' అని మనోహర్ అన్నారు.

హెరిటేజ్‌పై అసత్య ప్రచారం ఆపండి!

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. ఈ కథనాలు తమ సంస్థ 33 ఏళ్ల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని, పూర్తిగా వాస్తవ విరుద్ధమని తెలిపింది. ఇటువంటి కథనాలు ప్రచురించిన, ప్రసారం చేసిన సాక్షి మీడియాపై రూ.100 కోట్ల పరువు నష్టం విధించాలని విజ్ఞప్తి చేసింది. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ మినీ పుష్కర్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. హెరిటేజ్‌కు వ్యతిరేకంగా ప్రచురించిన, ప్రసారం చేసిన అసత్య, తప్పుదోవ పట్టించే, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. హెరిటేజ్ పరువుకు భంగం కలిగించే అంశాలను ప్రచురించడం, పోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం, ప్రచారం చేయడం కొనసాగించకుండా సాక్షి వార్తాపత్రిక, సాక్షి టీవీ, వాటి అనుబంధ సంస్థలు, ఇతర సోషల్ మీడియా వినియోగదారులను నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 24 గంటల్లో కంటెంట్‌ను తొలగించాలని, భవిష్యత్‌లో అభ్యంతరకర కంటెంట్ ప్రసారం కాకుండా చూడాలని ధర్మాసనం ఆదేశించింది. మెటా (ఫేస్‌బుక్), 'ఎక్స్' వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంలు ఈ వివాదాస్పద కంటెంట్‌ను గుర్తించి, 55 ఫేస్‌బుక్ లింకులు, 52 ఇన్‌స్టాగ్రామ్ లింకులు, 70 యూట్యూబ్ లింకులు, 85 'ఎక్స్(ట్విటర్)' లింకులను తొలగించాలని తెలిపింది. నిరాధారమైన, నష్టం కలిగించే ఆరోపణలను జవాబుదారీతనం లేకుండా ప్రసారం చేయడం సరికాదని సాక్షి మీడియాకు హితబోధ చేసింది. తుది తీర్పు వచ్చే వరకు హెరిటేజ్ ప్రతిష్ఠకు ఈ మధ్యంతర ఉత్తర్వు తక్షణ రక్షణను అందిస్తుందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తమ ఉత్తర్వుల అమలుపై వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని.. అవి అందాక నాలుగు వారాల్లో వారు జవాబివ్వాలని స్పష్టం చేశారు. రిజాయిండర్ వేయాలనుకుంటే తర్వాత రెండు వారాల్లో దాఖలు చేయాలని పిటిషనర్‌కు సూచించారు. పిటిషన్‌ను జూలై 9న లిస్టు చేయాలని ఆదేశించారు.

చీజ్ ప్యాకెట్ చూపి
నెయ్యి అంటారా?

- చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియనోళ్లు మీరు
- జగన్ ఆరోపణల్లో ఒక్క లైనూ నిజం లేదు
- 3 గంటల పాటు ఆపకుండా అబద్ధాలు
- జగన్ ఒరిజినల్ క్రిమినల్: హోం మంత్రి అనిత

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చీజ్ ప్యాకెట్ తీసుకొచ్చి, దానిని నెయ్యి అని ప్రచారం చేస్తున్నవారి గురించి ఏం మాట్లాడాలో తెలియడం లేదని హోం మంత్రి అనిత అన్నారు. జగన్‌తో పాటు వైసీపీ నాయకులెవరికీ కనీస అవగాహన లేదన్నారు. తిరుమల నెయ్యి విషయంలో వారికి అంటిన బురదను తిరిగి అందరికీ అంటించడానికి వింత వాదనలు తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. "హెరిటేజ్ వెబ్‌సైట్ చూస్తే లిస్ట్ ఆఫ్ కంపెనీలు 20 ఉంటాయి. అందులో 15 హెరిటేజ్ సొంత యూనిట్లు. మరో 5 కాంట్రాక్టు ఉత్పత్తి యూనిట్లు. ఆ ఐదులో ఒకటి ఇందాపూర్ యూనిట్. ఐదు యూనిట్లను కో-మానుఫ్యాక్చరింగ్ యూనిట్లు అనే పిలుస్తారు. అలా చూపించడం కంపెనీల పాలసీలో భాగం. హెరిటేజ్‌కు ఇందాపూర్ యూనిట్ కంపెనీ అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. యూనిట్ కంపెనీ అంటే తమకన్నా చిన్న కంపెనీ అవుతుంది. కానీ హెరిటేజ్ కంటే ఇందాపూర్ పెద్ద కంపెనీ. వివిధ పాల ఉత్పత్తులను బల్క్‌గా మార్కెటింగ్ చేస్తుంది. ఆ క్రమంలోనే ఇందాపూర్ నుంచి చీజ్, పన్నీరు, టెట్రా ప్యాకెట్ల పాలను హెరిటేజ్ కొనుగోలు చేస్తుంది. హెరిటేజ్ ఇప్పటి వరకూ ఏ కంపెనీకి నెయ్యి సరఫరా చేయలేదు. హెరిటేజ్‌కు సొంతంగా నెయ్యి ఉత్పత్తి కేంద్రం ఉంది. అది కూడా వినియోగదారులకు మాత్రమే అమ్ముతుంది. బల్క్‌గా ఎవరికీ అమ్మదు. అయితే ఇందాపూర్‌కు హెరిటేజ్ నుంచి నెయ్యి వెళ్తుందని మాట్లాడుతున్నారంటే అసలు మీకు బుర్ర పనిచేస్తుందా? ఆ కంపెనీలో పనిచేసే మరకంద్ శాస్త్రి అనే ఆయన మరో ఉద్యోగం వచ్చిందని రాజీనామా చేశారు. ఇంకా రిలీవ్ కాలేదు.మంచి ఉద్యోగం వచ్చిందని రాజీనామా చేస్తే దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారు. వైసీపీ వ్యవహారం కొండను తవ్వి... అన్నట్టుగా ఉంది. హెరిటేజ్‌ను తవ్వితే మీకు ఎలుక కూడా దొరకదు. అంత క్లీన్‌గా ఉండే సంస్థ అది" అని అన్నారు.



ఆ రెండు కంపెనీలు వేర్వేరు

"మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చీజ్ ప్యాకెట్ చూపించి అదే నెయ్యి అంటున్నారు. చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియని వ్యక్తులు మీరు. కొత్తగా భోలేబాబా కంపెనీ అంటూ దుష్ప్రచారం మొదలుపెట్టారు. భోలేబాబా ఆర్గానిక్స్ మిల్క్ లిమిటెడ్ మాత్రమే టీటీడీకి నెయ్యి సరఫరా చేసింది. ఆ కంపెనీయే నిందితుల జాబితాలో ఉంది. భోలేబాబా మిల్క్ ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీ టీటీడీకి నెయ్యి సరఫరా చేయలేదు. రెంటికీ సంబంధం లేకపోయినా ఒక్కటేనని ప్రచారం చేస్తున్నారు. తిరుపతి లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని అన్ని నివేదికల్లో తేలింది. మీ హయాంలో కల్తీ జరిగిందని అప్పటి చైర్మన్ చెప్పినప్పుడు ఎందుకు సరఫరా కంపెనీని ఆపలేదు? కల్తీ గురించి చెప్పకుండా ఇందాపూర్ గురించి మాట్లాడుతున్నారు" అని ధ్వజమెత్తారు.

కల్తీపై ఆధారాలున్నాయి

'కల్తీ నెయ్యిలో రూ.250 కోట్ల స్కాం జరిగిందనే దానికి ఆధారాలున్నాయి. బిల్‌గేట్స్ లాంటి వ్యక్తి ఏపీకి వస్తే ఆ స్థాయిని మర్చిపోయి టీ ఖర్చుల గురించి మాట్లాడుతున్నారు. కల్తీ నెయ్యి గురించి అడిగితే లోకేశ్ క్రికెట్ మ్యాచ్‌కు వెళ్లాలా అని అడుగుతారు. ఆయన సొంత డబ్బుతో వెళ్లి మ్యాచ్ చూస్తే మీకేంటి? కుటుంబ సభ్యులతో సహా లోకేశ్ వాడేవన్నీ సొంత వాహనాలు. కల్తీ నెయ్యిపై మూడు రోజుల నుంచి చర్చకు సిద్ధమని అంటున్నా వారు ముందుకు రావట్లేదు. ప్రజల్లోకి రావడానికి భయపడే వ్యక్తి జగన్. అలా భయపడే రోగం ఏంటో గూగుల్ కూడా చెప్పలేకపోతోంది. మూడు గంటలు ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిందే మళ్లీ మళ్లీ చెప్పి నీలి మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. అందులో ఒక్క లైను కూడా నిజం లేదు. 3గంటలు ఆపకుండా అబద్ధాలు చెప్పినందుకు గిన్నిస్ రికార్డ్ ఇవ్వాలి. పోలీసు భాషలో అలవాటుపడిన నేరస్థులు ఉంటారు. జగన్ మనస్తత్వాన్ని పరిశీలిస్తే ఒరిజినల్ క్రిమినల్' అని అనిత అన్నారు.

టీటీడీకి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి సరఫరా చేయలేదు

- బొత్స తెలుసుకోవాలి: టీటీడీ చైర్మన్

తిరుమల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి సరఫరా చేయలేదని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా టీటీడీకి నెయ్యి సరఫరాలో హెరిటేజ్ పాత్ర లేదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మండలిలో ప్రతిపక్ష నేతగా బాధ్యతాయుత స్థానంలో ఉన్న బొత్స సత్యనారాయణ విషయాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. హెరిటేజ్ చీజ్ ప్యాకెట్లు చూపించి.. నెయ్యి అంటూ తన పరువు పోగొట్టుకున్నారని అన్నారు. అబద్ధాన్ని పదేపదే చెప్తే నిజమవుతుందనుకోవడం భ్రమని, టీటీడీకి హెరిటేజ్ నెయ్యి సరఫరా చేయలేదనేది నిప్పులాంటి నిజమన్నారు.

రాజీవ్‌రంజన్ నేతృత్వాన డెడికేటెడ్ కమిషన్

- వెనుకబడిన వర్గాల స్థితిగతులపై అధ్యయనం
- 45 రోజుల్లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు
- ప్రభుత్వానికి బీసీ సంక్షేమ సంఘం ధన్యవాదాలు

అమరావతి/గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 87 పట్టణ స్థానికసంస్థలు, గ్రామ పంచాయతీలు, మండలపరిషత్, జిల్లాపరిషత్‌ల పదవీకాలం త్వరలో ముగియనుండటంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం పదవీకాలం ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేముందు ట్రిపుల్‌టెస్ట్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర వెనుకబడిన వర్గాల డెడికేటెడ్ కమిషన్‌ను నియమించిన ప్రభుత్వం.. ఆ కమిషన్ గడువు 20-09-2025తో ముగియడంతో కొత్తగా స్వతంత్ర ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ డెడికేటెడ్ కమిషన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రాను నియమించింది. స్థానికసంస్థల వారీగా వెనుకబడిన వర్గాల స్థితిగతులు, వాటి స్వరూపం, తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాలని నిర్దేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి స్థానిక సంస్థకు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయిస్తూ 45 రోజుల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించింది. బీసీ సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌రాజు ఈ కమిషన్‌కు కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులతో సమావేశాలు, అధ్యయన పర్యటనలు చేపట్టేందుకు కమిషన్‌కు అనుమతించారు. కమిషన్ సిబ్బంది, పారితోషికం, ఇతర పరిపాలనా సౌకర్యాలకు సంబంధించి ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులు జారీచేయనున్నట్లు బీసీ సంక్షేమశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, డెడికేషన్ కమిషన్ ఏర్పాటు హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై సీఎం చంద్రబాబుతో పాటు కూటమి ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తప్పులన్నీ బాబువే

- 'కల్తీ'తో వైసీపీకి సంబంధం లేదు
- బాబువైపు నాలుగు వేళ్లు చూపిస్తుంటే.. ఒక్కవేలిని నా వైపు చూపిస్తే ఎలా?
- సానుకూల మీడియాతో జగన్ 3 గంటలా 45 నిమిషాల ప్రసంగం



అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబు తప్పు చేసినట్లుగా నాలుగు వేళ్లు చూపిస్తుంటే.. ఒక్క వేలిని తనవైపు చూపిస్తే ఎలా అని జగన్ ప్రశ్నించారు. అందుకే దేవుడు చంద్రబాబుకు మొట్టికాయలు వేస్తున్నాడని వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఎంపిక చేసుకున్న సానుకూల మీడియాతో జగన్ దాదాపు 3 గంటలా 45 నిమిషాలు మాట్లాడారు. బడ్జెట్‌పై మాట్లాడతారంటూ సమాచారం ఇచ్చినప్పటికీ.. కావాలనే ప్రశ్న వేయించుకుని నెయ్యి వ్యవహారంపై మాట్లాడారు. 'మీరడిగారు కాబట్టే'.. అంటూ కూసింత నాటకీయతను ప్రదర్శిస్తూ, ముందుగా సిద్ధం చేసిన సమాచారాన్ని తెప్పించుకుని వల్లె వేశారు. తిరుమల లడ్డూ అంశంలో తప్పంతా చంద్రబాబు హయాంలోనే జరిగిందని ఆరోపించారు. గతంలో చంద్రబాబు హయాంలోనైనా, వైసీపీ హయాంలోనైనా టెండర్ల ద్వారా పాడి నెయ్యి సరఫరా చేశారని చెప్పారు. నెయ్యిని సరఫరా చేసేవారు అక్రిడియేటెడ్ ల్యాబ్‌లో సర్టిఫై చేసుకుని వచ్చాకే లోపలికి అనుమతి ఇస్తారని చెప్పారు. సీబీఐ సిట్ చార్జిషీట్‌లోని పేజీ నంబర్ 44, 91, 64 ప్రకారం.. ఎంఎస్ఏఆర్ వైష్ణవి డెయిరీకి చెందిన 4 ట్యాంకర్లను రిజెక్టు చేయగా, శ్రీకాళహస్తి రాఘవేంద్ర క్రషర్స్ వద్ద రహస్యంగా ఉంచి 2024 ఆగస్టు, సెప్టెంబరులో మళ్లీ సరఫరా చేశారని అన్నారు. ఒకసారి రిజెక్టు చేసిన నాలుగు ట్యాంకర్లను 2024 సెప్టెంబరు 18న తిరుమలకు మరోసారి వస్తే టీటీడీ అధికారులు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదని ప్రశ్నించారు. సరిగ్గా అదే రోజున చంద్రబాబు లడ్డూలో పశువుల కొవ్వు ఉందని ఆరోపణ చేయడం ఏమిటన్నారు. ఇవన్నీ చంద్రబాబు హయాంలోనే జరిగాయని, వైసీపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. నెయ్యి సరఫరాలో తప్పులన్నీ టీడీపీ హయాంలో జరిగితే 2019 నుంచి అని ఎందుకంటున్నారని చంద్రబాబును ప్రశ్నించారు. నెయ్యి వ్యవహారంపై 2014 నుంచి ఎందుకు విచారణ చేయడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో 15 సార్లు, వైసీపీ హయాంలో 18 సార్లు నెయ్యి శాంపిల్స్‌లో ఫెయిల్ అయితే వెనక్కు పంపేశారన్నారు. ప్రీమియర్ అగ్రిఫుడ్ 2013-14 సమయంలో వరుసగా నెయ్యి సప్లయ్ చేసిందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంతా మోసమేనన్నారు. మోసానికి షర్టు, ప్యాంటూ వేస్తే చంద్రబాబు అవుతాడని విమర్శించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లను అమలు చేయడం లేదన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాధనం దుర్వినియోగం చేసేలా సీఎం చంద్రబాబుకు ఒక ప్రత్యేక విమానం, ఒక హెలికాప్టర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మరో ప్రత్యేక విమానం, హెలికాప్టర్, మంత్రి లోకేశ్‌కు ఒక విమానం, హెలికాప్టర్ ఎందుకని జగన్ ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు క్రికెట్ అంటే ఇష్టమున్నా మ్యాచ్‌లను చూసేందుకు ప్రత్యేకంగా శ్రీలంకకు వెళతారా అని ప్రశ్నించారు. క్రికెట్ అంటే ఇష్టముంటే ఇంట్లో చూసుకోవాలని, తానూ ఇంట్లోనే క్రికెట్ చూశానని అన్నారు. రాత్రి ప్రత్యేక విమానంలో శ్రీలంకకు వెళ్లి, ఉదయానికి విశాఖకు వస్తారా అని ప్రశ్నించారు.

గమనిక: హెరిటేజ్ పరువుకు భంగం కలిగించే అంశాలను ప్రచురించడం, పోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం చేయరాదని ఢిల్లీ హైకోర్టు ఆదేశించినందున.. హెరిటేజ్‌పై జగన్ చేసిన ఆరోపణలు, విమర్శలను ప్రచురించడం లేదు.

'కల్తీ' ఊసెత్తకుండా జగన్ జాగ్రత్త

నాడు తిరుమల లడ్డూ తయారీకి నెయ్యి సరఫరాలో కల్తీ జరిగిందని, అసలు నెయ్యే లేకుండా రసాయనాలతో తయారు చేశారని సీబీఐ సిట్ తేల్చింది. కానీ జగన్ ఈ అంశాన్ని ప్రస్తావించకుండా మరోసారి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో గందరగోళం సృష్టించేలా గంటల తరబడి మాట్లాడారు. తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో సహా ఆ పార్టీకి చెందిన ఇతర ముఖ్యనేతలు అంగీకరించారు. కానీ ఉద్దేశపూర్వకంగా జగన్ ఈ అంశాన్ని దాట వేశారు. హెరిటేజ్ గురించి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందాపూర్ డెయిరీ అంశంపై దాదాపు గంట సేపు మాట్లాడారు. ఏదో జరిగినట్టు ప్రజల్లో సందేహాలు కలిగేలా ఇతర అంశాల గురించి మాట్లాడారు. 2014 నుంచి నెయ్యి సరఫరాపై దర్యాప్తు చేయాలంటూ కొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. జగన్ హయాంలో తిరుమలకు నెయ్యి సరఫరాలో కుట్ర చేశారని, రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి సరఫరా చేశారని సిట్ నివేదికలో పేర్కొంది. కానీ జగన్ ఈ విషయం గురించి మాట్లాడకుండా చంద్రబాబుకు తప్పులు ఆపాదించేలా మాట్లాడారు.

నిజాయితీ, పారదర్శకతల పునాదిపైనే హెరిటేజ్ నిర్మాణం

- ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, ఎండీ నారా భువనేశ్వరి ట్వీట్

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 'నిజాయితీ, పారదర్శక విధానాలపైనే హెరిటేజ్‌ను నిర్మించాం. మా విధానాలు, నాణ్యత చూడండి. మా రైతులతో మేం ఎలా ఉంటున్నామో చూడండి. మేం చెప్పింది నిజమని తెలుసుకునేందుకు మీరు స్వయంగా చూసి నిర్ధారించుకోవచ్చు. దీనికోసం మేం మిమ్మల్ని సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. ఇదే హెరిటేజ్ వాగ్దానం' అంటూ ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, ఎండీ నారా భువనేశ్వరి వెల్లడించారు. హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో గురువారం ఆమె ఈ అంశంపై 'ఎక్స్'లో ట్వీట్ చేశారు."ప్రతి ఇంటికీ ఆరోగ్యకరమైన తాజా పాలు, ఉత్పత్తులతో సంతోషపరచడంతోపాటు ప్రతి పాడి రైతు సాధికారత సాధించేలా చేయడమే హెరిటేజ్ సంస్థ లక్ష్యం. 33 ఏళ్లుగా ఇదే మా ప్రస్థానం. రూ.4 కోట్లతో చిన్న సంస్థగా ప్రయాణం ప్రారంభించి, ఈరోజు రూ.4 వేల కోట్లకు పైగా విలువైన సంస్థగా ఎదిగాం. మా లక్ష్యం పట్ల నిజాయితీగా నిలబడే వాగ్దానమే ఈ సంస్థను నిర్మించింది. దీనికి నాణ్యతలో ఎలాంటి రాజీ లేకపోవడమే పునాది. వినియోగదారుల సంతృప్తి, సంతోషాలు ఈ నమ్మకంతోనే మొదలవుతాయి. పాలతోపాటు పెరుగు, నెయ్యి, పన్నీరు, ఐస్‌క్రీమ్.. ఇలా అన్ని ఉత్పత్తుల్లో మేం అంకితభావం చూపిస్తాం. హెరిటేజ్‌లో నాణ్యత అనేది ఒకరోజు కృషి కాదు. ప్రతిరోజూ నిరంతరం కొనసాగే ప్రక్రియ. ప్రతి ఉత్పత్తికీ 25 నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తాం. పరిశుభ్రత, భద్రత, ప్రమాణాల విషయంలో చట్టపరమైన నిబంధనల కంటే కూడా కఠినమైన పరీక్షలు, విధానాలు మేం పాటిస్తాం. 500 మందికి పైగా నిపుణులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అత్యున్నత ప్రమాణాలు పాటించిన సురక్షితమైన, పోషక విలువలు కలిగిన తాజా ఉత్పత్తులు మాత్రమే మీ ఇంటికి చేరేలా చూస్తాం. పాడి రైతుల్ని శక్తివంతుల్ని చేయడం కూడా మా బాధ్యత. ప్రస్తుతం హెరిటేజ్ తొమ్మిది రాష్ట్రాల్లోని 3 లక్షల మంది పాడి రైతులతో కలిసి పని చేస్తోంది. రైతులకు సకాలంలో చెల్లింపు, నాణ్యత-కొలతల విషయంలో పూర్తి పారదర్శకత, న్యాయమైన ధర... ఈ మూడూ ముఖ్య సూత్రాలపై రైతులతో మా భాగస్వామ్యం మూడున్నర దశాబ్దాలుగా కొనసాగుతోంది. అంతేకాదు.. వెటర్నరీ సర్వీసులు, పశు సంరక్షణ, మంచి దాణా, ఆర్థిక రక్షణ, శిక్షణ, డిజిటల్ మద్దతు, పెట్టుబడితో రైతుల పురోగతికి కృషి చేస్తున్నాం. రైతుల అత్యుత్తమ జీవనంతోనే నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయనేది హెరిటేజ్ విశ్వాసం. మూడున్నర దశాబ్దాలుగా ఆచరణలో నిలబెట్టుకుంటున్న వాగ్దానమిది. ఇది తరతరాలకు కొనసాగించే అంకితభావం" అని భువనేశ్వరి పేర్కొన్నారు.

అభివృద్ధి పనులతో ఉపాధి అనుసంధానం

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వీబీ జీరామ్‌జీ పథకం కింద పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు శ్రద్ధ పెట్టాలని సూచించారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం చాంబర్‌లో వీబీ జీరామ్‌జీ పథకంపై సీఎం సమీక్షించారు. వచ్చే సంవత్సరం నుంచి అమల్లోకి రానున్న ఈ పథకాన్ని గ్రామీణ స్థాయిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులతో అనుసంధానించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిపోయిన పెండింగ్ పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. 2025-26లో వేతన కాంపోనెంట్ కింద రూ.4,619 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 1,962కోట్లు వ్యయం చేసినట్లు అధికారులు వివరించారు. దేశవ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద వ్యయం చేసిన రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. వీబీ జీరామ్‌జీ కింద రాష్ట్రానికి అవసరమైన పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌరవిద్యుత్ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు, జల్‌జీవన్ మిషన్ కింద మరమ్మతులు, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు, ప్రజా భవనాల నిర్మాణం, ట్రాన్స్‌పోర్టు షెడ్లు, పార్కింగ్ ప్రాంతాల అభివృద్ధి, కమ్యూనిటీ ఆస్తుల అభివృద్ధికి అవకాశాలున్నాయని సీఎం సూచించారు. అలాగే నీటి భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు చేపట్టే పనులను కూడా ఈ పథకం కింద చేపట్టవచ్చని పేర్కొన్నారు.

అమరావతిలో 22 సంస్థలకు భూ కేటాయింపులు

- 7 కొత్త సంస్థలకు కేటాయింపులకు ఉపసంఘం ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో 22 సంస్థల భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం గురువారం సచివాలయంలో చర్చించింది. 7 కొత్త సంస్థలకు భూకేటాయింపులకు సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ, 11 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేశామని తెలిపారు. ఒక సంస్థకు భూకేటాయింపు అంశం పెండింగ్‌లో ఉందన్నారు. బ్యాంకుల సిబ్బంది నివాస స్థలం కోసం భూకేటాయింపునకు సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. భారత వాతావరణ శాఖకు ఎకరా భూమి, ఈటీపీఆర్‌కు 0.74 ఎకరాలు కేటాయించామన్నారు. కేవీబీకి 0.4 ఎకరాలు, నాబార్డ్‌కు ఎకరా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు అర ఎకరా, రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రికి 2 ఎకరాలు కేటాయించేందుకు సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది. ఇప్పటి వరకు భూములు పొందిన సంస్థల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయనే దానిపై చర్చించామని తెలిపారు. అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, దేశం మొత్తం అమరావతి నిర్మాణం వైపు చూస్తోందని నారాయణ పేర్కొన్నారు.

భారత ప్రభుత్వము
రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)

నోటిఫికేషన్

సికింద్రాబాద్, తేది :14.02.2026

ఆర్. సి. నెం.149/2024-F తేది: 19.02.2026

రైల్వే చట్టం, 1989 సెక్షన్ 20-ఎ లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను అమలు చేయు నిమిత్తం కేంద్ర ప్రభుత్వం వారు ప్రజా ప్రయోజనార్థం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని పల్నాడు జిల్లా "గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్" అను ప్రత్యేక ప్రాజెక్టు అమలు, నిర్వహణ, ఆపరేషన్ కోసం అవసరమైన భూమిని భూసేకరణ నిమిత్తం నోటిఫికేషన్ సారాంశం, ది.29.06.2025 న "ఈనాడు" (తెలుగు వెర్షన్) & ది హిందూ (ఆంగ్ల వెర్షన్)) పత్రికల్లో సమాచారం ప్రచురించబడింది.

నోటిఫికేషన్‌కి ప్రచురించిన తేదీ నుండి ఎటువంటి అభ్యంతరాలు వ్రాతపూర్వకముగా సమర్థ ప్రాధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, సత్తెనపల్లి వారికి వ్యక్తిగతముగా గానీ లేదా న్యాయవాదుల ద్వారా కానీ వ్యక్తం చేసి యుండలేదు.

కావున, రైల్వే చట్టం, 1989 సెక్షన్ 20-ఇ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని పల్నాడు జిల్లా "గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్" అను ప్రత్యేక ప్రాజెక్టు అమలు కొరకు ఈ దిగువ షెడ్యులు నందు పొందుపరిచిన భూములను భూ సేకరణ ద్వారా ప్రతిపాదించడమైనది.

సదరు చట్టం లోని సెక్షన్ 20-డి నందలి సబ్-సెక్షన్ (2) ప్రకారం సమర్థప్రాధికారి చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయం అవుతుంది.

ఈ నోటిఫికేషన్ క్రింద భూ సేకరణ చేయబడిన భూములకు సంబంధించిన ల్యాండు ప్లానులు మరియు ఇతర వివరములు పైన తెలుపబడిన సంబంధిత సమర్థ ప్రాధికారి వారి కార్యాలయములో అందుబాటులో వుంటాయి. మరియు ఆసక్తి కలవారు వాటిని తనిఖీ చేసుకోవచ్చు. భూ సేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు, మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్ ఉపాధి కల్పనా చట్టం, 2013 ప్రకారం అందించబడుతుంది.

షెడ్యూల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో గుంటూరు బిబినగర్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ పరిధిలో వచ్చే సత్తెనపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలోని భూముల (నిర్మాణాలు ఉన్నా లేకున్నా) సంక్షిప్త వివరాలు.

భూసేకరణ - గుంటూరు - బిబినగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్ - సత్తెనపల్లి డివిజన్

వ. సం	జిల్లా పేరు	మండలము పేరు	గ్రామము పేరు	సర్వే నెం.	భూమి రకము	భూమి స్వభావము	విస్తీర్ణము ఎకరములు	విస్తీర్ణము హెక్టార్లు	నిర్మాణములు/కట్టడములు	పట్టాదారుని పేరు
1	పల్నాడు	[illegible]	[illegible]	92-2	పట్టా భూమి	మెట్ట	0.220	0.08903	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
2				91/A-2	పట్టా భూమి	మెట్ట	0.120	0.04856	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
3				90/A-2	పట్టా భూమి	మెట్ట	0.300	0.12141	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
4				96/A-2	పట్టా భూమి	మెట్ట	0.200	0.08094	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
5				96/A-2	పట్టా భూమి	మెట్ట	0.400	0.16188	---	వడ్లమూడి దుర్గా ప్రసాద్ S/o రామ కోటయ్య
6				96/A-3	పట్టా భూమి	మెట్ట	0.170	0.06880	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
7				95/A	పట్టా భూమి	మెట్ట	0.090	0.03642	---	తుమ్మల ఉమా మహేశ్వరి W/o గోపాలరావు
8				97/A	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	---	వడ్లమూడి దుర్గా ప్రసాద్ S/o రామ కోటయ్య
9				87/A-2	పట్టా భూమి	మెట్ట	0.230	0.09308	---	పోసాని వెంకట రమణ S/o శివరామకృష్ణ
10				87/A-2	పట్టా భూమి	మెట్ట	0.210	0.08499	---	షేక్ అల్లాబకు (లేటు) S/o జాఫర్
11				87/A-2	పట్టా భూమి	మెట్ట	0.160	0.06475	---	ఈటెం కామయ్య(లేటు) S/o భద్రయ్య
12				87/A-2	పట్టా భూమి	మెట్ట	0.290	0.11736	---	కొల్లి శ్రీదేవి W/o వేణుగోపాలరావు
13				210/A-1B	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	---	కొమ్మూరి బాజమ్మ W/o నాగరాజు
14				210/A-1B	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	---	భూ యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
15				210/A-1B	పట్టా భూమి	మెట్ట	0.030	0.01214	ఇల్లు	పోపూరి కృష్ణ ప్రసాద్ S/o అర్జున రావు & పోపూరి శ్రీనివాసరావు S/o అర్జున రావు
16				210/A-1B	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	ఇల్లు	పోపూరి చంద్ర శేఖర్ రావు S/o బాల రవి
17				275/3-A2	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	---	చిమటా పద్మ W/o వెంకయ్య
18				269/A-1	పట్టా భూమి	మెట్ట	0.190	0.07689	---	పతేల్ల వెంకటేశ్వరరావు S/o సాంబశివరావు
19				269/A-1	పట్టా భూమి	మెట్ట	0.220	0.08903	---	కీసరి నారాయణ రెడ్డి S/o సత్యనారాయణరెడ్డి
20				269/A-1	పట్టా భూమి	మెట్ట	0.030	0.01214	---	నరెడ్ల భాను చంద్ర S/o భాస్కరరావు
21				264/A-2C2	పట్టా భూమి	మెట్ట	0.270	0.10927	---	డి.యం.వి.యస్.ప్రసాద్ S/o దేవిశెట్టి నాగేశ్వరరావు
				ఉప మొత్తం			3.250	1.31526		
22	పల్నాడు	[illegible]	[illegible]	598/B-1	ఇనాం భూమి	మెట్ట	0.485	0.19628	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు
23				598/B-1	ఇనాం భూమి	మెట్ట	0.125	0.05059	...	అద్దేపల్లి వెంకట లక్షమ్మ W/o.లక్ష్మీ నారాయణ
24				598/B-1	ఇనాం భూమి	మెట్ట	0.110	0.04452	...	కొటారు నాగేశ్వరమ్మ W/o.బ్రహ్మానందం
25				583/B-1A	సర్వీస్ ఇనాం భూమి	మెట్ట	0.160	0.06475	...	దంతం కోటేశ్వరమ్మ W/o.శ్రీనివాసరావు
26				584-1A	ఇనాం భూమి	మెట్ట	0.030	0.01214	...	రాయపాటి కోటేశ్వరమ్మ W/o.చిన్న నరసింహరావు
27				567/B-2A	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	అద్దేపల్లి అమరలింగేశ్వరరావు S/o.ఆంజనేయులు
28				559/B-1	దేవాదాయ భూమి	మెట్ట	0.110	0.04452	...	శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవస్థానము
29				566-1A	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	కొత్తూరి శివ ఫణి కుమార్ S/o.శివప్రసాదరావు
30				560-1	పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	...	పోపూరి కృష్ణయ్య S/o.రాఘవయ్య
31				560-1	పట్టా భూమి	మెట్ట	0.030	0.01214	...	బండారుపల్లి ఉత్తరయ్య S/o.వెంకటేశ్వర్లు
32				560-1	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	బండారుపల్లి వెంకటేశ్వర్లు S/o.వెంకటరావు
33				559-C1	దేవాదాయ భూమి	మెట్ట	0.030	0.01214	...	శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవస్థానము
34				503-1B1	పట్టా భూమి	మెట్ట	0.270	0.10927	...	భైరపు రాఘవేంద్రరావు S/o.తిరుపతిరావు
35				502-2B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	భైరపు తిరుపతిరావు S/o.రాఘవయ్య
36				502-2B	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	రాయపాటి పార్వతమ్మ W/o.వెంకట్రావు
37				505-2	పట్టా భూమి	మెట్ట	0.540	0.21854	...	నాదెండ్ల గణేష్ బాబు S/o.సాంబయ్య
38				509/B-1B	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	భైరపు తిరుపతిరావు S/o.రాఘవయ్య
39				509/B-2B	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	...	భైరపు తిరుపతిరావు S/o.రాఘవయ్య భూస్థితి వాగు
40				496-1	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	భైరపు తిరుపతిరావు S/o.రాఘవయ్య
41				496-1	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	భైరపు తిరుపతిరావు S/o.రాఘవయ్య భూస్థితి వాగు
42				495/B-1	పట్టా భూమి	మెట్ట	0.200	0.08094	...	కొరిటాల అంజలి W/o.శ్రీను
43				349-1	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	బత్తుల గంగమ్మ W/o.ఏడుకొండలు
44				348/B-1	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	వెంపటి మమత W/o.రవీంద్ర
45				348/B-1	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	చిమట వెంకట రత్తమ్మ W/o.చిన అప్పయ్య
46				348/B-1	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	అందె వెంకట ప్రసాద్ S/o.చిన వీరాంజనేయులు మరియు కుర్నేల్ల బాల వెంకట ఆంజనేయులు S/o.సూర్య ప్రభాకర్
47				347/B-1	పట్టా భూమి	మెట్ట	0.250	0.10117	...	బండారుపల్లి సీతారామయ్య S/o.మందయ్య
48				347/B-1	పట్టా భూమి	మెట్ట	0.380	0.15378	...	బండారుపల్లి వెంకటేశ్వర్లు S/o.మందయ్య
49				340-1A	పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	...	కాకుమాను వెంకట్రావమ్మ W/o.లీలా ప్రసాద్
50				75/B-1B	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	సోలార్ ప్యానల్లు, వ్యర్థ జల శుద్ధి కర్మాగారము, భద్రతా గృహము, కంచెలు.	రాయని స్పింటెక్స్ ప్రైవేట్ లిమిటెడ్
51				76/B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు
52				76/B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు-భూస్థితి డొంక
53				80-4B	పట్టా భూమి	మెట్ట	0.060	0.02428	...	చెరుకూరి సత్యవతి W/o.వెంకట్రావు
54				79-1	పట్టా భూమి	మెట్ట	0.450	0.18211	...	కూరపాటి లీలావతి W/o.సురేష్
55				77/B-1	పట్టా భూమి	మెట్ట	0.190	0.07689	...	నలబోతు వెంకట్రావు S/o.వెంకటేశ్వర్లు (మరణించారు)
56				105/2B-1	పట్టా భూమి	మెట్ట	0.460	0.18616	...	దానబోయిన రాంబాబు S/o.కృష్ణమూర్తి
57				105/1B-1	పట్టా భూమి	మెట్ట	0.275	0.11129	...	దానబోయిన రాంబాబు S/o.కృష్ణమూర్తి
58				105/1B-1	పట్టా భూమి	మెట్ట	0.115	0.04654	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు
59				105/1B-1	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	...	దొడ్లా డైరీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి
60				105/B-1	పట్టా భూమి	మెట్ట	0.790	0.31971	...	దొడ్లా డైరీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి
61				105/B-1	పట్టా భూమి	మెట్ట	0.100	0.04047	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు
62				103/B-1	పట్టా భూమి	మెట్ట	0.650	0.26305	...	దొడ్లా డైరీ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి
63				121/B-1	పట్టా భూమి	మెట్ట	0.310	0.12546	...	భూ యాజమాన్య హక్కు నిర్ధారించబడియుండలేదు
64				123/B-1A	పట్టా భూమి	మెట్ట	0.220	0.08903	...	శిరసాల ఫణీంద్ర S/o.భుజంగరావు
65				123/B-1A	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	గుద్దే భీష్మ S/o.హనుమంతరావు
				ఉప మొత్తం			7.940	3.21327		
66	పల్నాడు	[illegible]	[illegible]	116/A-2	పట్టా భూమి	మెట్ట	0.01500	0.00607	...	గొట్టిపాటి సత్యనారాయణ తండ్రి వీరయ్య
67					పట్టా భూమి	మెట్ట	0.02000	0.00809	...	వజ్రాల లక్ష్మి కుమారి భర్త అంజిరెడ్డి
68					పట్టా భూమి	మెట్ట	0.00500	0.00202	...	ఆరేకూటి ఏసునాధరెడ్డి తండ్రి గోపిరెడ్డి
69				117/A-2B	పట్టా భూమి	మెట్ట	0.01000	0.00405	...	జాస్తి శంకరరావు తండ్రి అప్పయ్య
				ఉప మొత్తం			0.050	0.02023		
70	పల్నాడు	[illegible]	[illegible]	31/A-2B	పట్టా భూమి	మెట్ట	0.046	0.01862	---	యర్రంసేని సరోజినీ భర్త చుండు తిరుపతిరావు
71				31/A-2B	పట్టా భూమి	మెట్ట	0.092	0.03723	---	నూకవరపు శ్రీనివాసరావు తండ్రి ఆదెయ్య
72				32/A-2	పట్టా భూమి	మెట్ట	0.051	0.02064	---	ఆరాధ్యుల పద్మ భర్త వెంకటేశ్వరరావు
73				115/A-1B	పట్టా భూమి	మెట్ట	0.099	0.04006	---	దామచర్ల రమ్య తండ్రి రాజేంద్రప్రసాద్
				ఉప మొత్తం			0.288	0.11655		
74	పల్నాడు	[illegible]	[illegible]	152-2B	పట్టా భూమి	మెట్ట	0.100	0.04047	...	కంటు తిరుమల శ్రీనివాసరావు S/o.గోవింద్
75				153-C2	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	షేక్ మస్తాన్ బి W/o.అబ్దుల్ ఖాశీం
76				162/A-1B	పట్టా భూమి	మెట్ట	0.190	0.07689	...	కంటు వెంకటేశ్వరరావు S/o.గోవింద్
77				162/A-1B	పట్టా భూమి	మెట్ట	0.280	0.11331	...	షేక్ మహాబ్బి W/o.అబ్దుల్ సలాం
78				161/A-1B	పట్టా భూమి	మెట్ట	0.240	0.09713	...	కంటు వెంకటేశ్వరరావు S/o.గోవింద్
79				160/A-2B	పట్టా భూమి	మెట్ట	0.005	0.00202	...	పచ్చా శ్రీరాములు S/o.వెంకటేశ్వర్లు
80				160/A-2B	పట్టా భూమి	మెట్ట	0.260	0.10522	...	షేక్ ఖాశీం బి W/o.సయ్యద్ సుభాని
81				160/A-2B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	షేక్ ఖాశీం బి W/o.సయ్యద్ సుభాని
82				160/A-2B	పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	...	షేక్ రంజాన్ బి, షేక్ జమీలా, షేక్ బషీర్, షేక్ బుడే
83				155/A-5B	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	కొటారు అలివేలు మంగమ్మ W/o. నరసింహారావు
84				157-2	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	శిరసాని లక్ష్మణరావు S/o వెంకటేశ్వర్లు & బూదవరపు చిన వెంకట సుబ్బయ్య (లేటు) S/o.వెంకటేశం
85				158/A-2	పట్టా భూమి	మెట్ట	0.170	0.06880	...	శిరసాని లక్ష్మణరావు S/o వెంకటేశ్వర్లు & బూదవరపు వెంకట సుబ్బయ్య (లేటు) S/o.వెంకటేశం
86				222/A-2	పట్టా భూమి	మెట్ట	0.220	0.08903	బావి	బత్తుల అనిత W/o.వెంకట రమణ
87				223/A-3B	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	బత్తుల అనిత W/o.వెంకట రమణ
88				226/A-1B	పట్టా భూమి	మెట్ట	0.030	0.01214	...	కటిక ధనలక్ష్మి W/o.సుబ్బారావు
89				232/A-1	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	తులువ హైమావతి W/o.శేషయ్య
90				249/B-1B	పట్టా భూమి	మెట్ట	0.080	0.03238	...	మాదంశెట్టి శ్రీనివాస ప్రసాద్ S/o.వెంకటేశ్వర్లు
91				249/B-1B	పట్టా భూమి	మెట్ట	0.080	0.03238	...	మాదంశెట్టి కోటేశ్వరరావు S/o. వెంకటేశ్వర్లు
92				249/B-1B	పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	...	బాగిరెడ్డి వెంకాయమ్మ W/o. వెంకటేశ్వర్లు
				ఉప మొత్తం			2.065	0.83569		
93	పల్నాడు	[illegible]	[illegible] H/O [illegible]	173/B	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	భూ- యాజమాన్య హక్కు నిర్ధారణ కాలేదు
94				176/B-1	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	అనిశెట్టి రమాదేవి W/O శ్రీనివాసరావు
95				225/A-2A1	పట్టా భూమి	మెట్ట	0.080	0.03238	... ...	(1) శిఖా గోపి S/O ఇన్నయ (2)గుడిసె శివ నాగి రెడ్డి S/O పుల్లా రెడ్డి (3) కన్నెధారి బాల చౌదరి S/O హనుమయ్య
96				225/A-2A3	పట్టా భూమి	మెట్ట	0.750	0.30352	... ...	(1) శిఖా గోపి S/O ఇన్నయ (2)గుడిసె శివ నాగి రెడ్డి S/O పుల్లా రెడ్డి (3) కన్నెధారి బాల చౌదరి S/O హనుమయ్య
				ఉప మొత్తం			0.880	0.35613		
97	పల్నాడు	[illegible]	[illegible]	307/A-3C2	పట్టా భూమి	మెట్ట	0.310	0.12546	...	బొలిసేని స్వరాజ్యలక్ష్మి W/o పూర్ణ చంద్రరావు
98				309/A-1C2	పట్టా భూమి	మెట్ట	0.290	0.11736	...	బొలిసేని స్వరాజ్యలక్ష్మి W/o పూర్ణ చంద్రరావు
99					పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
100				308-2A1	పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	మేదరమెట్ల బాలయ్య S/o ఆనందయ్య
101				310/A-3A2	పట్టా భూమి	మెట్ట	0.160	0.06475	...	మేదరమెట్ల ప్రేమచంద్ S/o శివ లింగ ప్రసాద్
102				319/A-1A2	పట్టా భూమి	మెట్ట	0.140	0.05666	...	గంగిసేని అనంతమ్మ W/o వెంకటేశ్వర్లు
103				322/B-5B	పట్టా భూమి	మెట్ట	0.120	0.04856	...	SK.కరీమున్నీసాబేగం W/o ఖాసిం అల్లి
104					పట్టా భూమి	మెట్ట	0.040	0.01619	...	SK. మస్తాన్‌వలి S/o చిన్న ఖాసిం పీరా
105					పట్టా భూమి	మెట్ట	0.02	0.00809	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
106				324/B-2B	పట్టా భూమి	మెట్ట	0.3	0.12141	...	ఆలోకం శిల్ప W/o సుధాకర్ బాబు
107					పట్టా భూమి	మెట్ట	0.27	0.10927	...	షేక్. నగీన w/o మహమ్మద్ షరీఫ్
108				323-C1A	పట్టా భూమి	మెట్ట	0.21	0.08499	...	కట్టబోయిన పుల్లారావు S/o పుల్లయ్య
109				330/B-2A	దేవదాయ భూమి	మెట్ట	2.68	1.08458	...	శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం
110				333/B-1B	పట్టా భూమి	మెట్ట	0.78	0.31566	...	తుల్లిమిల్లి రామకృష్ణ S/o సాంబశివ రావు
111					పట్టా భూమి	మెట్ట	0.57	0.23068	...	షేక్. కరీముల్లా S/O చిన్న జాను
112					పట్టా భూమి	మెట్ట	0.65	0.26305	...	షేక్ ఆదమ్ షఫీ S/O పెద జాన్
113					పట్టా భూమి	మెట్ట	0.13	0.05261	...	షేక్.అబ్దుల్ రావూఫ్ S/O రషీద్
114				409/B-2A	పట్టా భూమి	మెట్ట	0.28	0.11331	...	బొబ్బిళ్ల సందీప్S/o సాంబశివ రావు
115					పట్టా భూమి	మెట్ట	0.01	0.00405	...	పిల్లి ప్రభాకర్ S/o నాగభూషణం
116				893/B-1B1	పట్టా భూమి	మెట్ట	0.22	0.08903	...	అత్తిపట్ల వీరాంజనేయులు S/o కోటేశ్వరరావు
117				894/B-1	పట్టా భూమి	మెట్ట	0.38	0.15378	...	అత్తిపట్ల వీరాంజనేయులు S/o కోటేశ్వరరావు
118				896/A-3B	పట్టా భూమి	మెట్ట	0.07	0.02833	...	బొబ్బిళ్ల విజయ లక్ష్మి w/o కోటేశ్వరరావు
119				897/A-3B	పట్టా భూమి	మెట్ట	0.02	0.00809	...	చుండు శ్రీనివాసరావు S/o వెంకటేశ్వర్లు
120				397/A-2	పట్టా భూమి	మెట్ట	0.09	0.03642	...	చుండు శ్రీనివాసరావు S/o వెంకటేశ్వర్లు
121				395/A-1C2	పట్టా భూమి	మెట్ట	0.04	0.01619	...	బాలిసేని రామయ్య s/o అయ్యవరయ్య
122				395/A-1C2	పట్టా భూమి	మెట్ట	0.24	0.09713	...	భూ యా జమాన్య హక్కులు నిర్ధారించబడలేదు
123				958/4A-3B	పట్టా భూమి	మెట్ట	0.01	0.00405	...	భూ యా జమాన్య హక్కులు నిర్ధారించబడలేదు
124				958/5A-2	పట్టా భూమి	మెట్ట	0.09	0.03642	...	మువ్వ పిచ్చయ్య S/o పుల్లయ్య
125				958/6A-3B	పట్టా భూమి	మెట్ట	0.18	0.07285	...	మువ్వ పిచ్చయ్య S/o పుల్లయ్య
126				392/A-2	పట్టా భూమి	మెట్ట	0.06	0.02428	...	కొల్లా వెంకటేశ్వర్లు s/o శివ రామ కృష్ణయ్య
127				958/12A-1B	పట్టా భూమి	మెట్ట	0.38	0.15378	...	మన్నవ సుందరి W/o శ్రీనివాసరావు
128				958/13A-2	పట్టా భూమి	మెట్ట	0.06	0.02428	...	పాశం వెంకట రామ కృష్ణ S/o వీరయ్య
129				958/14A-2/A2	పట్టా భూమి	మెట్ట	0.090	0.03642	...	మందడపు హిమ బిందు w/o కోటేశ్వరరావు
130				958/14A-2/C2	పట్టా భూమి	మెట్ట	0.100	0.04047	...	మందడపు సాంబశివరావు s/o వెంకటరావు ,
				ఉప మొత్తం			9.040	3.65836		
131	పల్నాడు	[illegible]	[illegible]	87/A-3B	పట్టా భూమి	మెట్ట	0.13	0.05261	...	నూతక్కి శ్రీదర్ రావు S/O పెదబసవయ్య
132				93/A-1B	పట్టా భూమి	మెట్ట	0.13	0.05261	...	యెండ్లూరి మాధవి W/O నాగేశ్వరరావు
133				94/A-1B	పట్టా భూమి	మెట్ట	0.005	0.00202	...	యెండ్లూరి మాధవి W/O నాగేశ్వరరావు
134					పట్టా భూమి	మెట్ట	0.18	0.07285	...	యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
135					పట్టా భూమి	మెట్ట	0.14	0.05666	...	వడ్లముడి రాజ్య లక్ష్మి w/o వేంకటేశ్వరరావు
136				95/B-2	పట్టా భూమి	మెట్ట	0.22	0.08903	వేప చెట్లు-02 & కుంట	యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
137				98/A-1B	పట్టా భూమి	మెట్ట	0.16	0.06475	_	బోడపాటి నాగేశ్వరరావు S/O వెంకటరావు
138				97/B-2	పట్టా భూమి	మెట్ట	0.06	0.02428	వేప చెట్లు-01	బోడపాటి నాగేశ్వరరావు S/O వెంకటరావు
139				34/B-1A2	పట్టా భూమి	మెట్ట	0.11	0.04452	...	యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
140				31/B-1A2	పట్టా భూమి	మెట్ట	0.07	0.02833	...	యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
141				29/B-1A1A2	పట్టా భూమి	మెట్ట	0.26	0.10522	...	యాజమాన్య హక్కులు నిర్ధారణ కాలేదు
142				29/B-1C1B	పట్టా భూమి	మెట్ట	0.03	0.01214	...	యలమంచిలి బంగారయ్య S/O వెంకటప్పయ్య
143				209/A-2	పట్టా భూమి	మెట్ట	0.57	0.23068	కుంట	గంగవరపు ఆదినారాయణ S/O బాలయ్య
144				348/A-1B	పట్టా భూమి	మెట్ట	0.32	0.12950	...	మేదరమెట్ల మధుసూధన్ రావు S/O బాబూరావు
145					పట్టా భూమి	మెట్ట	1.17	0.47349	...	మేదరమెట్ల దయాకర్ S/O బాబూరావు
146				347/A	పట్టా భూమి	మెట్ట	0.23	0.09308	...	మేదరమెట్ల దయాకర్ S/O బాబూరావు
				ఉప మొత్తం			3.785	1.53177		
147	పల్నాడు	[illegible]	[illegible]	51-2B	పట్టా భూమి	మెట్ట	0.150	0.06070	...	నంబూరి అంకారావు తండ్రి అయ్యన్న
148					పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	నూతక్కి శ్రీనివాసరావు తండ్రి చిన్న బసవయ్య
						TOTAL	0.280	0.11331		
149	పల్నాడు జిల్లా	[illegible]	[illegible]	15/B-1A	పట్టా భూమి	మెట్ట	0.060	0.02428	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
150				15/B-1A	పట్టా భూమి	మెట్ట	0.290	0.11736	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
151				14/B-1A	పట్టా భూమి	మెట్ట	0.110	0.04452	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
152				14/B-3A	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	వెదురు బొంగు చెట్టు-1	తిరువీధుల రామకృష్ణ S/O హనుమయ్య
153				14/B-3A	పట్టా భూమి	మెట్ట	0.200	0.08094	...	దత్తలూరి షేక్ రంజాన్‌బి W/O బుడే (ఉరఫ్) సైదా
154				8/B-1A	పట్టా భూమి	మెట్ట	0.230	0.09308	వేప చెట్లు -2	తిరువీధుల రామకృష్ణ S/O హనుమయ్య
155				8/B-1A	పట్టా భూమి	మెట్ట	0.500	0.20235	...	గుండ్లపల్లి గిరిజ W/O రామ చంద్ర శేఖర్
156				7/B-1	పట్టా భూమి	మెట్ట	0.480	0.19425	...	గుండ్లపల్లి గిరిజ W/O రామ చంద్ర శేఖర్
157				7/B-1	పట్టా భూమి	మెట్ట	0.410	0.16592	వేప చెట్లు -3	సయ్యద్ బాజీ (అలియాస్) పీసపాటి సయ్యద్ బాజీ S/O మొహిద్దీన్
158				3/B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	వేప చెట్టు -1	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
159				32-B1	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	సయ్యద్ బాజీ (అలియాస్) పీసపాటి సయ్యద్ బాజీ S/O మొహిద్దీన్
160				47-1	పట్టా భూమి	మెట్ట	0.200	0.08094	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
161				48/B	పట్టా భూమి	మెట్ట	0.140	0.05666	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
162				59/B	ఇనాం భూమి	మెట్ట	0.790	0.31971	RCC చర్చి	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
163				60/B-1	ఇనాం భూమి	మెట్ట	0.360	0.14569	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు

(మిగతా 13వ పేజీలో)

డీవైఈవోల ఎంపికకు బ్రేక్?

▸▸ మహిళా రిజర్వేషన్ అంశంపై స్టేటస్ కో విధించిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):ఏపీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ పోస్టుల ఫలితాలకు బ్రేక్ పడే అవకాశం కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ అంశంపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం రెండు వారాలపాటు స్టేటస్‌కో విధించింది. దీంతో ఫలితాలు ప్రకటించినా తుది ఎంపికపై ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. 38 పోస్టులకు 38 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తూ ఏపీపీఎస్సీ ఇటీవల ఫలితాలను వెలువరించింది. వారికి ఈనెల 24న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లు పరిశీలించి ఉద్యోగాలకు ఎంపిక చేయాల్సి ఉంది. కాగా, 38 పోస్టుల్లో 16 మంది మహిళలను ఎంపిక చేశారని, ఇది మహిళా కోటాను దాటిపోయిందని కొందరు కోర్టుకు వెళ్లారు. వారి వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు తాత్కాలికంగా స్టేటస్‌కో విధించింది.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామ రాజు గురువారం నోటిఫికేషన్ జారీచేశారు. ఏప్రిల్ 12న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మోడల్ స్కూళ్లు ఉన్న మండలాల్లోనే ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు 2014 సెప్టెంబరు 1 - 2016 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు 1 - 2016 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. సంబంధిత జిల్లాల్లో వరుసగా 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి, 2025-26లో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ పొంది ఉండాలని స్పష్టంచేశారు.

మధ్యాహ్న భోజన పథకంపై ఐఐసీతో ఒప్పందం

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలుచేసేందుకు పాఠశాల విద్యాశాఖ అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ కార్ప్స్(ఐఐసీ)తో ఒప్పందం చేసుకుంది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో గురువారం సచివాలయంలో ఈ ఒప్పందం జరిగింది. మధ్యాహ్న భోజన విభాగం డైరెక్టర్ బి.శ్రీనివాస రావు, ఐఐసీ ప్రతినిధులు రిషిక మోడీ, శ్రద్ధా శ్రీవాస్తవ, తుషార్ మల్హోత్రా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ ద్వారా సాంకేతికతను మరింత మెరుగ్గా ఈ పథకంలో అమలుచేస్తారు. భోజనం తినే విద్యార్థుల సంఖ్య అంచనాలో కచ్చితత్వం తీసుకొస్తారు. అలాగే పోషకాహార ప్రమాణాలను ఆ కంపెనీ పర్యవేక్షిస్తుంది.

సమస్యలపై దశలవారీ పోరాటం: ఏపీటీఎఫ్

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ఏపీటీఎఫ్ నిర్ణయించింది. గురువారం నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పిస్తామని, మార్చి 3న జిల్లా కేంద్రాల్లో మహా ధర్నాలు చేస్తామని తెలిపారు. సీఎస్ కె.విజయానంద్‌కు నోటీసు అందించామన్నారు. 12వ పీఆర్సీని నియమించాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాల బకాయిలు చెల్లించాలని, టీచర్లకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుచేయాలని తదితర డిమాండ్లతో ఈ ఆందోళనలను చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి వివరించారు.

72 వైద్యుల పోస్టులకు 2430 దరఖాస్తులు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖలో వైద్యుల పోస్టుల భర్తీ త్వరలో జరగనుందని, ఆయుర్వేద, యునాని, హోమియో కేటగిరిలో కాంట్రాక్టు పద్ధతిన 72 పోస్టుల భర్తీకి సిద్ధం అయినట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు భారీగా స్పందన వచ్చిందని, 2,430 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీటితోపాలు 286 పారా మెడికల్, ఇతర పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. ఆయుర్వేద డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ గురించి సీఎం చంద్రబాబుకు వివరించగా ఆయన పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపారన్నారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామక నోటిఫికేషన్ జారీ చేయగా 2,430 మంది వైద్యులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆయుర్వేద విభాగంలో 1,086 మంది, హోమియో విభాగంలో 1,219 మంది, యునాని విభాగంలో 125 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. వీరందరికి మెరిట్ ఆధారంగా పోస్టింగ్స్ ఇస్తామన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

▸▸ ప్రజా సమస్యలపై పోరుబాట: ఈశ్వరయ్య

అమరావతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మార్చి 24వ తేదీ లోపు ప్రభుత్వం సానుకూల ప్రకటన రాకపోతే.. ఆ మర్నాడే లక్షలాది మంది నిరుపేదలతో అన్ని జిల్లాల్లో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గురువారం విజయవాడలోని దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడారు.

(12వ పేజీ తరువాయి)

164				60/B-1	ఇనాం భూమి	మెట్ట	0.360	0.14569	డాబాఇల్లు	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
165					ఇనాం భూమి	మెట్ట			...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
166					ఇనాం భూమి	మెట్ట			...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
167					ఇనాం భూమి	మెట్ట			...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
168					ఇనాం భూమి	మెట్ట			చింత చెట్టు-1	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
169				60/B-2A	ప్రభుత్వ భూమి	అసైన్మెంట్(LA)	0.340	0.13760	వేప చెట్టు -1	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
170					ప్రభుత్వ భూమి	అసైన్మెంట్(LA)			డాబాఇల్లు ,వేప చెట్టు -1	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
171					ప్రభుత్వ భూమి	అసైన్మెంట్(LA)			డాబాఇల్లు	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
172				61/B-2A	ఇనాం భూమి	మెట్ట	0.610	0.24686	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
173				70-1	ఇనాం భూమి	మెట్ట	0.050	0.02023	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
174				74/B-1	ఇనాం భూమి(వక్ఫ్ ల్యాండ్)	మెట్ట	0.700	0.28329	...	వక్ఫ్ ల్యాండ్
175				75-1	పట్టా భూమి	మెట్ట	0.190	0.07689	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
176				78/B	సర్వీస్ ఇనాం భూమి	మెట్ట	0.040	0.01619	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
177				86-A	పట్టా భూమి	మెట్ట	0.230	0.09308	తాటి చెట్లు -2	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
178				92/B-1	పట్టా భూమి	మెట్ట	0.315	0.12748	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
179				92/B-1	పట్టా భూమి	మెట్ట	0.645	0.26103	...	సయ్యద్ చిన్న సుభానీ S/O గాలిబ్ సాహెబ్
180				92/B-1	పట్టా భూమి	మెట్ట	0.030	0.01214	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
181				93/B-1A	పట్టా భూమి	మెట్ట	0.385	0.15581	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
182				93/B-1A	పట్టా భూమి	మెట్ట	0.085	0.03440	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
183				93/B-1A	పట్టా భూమి	మెట్ట	0.410	0.16592	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
184				99/B-1A	పట్టా భూమి	మెట్ట	0.620	0.25091	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
185				99/B-1A	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
186				99/B-1A	పట్టా భూమి	మెట్ట	0.530	0.21449	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
187				100/B-1	ఇనాంభూమి	మెట్ట	0.100	0.04047	...	షేక్ మస్తాన్ వలి S/O మౌలాలి
188					ఇనాంభూమి	మెట్ట	0.100	0.04047	...	ఉప్పలపాటి సుభానీ S/O ఆదమ్ సాహెబ్
189					ఇనాంభూమి	మెట్ట	0.075	0.03035	...	కొజ్జ లక్ష్మి రాజ్యం W/O కృష్ణ
190					ఇనాంభూమి	మెట్ట	0.075	0.03035	...	గుమ్మా డేవిడ్ రాజు S/O వలిరాజు
191					ఇనాంభూమి	మెట్ట	0.090	0.03642	వేప చెట్లు -2	షేక్ పమిడిపాటి సుభానీ S/O అల్లమ్మ సాహెబ్
192					ఇనాంభూమి	మెట్ట	0.070	0.02833	వేప చెట్లు -2	షేక్ నిమ్మకాయల ఖాజావలి S/O ఖాసిం
193					ఇనాంభూమి	మెట్ట	0.090	0.03642	వేప చెట్లు -3	నిమ్మకాయల గౌసియా పర్వీన్ W/O జానీ బాషా
194				104/B-1A	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	షేక్ మహబుల్లా W/o జానీ బాష
195				104/B-1A	పట్టా భూమి	మెట్ట	0.100	0.04047	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
196				104/B-1A	పట్టా భూమి	మెట్ట	0.080	0.03238	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
	ఉప మొత్తం						10.070	4.07527		
197	పల్నాడు	రాజుపాలెం	[illegible]	41-1A1	దేవాదాయ భూమి	మెట్ట	0.130	0.05261	...	శ్రీ బాలాత్రిపురసుందరీ పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి
198				132-1A	పట్టా భూమి	మెట్ట	0.130	0.05261	...	తిప్పిరెడ్డి శ్రీనివాస రెడ్డి S/O కిచ్చా రెడ్డి
199				133-1A	పట్టా భూమి	మెట్ట	0.350	0.14164	...	అడపా గోపిరెడ్డి S/O పరమేశ్వర రెడ్డి
200					పట్టా భూమి	మెట్ట	0.240	0.09713	...	బెల్లంకొండ నరసమ్మ W/O పూర్ణయ్య
201				117-1B	పట్టా భూమి	మెట్ట	0.280	0.11331	టేకు చెట్లు-1, కొబ్బరి చెట్లు-1, రేగి చెట్లు-17, మామిడి మొక్కలు -13, మామిడి చెట్లు-6, ఎర్ర చందనం చెట్లు-7, వేప చెట్లు-1, బావి-1	వల్లాల బ్రహ్మయ్య S/o బాల గుంటయ్య
202					పట్టా భూమి	మెట్ట	0.160	0.06475		
203					పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	ఓర్చు అంకమ్మ రావు S/O వెంకటేశ్వర్లు
204					పట్టా భూమి	మెట్ట	0.029	0.01174	రేకుల ఇల్లు -1, మామిడి చెట్లు-1	గోసుల భూలక్ష్మి W/O వీరాంజనేయులు
205					పట్టా భూమి	మెట్ట	0.022	0.00890	...	తిరుమల వెంకటరావు S/O ఏడుకొండలు
206					పట్టా భూమి	మెట్ట	0.029	0.01174	...	ముక్కు లక్ష్మి W/O వెంకటరెడ్డి
207					పట్టా భూమి	మెట్ట	0.031	0.01255	రేకుల ఇల్లు -1, ప్రహరీ గోడ -1	కుందురు పిచ్చమ్మ W/O శ్రీనివాసరావు చారి
208					పట్టా భూమి	మెట్ట	0.022	0.00890	వేప చెట్లు-1, దూరేసమ్మ చెట్టు -1	వల్లాల ఆంజనేయులు S/O కోటయ్య
209					పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	పులిగొర్ల సుబ్రహ్మణ్యం S/O సాంబయ్య
210					పట్టా భూమి	మెట్ట	0.007	0.00283	...	తోకల లక్ష్మణరావు తండ్రి రాంబాబు
211					పట్టా భూమి	మెట్ట	0.019	0.00769	రేకుల ఇల్లు -1	తోకల సాంబయ్య S/O పిచ్చయ్య
212					పట్టా భూమి	మెట్ట	0.031	0.01255	...	పర్చూరి పూర్ణచంద్రరావు S/O వెంకట నారాయణ
213				116-1B	పట్టా భూమి	మెట్ట	0.075	0.03035	...	వల్లాల భూలక్ష్మి W/O వెంకటరావు
214					పట్టా భూమి	మెట్ట	0.025	0.01012	...	వల్లాల తిరుపతిరావు S/O తిరుపతయ్య
215				116-3B	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	...	తోకల బ్రహ్మనాయుడు S/O సాంబయ్య
216				85-1B	దేవాదాయ భూమి	మెట్ట	0.160	0.06475	...	శ్రీ కోదండ రామ స్వామి
217					పట్టా భూమి	మెట్ట	0.205	0.08296	మామిడి మొక్కలు -10	తోకల కొండలరావు S/o పెద పిచ్చయ్య
218					పట్టా భూమి	మెట్ట	0.015	0.00607	...	బయ్యా వరలక్ష్మి W/o హనుమంత రావు
219					పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	మామిడి మొక్కలు -4, చింతచెట్టు -1, బావి-1	తోకల రమణ W/o కొండలరావు
220				85-3B2	ప్రభుత్వ భూమి	అసైన్మెంట్ భూమి (NPI ఇండ	0.007	0.00283	...	నాగిపోగు లక్ష్మీదేవి W/O నానిబాబు
221				85-3B3	ప్రభుత్వ భూమి	అసైన్మెంట్ భూమి (NPI ఇండ్ల స్థలాలు	0.007	0.00283	...	పట్టెం బాలమ్మ W/O సామ్ సన్
222					ప్రభుత్వ భూమి	అసైన్మెంట్ భూమి (NPI ఇండ్ల స్థలాలు	0.008	0.00324	...	ఓర్చు రమాదేవి W/O అంకమ్మ రావు
223				85-3B4	ప్రభుత్వ భూమి	అసైన్మెంట్ భూమి (NPI ఇండ్ల స్థలాలు	0.008	0.00324	...	బొమ్మనబోయిన వెంకట రమణ W/O ఆంజనేయులు
224				85-4B2	పట్టా భూమి	మెట్ట	0.060	0.02428	...	వల్లాల గరటమ్మ W/O బ్రహ్మయ్య
225				87-2	పట్టా భూమి	మెట్ట	0.010	0.00500	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
	ఉప మొత్తం						2.200	0.89128		
226	పల్నాడు	రాజుపాలెం	[illegible]	31/A-2B	పట్టా భూమి	మెట్ట	0.110	0.04452	...	వడిత మసూర W/O చంద్ర నాయక్
227				64/B-1A	సర్వీస్ ఇనాం భూమి	మెట్ట	0.140	0.05666	...	శ్రీగిరిరాజు వెంకట రమణయ్య S/o సీతారామయ్య
228				64/B-1A	సర్వీస్ ఇనాం భూమి	మెట్ట	0.100	0.04047	...	శ్రీగిరిరాజు అనసూర్యమ్మ W/o శ్రీమన్నారాయణ
229				35/A-2	ఇనాం భూమి	మెట్ట	0.200	0.08094	...	కొమెర రోజ్ బాబు S/O యేసయ్య
230				35/A-2	ఇనాం భూమి	మెట్ట	0.330	0.13355	...	రాయ సాంబశివా రెడ్డి S/O పెద్ద వెంకటేశ్వర రెడ్డి
231				35/A-2	ఇనాం భూమి	మెట్ట	0.070	0.02833	...	రాయ మల్లికార్జున రెడ్డి S/O వెంకటేశ్వరరెడ్డి
232				35/A-2	ఇనాం భూమి	మెట్ట	0.080	0.03238	...	బండి వెంకటరెడ్డి S/O శివరామ క్రిష్ణా రెడ్డి
233				35/A-2	ఇనాం భూమి	మెట్ట	0.050	0.02023	...	బస్వల నరసింహారావు S/O శ్రీరాములు
234				35/B-1A1	ఇనాం భూమి	మెట్ట	0.250	0.10117	...	కేసరి పుష్పావతి W/O లక్ష్మిరెడ్డి
235				36/A-2B	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	బండి వెంకటరెడ్డి S/O శివరామ క్రిష్ణా రెడ్డి
236				36/A-2B	పట్టా భూమి	మెట్ట	0.230	0.09308	...	బస్వల ఆదినారాయణ S/O శ్రీరాములు
237				36/A-2B	పట్టా భూమి	మెట్ట	0.050	0.02023	...	బస్వల నరసింహారావు S/O శ్రీరాములు
238				36/B-1A	పట్టా భూమి	మెట్ట	0.400	0.16188	...	భూ యాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
239				37/A-1B	పట్టా భూమి	మెట్ట	0.060	0.02428	...	రాయ శ్రీనివాస రెడ్డి S/O చిన వెంకటేశ్వరరెడ్డి
240				37/A-1B	పట్టా భూమి	మెట్ట	0.090	0.03642	...	రాయ శ్రావణి W/O చంద్రశేఖర రెడ్డి
241				37/A-1B	పట్టా భూమి	మెట్ట	0.070	0.02833	...	కొమెర రోజ్ బాబు S/O యేసయ్య
242				37/B	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	భూ యాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
243				61/B-1A	పట్టా భూమి	మెట్ట	0.160	0.06475	...	బండి చిన్నప్పరెడ్డి S/O బ్రహ్మారెడ్డి
244				63/B-1A	పట్టా భూమి	మెట్ట	0.285	0.11534	...	కేసరి లక్ష్మీ రెడ్డి S/o మాలాకొండ రెడ్డి
245				63/B-1A	పట్టా భూమి	మెట్ట	0.005	0.00202	...	దొండేటి పద్మావతి W/o రమణా రెడ్డి
	ఉప మొత్తం						2.710	1.09672		
246	పల్నాడు	రాజుపాలెం	రాజుపాలెం	54/B-1	పట్టా భూమి	మెట్ట	0.120	0.04856	టేకు చెట్లు-3 , వేపచెట్లు -3, రేకుల షెడ్-2	స్పైసెస్ ఇండస్ట్రీస్ (సి ప్రణుతి & సి ప్రభాకర రావు)
247				56/B-1A1	పట్టా భూమి	మెట్ట	0.160	0.06475	టేకు చెట్లు-18 , వేపచెట్లు -16	బొందలపాటి శివరావు S/O తాతయ్య
248					పట్టా భూమి	మెట్ట	0.250	0.10117		గుత్తా సతీష్ S/O రాఘవేంద్రరావు
249				166/B-1A1	పట్టా భూమి	మెట్ట	0.065	0.02631	...	వడ్లమూడి శ్రీలత W/O శ్రీనివాస్
250				167/B-1A1	పట్టా భూమి	మెట్ట	0.145	0.05868	బోరు-1, రేకుల కప్పు ఉన్న కోళ్ళ ఫారం	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
251				213-1A1A	పట్టా భూమి	మెట్ట	0.140	0.05666	బోర్-2, రేకుల కప్పు ఉన్న కోళ్ల ఫారం, గ్యాస్ గూడెం, టేకు చెట్లు-2, బాదం చెట్లు-2, వేపచెట్లు-2	దుడుకు హనుమంతురావు S/O వెంకటేశ్వర్లు
252							0.009	0.00364	బోరు-1	పండితి పిచ్చిరెడ్డి S/o రమణ రెడ్డి
253				213-1A1A	పట్టా భూమి	మెట్ట	0.006	0.00243	...	పులిబండ్ల పూర్ణ W/O సాంబశివరావు
254							0.007	0.00283	...	ములకా నాగజ్యోతి W/O శివశంకర్
255							0.010	0.00405	...	ఓర్చు రత్నకుమారి W/O శ్రీనివాసరావు
256							0.008	0.00324	బోరు-1, రేకుల కప్పుతో ఉన్న గేదెల ఫారం	ఆకుల రాఘవరావు S/O కోటేశ్వరావు
257				210/B-1A	పట్టా భూమి	మెట్ట	0.020	0.00809	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
258				207/B-1A	పట్టా భూమి	మెట్ట	0.280	0.11330	డాబా ఇల్లు	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
259				207/A-2	పట్టా భూమి	మెట్ట	0.010	0.00405	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు & భూస్థితి వాగు
260				210/A-1B	పట్టా భూమి	మెట్ట	0.080	0.03238	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు & భూస్థితి వాగు
261				211/A-1	పట్టా భూమి	మెట్ట	0.110	0.04452	...	భూయాజమాన్య హక్కులు నిర్ధారించబడియుండలేదు
	ఉప మొత్తం						1.420	0.57467	-	-
	మొత్తం						43.97800	17.79765	-	-

ప్రదేశం : సత్తెనపల్లి
తేది : 19-02-2026

సం/- జి.వి. రమణాకాంత్ రెడ్డి
కాంపిటెంట్ అథారిటీ (యల్.ఎ) & రెవెన్యూ డివిజనల్ అధికారి
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

రాజ్యసభ ఎన్డీఏదే!

- మార్చి ఎన్నికలతో 137 సీట్లకు చేరనున్న బలం
- పవార్ మళ్లీ ఎన్నికవడం కష్టమే!
- అఘాడీ పార్టీలు చేతులు కలిపితేనే చాన్సు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: రాజ్యసభలో ఎన్డీఏ పుంజుకోనుంది. 245 స్థానాల సభలో ప్రస్తుతం పాలక కూటమికి 133 సీట్లు ఉన్నాయి. మార్చిలో పది రాష్ట్రాల్లోని 37 స్థానాలకు జరిగే ద్వైవార్షిక ఎన్నికల్లో అదనంగా మరో 4 సీట్లు ఎన్డీఏకి దక్కనున్నాయి. అంటే 137 స్థానాలకు చేరుకోబోతోంది. సాధారణ మెజారిటీ (123) కంటే 14 సీట్లు ఎక్కువే. కీలక బిల్లుల ఆమోదానికి ఇతర పార్టీలపై పెద్దగా ఆధారపడాల్సిన అవసరం దానికి ఉండదు. కాగా.. మార్చిలో మరాఠా యోధుడు, ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ పదవీకాలం ముగుస్తోంది. ఈసారి ఆయన గెలవడం కష్టంగానే కనిపిస్తోంది. మహారాష్ట్రలో 7 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో 6 సీట్లు బీజేపీ-శివసేన-ఎన్సీపీతో కూడిన మహాయుతికి ఖాయంగా దక్కుతాయి. మహా వికాస్ అఘాడీ భాగస్వాములైన ఉద్ధవ్ సేన, ఎన్సీపీ-ఎస్పీ, కాంగ్రెస్ చేతులు కలిపితేనే ఒక స్థానం దక్కే అవకాశం ఉంటుంది. ఉద్ధవ్ సేన ఎంపీ ప్రియాంక చతుర్వేది కూడా రిటైరవుతున్నారు. పవార్ పోటీచేస్తే దివంగత అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ ఎమ్మెల్యేలు (41) ఆయన వైపు మొగ్గుచూపే అవకాశం ఉందని శరద్ పవార్ వర్గీయులు అంటున్నారు. అజిత్ వర్గం దీనిని తోసిపుచ్చుతోంది. అజిత్ ఆకస్మిక మరణంతో ఆయన భార్య సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం అయిన సంగతి తెలిసిందే. ఆమె ప్రమాణ స్వీకారానికి శరద్ పవార్, ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే హాజరు కాలేదు. దీంతో విలీనం జరిగే అవకాశాల్లేవని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కాగా.. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలు జరిగే పది రాష్ట్రాల్లో 6 చోట్ల ఎన్డీఏ అధికారంలో ఉంది. వీటిలో మహారాష్ట్ర నుంచి 7, బిహార్-5, ఒడిసా-4, అసోం-3, ఛత్తీస్‌గఢ్-2, హరియాణాలో 2 స్థానాలు ఖాళీ అవుతుండగా.. వీటిలో మహారాష్ట్ర, అసోంలో రెండు స్థానాలు 'ఇండీ' కూటమికి దక్కుతాయి. ఒడిసాలో ఒక సీటు బీజేడీకి వెళ్తుంది. మిగతా 20 సీట్లలో ఎన్డీఏకే విజయావకాశాలు ఎక్కువ. తమిళనాడులో 6 సీట్లకు గాను పాలక డీఎంకేకు 4, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ అన్నాడీఎంకేకు రెండు.. బెంగాల్లోని 5 సీట్లలో నాలుగు టీఎంసీకి, ఒకటి బీజేపీకి.. తెలంగాణలో 2, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక సీటు కాంగ్రెస్‌కు దక్కనున్నాయి. అంటే 37 సీట్లలో ఎన్డీఏకి 23, విపక్షాలు, ఇతరులకు 14 వస్తాయన్న మాట.



'బీసీ సింహగర్జన'పై ముగిసిన వాదనలు

- తగిన ఉత్తర్వులు జారీ చేస్తామన్న హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీసీ సింహగర్జన బహిరంగ సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఈ వ్యవహారంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ప్రకటించారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఈనెల 22న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బీసీ సింహగర్జన సభ నిర్వహించాలని తలపెట్టినట్టు రామచంద్రయాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా హోంశాఖ తరపు సహాయ ప్రభుత్వ న్యాయవాది అజయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వినతిని పోలీసులు తిరస్కరించారన్నారు. రామచంద్రయాదవ్ తరపున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ... రాజకీయపార్టీ బహిరంగ సభ నిర్వహణకు అనుమతివ్వకపోవడం ప్రాథమిక హక్కును హరించడమే అవుతుందన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ... 'ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, సీబీఎస్ఈ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. పోలీసులందరూ ప్రస్తుతం ఆ విధుల్లో ఉన్నారు. బహిరంగసభ నిర్వహణకు సంబంధించి కోర్టు విధించిన షరతులను గతంలో పిటిషనర్ ఉల్లంఘించారు. రహదారి పై ట్రాఫిక్‌ను స్తంభింపజేసి, శాంతిభద్రతల సమస్యను సృష్టించారు. సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉంది. ఈ సమయంలో బహిరంగ సభకు అనుమతివ్వడం సబబుకాదని భావించి పోలీసులు పిటిషనర్ వినతిని తిరస్కరించారు. సభకు అనుమతించాలని కోర్టు భావిస్తే సహేతుకమైన షరతులు విధించండి. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా నిలువరించండి. సీసీ కెమెరాలతో కార్యక్రమాన్ని రికార్డు చేసేలా ఆదేశించండి' అని కోరారు.

వినియోగదారుల కమిషన్‌లలో

ఖాళీల భర్తీకి ఆదేశించండి

- హైకోర్టులో పిల్.. నోటీసులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్లలో ఖాళీగా ఉన్న అధ్యక్ష, సభ్యుల పోస్టులను భర్తీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న వినియోగదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర, జిల్లా కమిషన్‌లలో ఖాళీగా ఉన్న అధ్యక్ష, సభ్యుల పోస్టులను భర్తీ చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ వాలంటరీ కన్స్యూమర్ అసిస్టెన్స్ నెట్‌వర్క్(వీసీఏఎన్) అధ్యక్షుడు బొమ్మిడి సన్నీరాజ్ ఈ పిల్‌ను దాఖలు చేశారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

- ఎస్సీ గురుకుల ఇంటర్ విద్యార్థులకు మంత్రి డోలా సూచన
- జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన 161 మందికి అభినందనలు



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఒత్తిడికీ గురి కాకుండా ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి సూచించారు. గురువారం తాడేపల్లిలోని ఏపీ ఎస్సీ గురుకుల సొసైటీ కార్యాలయంలో అంబేడ్కర్ గురుకులాల ఇంటర్ విద్యార్థులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థుల్లో పరీక్షల భయం పోగొట్టేలా మంత్రి ధైర్యం నింపారు. అందరూ ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులు 161 మంది జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించారంటూ అభినందించారు. గతేడాది ఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించిన 57 మంది విద్యార్థులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించామన్నారు. కార్యక్రమంలో గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబే బ్రాండ్ అంబాసిడర్


- హిందూపురం పట్టుకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తా: బాలకృష్ణ
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

హిందూపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబే బ్రాండ్ అంబాసిడర్ అని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రూ.8 కోట్లతో పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణం, మరో రూ.10 కోట్లతో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. హిందూపురంలో రూ.92 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణపనులను పరిశీలించారు. మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకే ఆయన రాష్ట్రానికి అంబాసిడర్ అన్నారు. దేశంలోనే అత్యధికంగా మల్బరీ సాగు చేసే ప్రాంతాల్లో హిందూపురం ఒకటన్నారు. ఇక్కడ పండించే పట్టుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామని తెలిపారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మార్చడానికే బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారని వివరించారు. హిందూపురాన్ని ఆర్అండ్‌బీ డివిజన్‌గా ఏర్పాటుచేయడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, సెరీకల్చర్ అదనపు కమిషనర్ అరుణకుమారి, అధికారులు పాల్గొన్నారు.

నేడు మరో అల్పపీడనం

- రేపటి నుంచి రాయలసీమకు వర్షసూచన

విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం గురువారం నాటికి నైరుతి బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో స్థిరంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనించి శుక్రవారం నాటికి బలహీనపడుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాగా ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఆగ్నేయ బంగాళాఖాతం, భూమధ్య రేఖకు ఆనుకుని హిందూ మహాసముద్రంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఆ తరువాత ఇది బలపడుతుందా?,లేదా?...అనే దానిపై మాత్రం ప్రకటన చేయలేదు. కానీ ఈ నెల 21 నుంచి దక్షిణ తమిళనాడు, కేరళల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇదే సమయంలో ఉత్తర తమిళనాడుకు ఆనుకుని రాయలసీమలో ఈనెల 21 నుంచి, దక్షిణ కోస్తాలో 22 నుంచి వర్షాలు కురుస్తాయని తెలిపింది.



సభకు రాకుండా బయట మాటలేంటి?: మాధవి రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాలు జరుగుతుంటే వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా బయట మాట్లాడుతున్నారని టీడీపీ కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి మండిపడ్డారు. మీడియా పాయింట్‌లో ఆమె మాట్లాడుతూ.. వాళ్ల ప్రాంత సమస్యలను, బడ్జెట్‌లో వారి ప్రజల ఆశలపై డిమాండ్ చేయకుండా, అభివృద్ధి గురించి పట్టించుకోకుండా బయట మాట్లాడడం బాధ్యతారాహిత్యమన్నారు. రాయలసీమ అభివృద్ధిలో భాగంగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ అభివృద్ధికి రూ.30 వేల కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించండి: బొలిశెట్టి

వైసీపీ ఈలలు, గోలల పార్టీగా కాకుండా సభా సంప్రదాయాలను పాటించాలని జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. 'బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా, సభకు రాకుండా, సంప్రదాయాన్ని పాటించకుండా ప్రవర్తించడం సరికాదు. కల్తీ వ్యవహారంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా వైసీపీ సభ్యులు సభకు రావడంలేదు. సభకు వచ్చి కల్తీపై చర్చించి తప్పును నిరూపించాలి' అని సవాల్ విసిరారు.

మండలి సాక్షిగా వైసీపీ అబద్ధాలు

- కల్తీ నెయ్యిపై తప్పు ఒప్పుకొంటేనే చర్చ: అచ్చెన్నాయుడు

మూడు రోజుల నుంచి వైసీపీ ఎమ్మెల్యేలు సంబంధం లేని విషయాలు తీసుకు వచ్చి సభాసమయాన్ని వృథా చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లాబీలో మాట్లాడుతూ, 'మండలి సాక్షిగా తిరుపతి లడ్డూలో కల్తీ జరగలేదని వైసీపీ సభ్యులు పచ్చి అబద్ధాలు చెప్పారు. సీబీఐ సిట్ కూడా నెయ్యి కల్తీ జరిగిందని నిర్ధారించింది. నాడు సాక్షాత్తు టీటీడీ ఛైర్మన్‌గా చేసిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి ఇద్దరూ నెయ్యి కల్తీ వాస్తవమేనని అంగీకరిస్తున్నారు. వైసీపీ వారు చెప్పిన అబద్ధాలను ఒప్పుకొని క్షమాపణ చెప్పిన తర్వాతే వారితో మండలిలో ఏ విషయంపైనైనా చర్చకు ముందుకు వస్తాం. హెరిటేజ్ సంస్థ దేశంలోని ఏ ప్రభుత్వంతోనూ వ్యాపార కార్యకలాపాలు చేయడం లేదు.. ఏ ప్రభుత్వ టెండరులోనూ పాల్గొనడం లేదు' అని అచ్చెన్న స్పష్టం చేశారు.

లోకేశ్‌ను విమర్శించే హక్కు నీకెక్కడిది?

- జగన్‌పై మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫైర్

అబద్ధాలు చెప్పడంలో జగన్ గోబెల్స్ వారసుడు అని మంత్రి వాసంశెట్టి సుభాష్ విమర్శించారు. లోకేశ్ కొలంబో పర్యటనకు సొంత ఖర్చులతో వెళ్లానని స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా జగన్ నిస్సిగ్గుగా అసత్యాలు మాట్లాడడం శోచనీయమన్నారు. ఏ అనధికారిక కార్యక్రమానికి వెళ్లినా సొంత నిధులే ఖర్చు చేసే ఉన్నతమైన వ్యక్తిత్వం లోకేశ్‌దన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ విమానాలు, హెలికాప్టర్ల కోసం రూ. 222.85 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. జగన్‌కు లోకేశ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

దోపిడీకి జగన్ నిదర్శనం: సత్యకుమార్

సభకు హాజరయ్యే దమ్మూ ధైర్యం లేక ప్రెస్‌మీట్‌లో మొసలికన్నీరు కారుస్తూ కూటమి ప్రభుత్వంపై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అసత్యాలు చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. రెండు గొడ్డళ్లు, రెండు బడిశెలు, దోపిడీ మైండ్‌కు జగన్ నిదర్శనమన్నారు. నిత్యం నిరాధార, అసత్య ఆరోపణలతో ప్రజలను మభ్య పెట్టేందుకు జగన్, ఆయన సొంత మీడియ చేస్తున్న ప్రయత్నాలపై ఢిల్లీ హైకోర్టు మొట్టికాయలు వేసిందని అన్నారు.

కొడుక్కి ఏం కావాలో తండ్రికి తెలుసు: వర్మ

'పార్టీకి విధేయత ఉన్న వ్యక్తిని నేను. నాకు ఏమి చేయాలో ముఖ్యమంత్రికి తెలుసు. కొడుకుకు ఏం చేయాలో తండ్రికి తెలియదా?' అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అసెంబ్లీ లాబీలో వ్యాఖ్యానించారు.

పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్

సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరుపై అసెంబ్లీ లాబీలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బుచ్చయ్య చౌదరి, అమర్నాథ్ రెడ్డి నడుమ ఆసక్తికర చర్చ జరిగింది. పార్టీలకతీతంగా అందరికీ సీఎంఆర్ఎఫ్ నిధులు వస్తున్నాయని, దీని వల్ల చాలా మంది వైసీపీ వారు కూడా లబ్ధి పొందుతున్నారని అమర్నాథ్ రెడ్డి వ్యాఖ్యానించగా, ఎమ్మెల్యేలను జనంలో నిలబెడుతున్నది సీఎంఆర్ఎఫ్ ఒక్కటేనని బుచ్చయ్య అన్నారు. తాను సీఎంఆర్ఎఫ్ చెక్కులతోపాటు స్వీట్ బాక్సు కూడా కలిపి లబ్ధిదారుకు ఇస్తున్నానని, వారు చాలా సంతోషిస్తున్నారని వ్యాఖ్యానించారు.

మైనారిటీలకు భారీగా బడ్జెట్: షాజహాన్

అసెంబ్లీలో గురువారం రాష్ట్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ మాట్లాడుతూ మైనారిటీలకు బడ్జెట్‌లో భారీగా 6,090 కోట్లు కేటాయించిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. చంద్రబాబు కాలంలోనే మైనారిటీలకు న్యాయం జరిగిందన్నారు.

సూపర్ సిక్స్‌కు ప్రాధాన్యం: యనమల దివ్య

సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కూటమి సర్కార్ అత్యంత ప్రాధాన్యమిస్తోంది. మత్స్యకార పథకం అమలుతో లక్ష మందికి ప్రయోజనం కలిగింది. తుని నియోజకవర్గంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలి.

ప్రజల భవిష్యత్తుకు దృశ్యకావ్యం: సౌమ్య

కూటమి సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల భవిష్యత్తును సూచించే దృశ్య కావ్యం. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆగిపోయిన అమరావతికి రూ.6 వేల కోట్లు కేటాయించడంతో తిరిగి పనులు ఊపందుకోనున్నాయి.

25% పెట్టుబడులు మన రాష్ట్రానికే: జయకృష్ణ

దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో ఏపీకి 25 శాతం వస్తున్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా సర్వే పేర్కొంది. ఈ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనమిక్ జోన్లతో అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి వెలకట్టలేనిది.

వైసీపీతో రాష్ట్రం అంధకారంలోకి: యార్లగడ్డ

2019-24 మధ్య వైసీపీ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టింది. కూటమి సర్కార్ వచ్చాక బడ్జెట్ రూపకల్పన ద్వారా రాష్ట్ర దశ, దిశ మారనుంది.

ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం: అశోక్‌రెడ్డి

ఆర్థిక విధ్వంసం నుంచి ఆర్థిక వికాసం కల్పించేందుకు ఈ బడ్జెట్ రూపకల్పన జరిగింది. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే ఉపముఖ్యమంత్రి స్థానిక సంస్థలను బలోపేతం చేస్తున్నారు.

ప్రతి వీధిలో ఐటీ నిపుణుడు: అయితాబత్తుల

రాష్ట్రంలో ప్రతి వీధిలో ఒక ఐటీ నిపుణుడు తయారు కావడానికి ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు విజనే కారణం. అదేవిధంగా ఇప్పుడు అమరావతిలో క్వాంటం, డీప్‌టెక్ లాంటి ఐటీ రంగాలతో భవిష్యత్తు తరాల్లో మన ఐటీ నిపుణులకు మరిన్ని అవకాశాలు వస్తాయి.

22ఏ తొలగించాలి: శ్రీరాం తాతయ్య

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయం పెరగాలంటే పలు రకాల భూములపై ఉన్న 22ఏ నిషేధం ఎత్తేయాలి. చుక్కలు, ఇనాం, దేవదాయ తదితర భూములపై ఉన్న నిషేధం ఎత్తేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. వైకుంఠపురం బ్యారేజీకి నిధులు కేటాయిస్తే బాగుండేది.

ముందుచూపున్న బడ్జెట్: ఆనంద్‌బాబు

కూటమి సర్కార్ బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం, ముందుచూపుతో ఉంది. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రంగాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

హెరిటేజ్‌పై చర్చకు సిద్ధం

ఆధారాలతో రండి.. ఎన్ని రోజులైనా చర్చిద్దాం

- హెరిటేజ్ ప్రతిష్ఠ దెబ్బతీయడానికి వైసీపీ కుట్ర
- భారతీ సిమెంట్, 'సాక్షి'లా ప్రభుత్వ సొమ్ము దోచుకోలేదు
- వైసీపీ సభ్యుల ఆరోపణలపై అచ్చెన్న ఫైర్



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హెరిటేజ్‌పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి అచ్చెన్నాయుడుకు స్పష్టం చేశారు. ఇందాపూర్ డైయిరీకి, హెరిటేజ్‌కు మధ్య సంబంధం ఉన్నట్లు ఒక్క చిన్న ఆధారం ఉన్నా గంటైనా, రోజైనా, పది రోజులైనా చర్చిద్దామని తెలిపారు. శాసన మండలిలో గురువారం కూడా వైసీపీ సభ్యులు హెరిటేజ్‌పై చర్చకు పట్టుబట్టారు. సభ ప్రారంభం కాగానే వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో వారంతా ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేయడం ప్రారంభించారు. ఈ సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, నిన్న, మొన్న ప్రభుత్వం తరఫున స్పష్టమైన సమాధానం చెప్పామన్నారు. వైసీపీ సభ్యులు ఉద్దేశపూర్వకంగా మంచి గుర్తింపు కలిగిన హెరిటేజ్ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించడానికి రోజూ ఈ సమస్యను సభలోకి తెస్తున్నారని ఆరోపించారు. బుధవారం సభలో తాను మాట్లాడిన అంశంపై మండలిలో ప్రతిపక్ష నేత ప్రెస్‌మీట్ పెట్టారని, ఆధారాలు చూపించకుండా చీజ్ ప్యాకెట్ చూపించి అదే నెయ్యి అని చెప్పారన్నారు. చీజ్‌కు, నెయ్యికి వ్యత్యాసం తెలియకుండా ఇష్టానుసారంగా మాట్లాడారని విమర్శించారు. హెరిటేజ్ సంస్థ లీగల్ నోటీసు కూడా ఇచ్చిందని, వీరికి ఏ మాత్రం సిగ్గు, విశ్వసనీయత ఉన్నా తమ సవాల్‌ను స్వీకరించాలని అన్నారు. మన రాష్ట్రమే కాదు ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వాలతో వ్యాపార లావాదేవీలు జరపకూడదని హెరిటేజ్ సంస్థ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని డబ్బులు దోచే కార్యక్రమం హెరిటేజ్ ఎప్పుడూ చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌కు భారతీ సిమెంట్ సరఫరా చేసి మొత్తం దోపిడీ చేశారని, సాక్షి పేపర్‌కు కోట్ల రూపాయలు ప్రకటనలు ఇచ్చుకున్నారని, గ్రామాల్లో పేపర్లు కొనిపించారని అచ్చెన్న ఆరోపించారు. రోజూ ఒకే అంశంపై వాయిదా తీర్మానం ఇచ్చి సభా సమయాన్ని వృథా చేస్తున్నారని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఛైర్మన్‌ను కోరారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ హెరిటేజ్‌పై చర్చకు ప్రభుత్వానికి భయంగా ఉందని ఆరోపించారు. హెరిటేజ్ వెనుక ఉండి ఇందాపూర్ డెయిరీ రాష్ట్రాన్ని దోచుకుంటుందో, చంద్రబాబు ప్రభుత్వం దోచుకుంటోందో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఒక పెద్ద పేపర్ తీసుకువచ్చి ఇది హెరిటేజ్ వెబ్‌సైట్‌లో ఉందని సభలో చూపించారు. ఇదే సమయంలో వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ, ఈలలు వేయడంతో ఛైర్మన్ సభను 5 నిమిషాల పాటు వాయిదా వేశారు.

ఇళ్ల నిర్మాణానికి గడువు పెంచాం: కొలుసు

మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పీఎంఏవై(జీ) 2.0 కింద గృహాల అంశంపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కొలుసు పార్థసారథి బదులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2025 నుంచి గ్రామాల్లో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు రిజిస్ట్రేషన్ గడువును రెండుసార్లు పొడిగించిందని తెలిపారు. పీఎంఏవై 2.0 కింద యూనిట్ ధరలు పెంచే ప్రతిపాదనలు ఏమీ లేవని తెలిపారు. ఇదే సమయంలో వైసీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో సభను పది నిముషాలు వాయిదా వేశారు. తర్వాత కూడా ప్రశ్నోత్తరాలు కొనసాగే పరిస్థితి లేకపోవడంతో ఛైర్మన్ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పినట్లుగా ప్రకటించారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

'మండలి' 15 నిమిషాలే..!

శాసన మండలిలో వాయిదాల పర్వం కొనసాగింది. గురువారం కేవలం 15 నిమిషాలు మాత్రమే సమావేశమైంది. ఉదయం 10.04 గంటలకు సభ ప్రారంభం కాగానే ఛైర్మన్ మోషేన్ రాజు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సవరణ బిల్లులు, ఎలక్ట్రిసిటీ బిల్లు, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సవరణ, దేవదాయ శాఖకు సంబంధించిన రెండు బిల్లులను సభ ముందు ఉంచారు. రాష్ట్ర బడ్జెట్‌పై చర్చించేందుకు నాలుగు రోజుల సమయం కేటాయించామని, రెండు రోజులుగా సభకు అంతరాయం రావడంతో చర్చను ప్రారంభించలేదని తెలిపారు. బడ్జెట్‌పై చర్చకు సభ్యులు సహకరించాలని కోరారు. అనంతరం తిరుమల లడ్డూ కల్తీ, ఇందాపూర్ డెయిరీ పేరుతో హెరిటేజ్ నెయ్యి సరఫరాపై చర్చించాలంటూ వైసీపీ సభ్యులు రామసుబ్బారెడ్డి, వి.కల్యాణి, అరుణ్‌కుమార్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. హెరిటేజ్‌పై చర్చకు వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ఛైర్మన్ పోడియం వద్దకు దూసుకొచ్చారు. వారి నినాదాలతో 10.15 గంటలకు ఛైర్మన్ సభను వాయిదా వేశారు. తిరిగి సభ 10.57 గంటలకు ప్రారంభం కాగానే ఛైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. మంత్రి పార్థసారథి సమాధానం చెబుతున్న సమయంలోనూ వైసీపీ సభ్యులు పోడియంను చుట్టుముట్టారు. సభ ఆర్డర్‌లో లేకపోవడంతో ఛైర్మన్ సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. రెండోసారి సభ 11.00 గంటల వరకే జరిగింది. అనంతరం 12.42 గంటలకు సభ ప్రారంభమైనా వైసీపీ సభ్యుల తమ నినాదాలతో ఒక్క నిమిషం వ్యవధిలోనే సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

క్షమాపణలు చెప్పను: బొత్స

ఇందాపూర్‌తో హెరిటేజ్‌కు సంబంధం ఉన్నట్లు తమ వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. హెరిటేజ్ పంపిన నోటీసులు తనకు ఇంకా అందలేదని, తాను వాస్తవాలే మాట్లాడానని, క్షమాపణలు చెప్పేది లేదని అన్నారు. గురువారం అసెంబ్లీ గేటు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఇందాపూర్, హెరిటేజ్‌పై సభలో చర్చకు పట్టుబడితే తనకు లీగల్ నోటీసులు పంపడం హాస్యాస్పదమన్నారు. పది రోజుల క్రితం వరకు ఇందాపూర్ సంస్థ వివరాలు హెరిటేజ్ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. తొలుత ఇందాపూర్ మ్యానుఫ్యాక్చరర్‌గా ఉండేదని, దీన్ని కో-మ్యానుఫ్యాక్చరర్‌గా మార్చారని అన్నారు. కేరళ ప్రభుత్వం హెరిటేజ్‌ను బ్యాన్ చేయడమేనా అవార్డు, హరియాణా రూ.లక్ష ఫైన్ వేయడమేనా రివార్డు అని ప్రశ్నించారు.



చేనేత స్టాల్‌ను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కన మంత్రి సవిత, చీరాల ఎమ్మెల్యే కొండయ్య

అసెంబ్లీలో చేనేత సందడి

- ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన స్పీకర్ అయ్యన్న
- కొనుగోలు చేసిన స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- తొలిరోజు బోణీ అదిరిందన్న మంత్రి సవిత
- రూ.10 లక్షల చేనేత వస్త్రాల అమ్మకం



అసెంబ్లీలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో మగ్గం నేస్తున్న మంత్రి అనిత

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా అమరావతి అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో గురువారం 12 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేసింది. ఈ స్టాళ్లలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన, ప్రపంచ గుర్తింపు పొందిన చేనేత దుస్తుల విక్రయాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఆయన వెంట డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, చేనేత మంత్రి సవిత, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. అనంతరం చేనేత క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ చేనేత దుస్తులు ధరించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ క్యాడర్‌కు రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. ఆకర్షణీయమైన రంగుల్లో ఉన్న చేనేత చీరలు, షర్టులు, మోదీ జాకెట్ల కొనుగోలుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి అనుచరులు, అధికారులు ఆసక్తి చూపారు. స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చీరలు, షర్ట్ మెటీరియల్ కొనుగోలు చేశారు. చేనేత వస్త్రాల కొనుగోలుకు విశేష స్పందన లభించడంతో నేతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. తొలిరోజు రూ.10 లక్షల వరకూ అమ్మకాలు జరిగినట్లు మంత్రి సవిత తెలిపారు. మొదటి రోజు బోణీ అదిరిందని, మరో ఆరు రోజులపాటు ఈ స్టాళ్లు నిర్వహిస్తామని తెలిపారు. కొందరు ఎమ్మెల్యేలు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల విలువైన చీరలు కొన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా పాల్గొన్నారు.

రాష్ట్రానికి వైసీపీ హానికరం!

(మొదటి పేజీ తరువాయి)



> జగన్ ప్రభుత్వం ప్రమాదకరస్థాయిలో 12 శాతం వడ్డీకి అప్పులు తీసుకొచ్చింది. ఇప్పుడు మేం బ్యాంకులతో మాట్లాడి ఆ వడ్డీని 9 శాతానికి తగ్గించాం. దీనివల్ల ఏటా రూ.2,000 కోట్లు ఆదా అవుతున్నాయి.
> - మంత్రి పయ్యావుల

ఆయన సమాధానమిచ్చారు. ఇజ్రాయెల్ దేశస్థుల తరహాలో రాష్ట్ర ప్రజలు కూడా మన రాష్ట్రమనే భావనను పెంపొందించుకోవాలని కోరారు. నయానాజీల తరహాలో గత పాలకులు విధ్వంసం సృష్టించారని ఘాటుగా విమర్శించారు. గోబెల్స్ తరహాలో ప్రచారానికి సొంత మీడియాను అడ్డం పెట్టుకున్నారని మండిపడ్డారు. బడ్జెట్ ప్రసంగంలో వైసీపీ గురించి 16 సార్లు, చంద్రబాబు గురించి 13 సార్లు ప్రస్తావించినట్లు జగన్ పత్రికలో రాశారని, వాస్తవానికి చంద్రబాబు చేస్తున్న మంచి పనుల గురించి ప్రతి పేజీలోనూ, వైసీపీ చేసిన ఘోరాలను ప్రతి పేరాలోనూ ప్రస్తావించాలని పయ్యావుల వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

అప్పట్లో ఒక్క కంపెనీ కూడా రాలేదు

కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన భూకేటాయింపుల వల్ల రాష్ట్రానికి మంచి జరుగుతోంది. కానీ, వైసీపీ హయాంలో కేటాయింపుల వల్ల నష్టం వాటిల్లింది. చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయి. వైఎస్ హయాంలో ఇచ్చిన భూముల్లోకి ఒక్క కంపెనీ కూడా రాలేదు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వాన్‌పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా ఒక్క కంపెనీ కూడా రాలేదు.

సీమ ఉత్పత్తులకు బ్రాండింగ్..

సీఎం చంద్రబాబు పాలనా సామర్థ్యంతో పరిశ్రమల్లోకే కాకుండా రాయలసీమ పొలాల్లోకి కూడా పెట్టుబడులు వస్తున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చి కల్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలు కొని, దానిమ్మకాయలు పండిస్తున్నారు. ముఖ్యమంత్రి చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోంది. జగన్ సీఎంగా ఉండగా.. ఒకే ఒక్క సంతకంతో 102 రాయలసీమ ప్రాజెక్టులను రద్దు చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని అప్పటి ఇరిగేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ నాడు కేంద్రానికి స్పష్టం చేసిన డాక్యుమెంట్లు ఇవిగో (వాటిని మంత్రి సభ ముందుంచారు)! రాష్ట్ర ప్రజలు ఒక్కొక్కరూ వేసిన ఒక్కో ఓటుకు బడ్జెట్ ద్వారా 100 లాభాలు కల్పిస్తున్నాం. చంద్రబాబు దావోస్ పర్యటనలో 3 రోజుల్లో 36 సమావేశాలు పెట్టుకున్నారు. పర్యటనకు ముందు తర్వాత కూడా వరుస సమావేశాలతో ఆయన బిజీగా ఉన్నారు. ప్రజల కోసం పనిచేయడం ఆయనకు చాలా ఇష్టం.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టుకుంటున్నాం..

రాజధాని కోసం తమిళనాడు నుంచి కర్నూలుకు.. అక్కడి నుంచి హైదరాబాద్.. ఇప్పుడు అమరావతికి వచ్చాం. ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని గాడిలో పెట్టుకుంటున్నాం. జగన్ ఎన్నో పథకాలకు బకాయిలు పెట్టిపోయారు. ఇప్పుడు వాటిని చెల్లిస్తూ పాలన కొనసాగిస్తున్నాం. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం ప్రక్షాళన కోసం మొదటి బడ్జెట్.. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి రెండో బడ్జెట్.. అభివృద్ధి-సంక్షేమం పరుగుల కోసం మూడో బడ్జెట్ పెట్టాం. అన్న క్యాంటీన్లతో ఓ కుటుంబానికి నెలకు రూ.2,500కు పైగా ఆదా అవుతోంది. స్త్రీశక్తి పథకంతో ఒక కుటుంబానికి నెలకు రూ.3,000 వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. ఎన్టీఆర్ భరోసాతో దేశంలో ఎవ్వరూ ఇవ్వనంతగా పెన్షన్లు ఇస్తున్నాం. 15,000కిపైగా టీచర్ ఉద్యోగాలిచ్చాం. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లింది. ఇప్పుడు కూటమి హయాంలో మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం రాబడి పెరిగింది.

పులివెందుల సమస్యలు తీరుస్తున్నాం..

కనీసం పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను కూడా గత పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న సమీక్షల్లో ఆ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలు వెలుగులోకి వచ్చాయి. పులివెందులనే పట్టించుకోనివారు ఇక రాష్ట్రాన్నేం పట్టించుకుంటారు? ఆ నియోజకవర్గంలోని మల్లెల గ్రామంలో ఆడపిల్లల స్కూలు నిర్మాణం కోసం రూ.19.62 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా జగన్ పట్టించుకోలేదు. అరటి ప్రాసెసింగ్-ప్యాకేజింగ్ హౌస్ నిర్మాణాన్ని గాలికొదిలేశారు. దానిని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుంటోంది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర నీటిసరఫరా పథకం నిర్మాణాన్ని కూడా జగన్ పూర్తి చేయలేదు. బిల్లులనూ పెండింగ్‌లో పెట్టారు. వేంపల్లి నుంచి గండి రోడ్డు విస్తరణ, కాలేటి వాగు రిజర్వాయరును పట్టించుకోలేదు.

దృష్టి మరల్చేందుకే హెరిటేజ్‌పై ఆరోపణలు

> నెయ్యి కల్తీ చేసిన జగన్‌నే బొత్స ప్రశ్నించాలి
> స్వార్థరాజకీయాల కోసం సభా సమయం వృథా
> వైసీపీ సభ్యులపై కొల్లు ఫైర్



అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాల కోసమే హెరిటేజ్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. గురువారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. '2019-24 వైసీపీ పాలకులు చేసిన కల్తీ కుట్ర బట్టబయలవ్వడంతో తప్పించుకోవడం కోసం హెరిటేజ్‌పై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి సైతం కల్తీ జరిగిందని ఒప్పుకున్నారు. హెరిటేజ్ సంస్థ ఇందాపూర్ సంస్థ నుంచి కొన్ని రకాల సరుకులు కొనుగోలు చేస్తుందే తప్ప వాటిని తిరుమలకు సరఫరా చేయడంలేదు. ఇందాపూర్ సంస్థ ఏవైనా దేవాలయాలకు నెయ్యి సరఫరా చేస్తుందేమో గానీ, జగన్‌రెడ్డిలా అధికారాన్ని అడ్డంపెట్టుకుని సొంత సంస్థలకు ప్రభుత్వ సొమ్మును ధారాదత్తం చేయడం చంద్రబాబుకు తెలియదనే విషయం గుర్తుంచుకోవాలి. 2019-24లో జరిగిన కల్తీ గురించి జగన్ రెడ్డి గల్లా పట్టుకుని బొత్స ప్రశ్నించాలి. తిరుమల ప్రసాదాన్ని అపవిత్రం చేసిన జగన్‌రెడ్డికి వంతపాడేందుకు బొత్స లాంటివారు సిగ్గుపడాలి. హెరిటేజ్ సంస్థ ఎలాంటి అక్రమాలకూ పాల్పడలేదు కాబట్టే వారు బొత్సకు నోటీసులు ఇచ్చారు. ప్రజా సమస్యలపై కాకుండా మీ స్వార్థ రాజకీయాల కోసం సభ సమయాన్ని వృథా చేయడం సిగ్గుచేటు ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. గుణపాఠం తప్పదు' అని హెచ్చరించారు. అలాగే, అంబటి రాంబాబు చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తపడకుండా ఇంకా అడ్డగోలుగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

పోస్టింగ్స్ ఇవ్వరు.. వీఆర్‌లో జీతాలివ్వరు

- పదోన్నతుల్లోనూ పోలీసులకు అన్యాయం
- హోంగార్డులకు చాలీచాలని వేతనం: విష్ణుకుమార్ రాజు

అమరావతి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పోలీసులకు పోస్టింగ్స్ ఇవ్వరు.. వీఆర్‌లో జీతాలు చెల్లించరు.. ఇదేమి పద్ధతి అంటూ బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో 50మందికిపైగా డీఎస్పీలు, 68మంది సీఐలను ఏడాదిన్నరగా పోస్టింగ్స్ ఇవ్వకుండా వేకన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉంచారు. ఏదో ఒక పోస్టింగ్ ఇవ్వాలి. లేదంటే ప్రతి నెలా సగం జీతమైనా చెల్లించాలి. రెండూ కుదరదంటే ఎలా అధ్యక్షా?' అని ప్రశ్నించారు. 'సరైన పద్ధతిలో పదోన్నతులు ఇవ్వడం లేదు. ఈ జాప్యం వల్ల అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు పదోన్నతులు లేకుండానే రిటైరవుతున్నారు. గత సమావేశాల్లోనూ ఇదే సమస్యపై ప్రశ్నించినా హోంమంత్రి స్పందించ లేదు' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. హోంగార్డులకు పొరుగు రాష్ట్రంలో మంచి జీతాలు ఇస్తున్నారని, మన రాష్ట్రంలో హోంగార్డులకు వేతనాలు పెంచడం రూ.3.23లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో సాధ్యం కాదా? అంటూ విష్ణుకుమార్‌రాజు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలు పెరుగుతున్నాయి: అనిత

రాష్ట్రంలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ... సైబర్ నేరాల కట్టడికి ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. సైబర్ బాధితులు 1930కు కాల్ చేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఐఆర్ఆర్ భూసేకరణ ప్రారంభించాం: మంత్రి నారాయణ

- అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్(ఐఆర్ఆర్) ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రారంభించామని, పూర్తి కాగానే పీపీపీ విధానంలో ప్రాజెక్టు అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి నారాయణ తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.
- ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.839కోట్లు ఖర్చు చేసినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే కొణతాల రామక్రిష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 22.31లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు.

క్లస్టర్ వర్సిటీ పనులు పూర్తి చేస్తాం

- కర్నూలు క్లస్టర్ వర్సిటీలో అదనపు పోస్టుల మంజూరుకు ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందని, అసంపూర్తిగా ఉన్న పనులు దశల వారీగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ప్రశ్నకు మంత్రి లోకేశ్ జవాబు చెప్పారు.

2025-26లో రూ.53,879కోట్ల అప్పు

- రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.60,485కోట్లు, 2025-26లో రూ.53,879కోట్లు అప్పు చేసినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వైసీపీ ఎమ్మెల్యేల లిఖిత పూర్వక ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజన నాటికి రూ.1,48,743 కోట్లు ఉన్న రాష్ట్ర అప్పులు.. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.4,91,734కోట్లకు చేరాయని తెలిపారు.

టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలి

- కలువాయి, రాపూరు మండలాల్లోని ఆలయాలు, పర్యాటక ప్రదేశాలు, కండలేరు జలాశయాన్ని కలుపుతూ టూరిజమ్ సర్క్యూట్ ఏర్పాటు చేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామక్రిష్ణ కోరారు. వాల్మీకి, బోయలను ఎస్టీల్లో కలిపే ప్రక్రియను ప్రారంభించాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కోరారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు కోరారు.

బూతులు నిషేధిస్తూ చట్టం తేవాలి

ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసిన అంబటి రాంబాబు లాంటి వారి నోట బూతులు రాకుండా ఉండాలంటే తెలుగు భాషపై చట్టం(బూతులు నిషేధిస్తూ) చేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు.


తీరంలో యుద్ధ ట్యాంకులు


ఆర్కే బీచ్‌రోడ్డులో గురువారం సాయంత్రం నిర్వహించిన సిటీ పరేడ్‌లో నేవీ సిబ్బంది కంటిన్యుటీ డ్రిల్


ఐఎన్ఎస్ విక్రాంత్ నౌకపై యుద్ధ విమానం

అబ్బురం.. నేవీ సంబరం


ఘనంగా ఇంటర్నేషనల్ సిటీ పరేడ్.. తీరంలో విన్యాసాలతో ఆకట్టుకున్న నేవీ

- కనువిందు చేసిన హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు
- ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్


నేవీ విన్యాసాలు వీక్షిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో నేవీ ఛీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, తూర్పు నౌకా దళం చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ఉన్నారు


విదేశీ నేవీ అధికారులతో రాజ్‌నాథ్‌సింగ్ కరచాలనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరం బాంబు పేలుళ్లతో మోతెక్కింది..! వాయువేగంతో గగనతలంలో దూసుకెళ్లిన యుద్ధ విమానాలు రణభేరిని తలపించాయి...! వివిధ దేశాల ప్రతినిధులు ధవళ వస్త్రాలతో నిర్వహించిన కవాతు ఆహా అనిపించింది..! భారత నావికాదళం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో భాగంగా గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో నిర్వహించిన ఈ సాహస విన్యాసాల ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా... భారత నౌకాదళం అధినేత అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన విన్యాసాలు అరగంట సేపు చూపుతిప్పుకోనివ్వలేదు. మూడు చేతక్ హెలికాప్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తూ వేదిక ముందు నుంచి వెళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఆ తర్వాత నేవీ వైమానిక దళం వినియోగిస్తున్న... సీ కింగ్-42 హెలికాప్టర్లు, కమోవ్-29 హెలికాప్టర్లు, కమోవ్-31 హెలికాప్టర్లు, ఎంహెచ్-60 ఆర్ హెలికాప్టర్లు, సీ కింగ్ హెలికాప్టర్లు ప్రదర్శన చేశాయి.


నడిసంద్రంలో ఆయిల్ రిగ్ పేల్చివేత


ఆర్కే బీచ్‌రోడ్డులో గురువారం సాయంత్రం నిర్వహించిన నేవీ విన్యాసాలను తిలకించేందుకు హాజరైన జనం

విన్యాసాల్లో పాల్గొన్న కమోవ్ హెలికాప్టర్లు

మెరైన్ కమెండోల విన్యాసాలు

ప్రత్యేక శిక్షణ పొందిన మెరైన్ కమెండోలు సీ కింగ్ హెలికాప్టర్ల నుంచి తాళ్ల సాయంతో సముద్రంలోకి దిగుతూ చేసిన విన్యాసాలు, హెలికాప్టర్ల ద్వారా చేసిన రెస్క్యూ ఆపరేషన్ సాహో అనిపించాయి. వివిధ దేశాల నేవీ సిబ్బంది నిర్వహించిన సిటీ పరేడ్ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, వియత్నాం, థాయ్‌లాండ్, ఇరాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, సీషెల్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక తదితర దేశాల నేవీ ప్రతినిధులు కవాతులో పాల్గొన్నారు. కూచిపూడి, అరకు థింసా, తప్పెటగుళ్లు, గరగలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. లేజర్ షో, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్ అద్భుతం అనిపించాయి.

పరస్పర సహకారంతోనే సముద్ర సవాళ్లకు చెక్

- 'మిలాన్-2026' సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

ప్రపంచ దేశాలన్నీ పరస్పరం సహకరించుకుంటేనే సముద్రంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించగలుగుతామని, దీనికి అంతా చేతులు కలపాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో నేవీ మిలాన్-2026ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 74 దేశాల నేవీ ప్రతినిధులను ఉద్దేశించి రాజ్‌నాథ్ ప్రసంగించారు. సముద్ర మార్గాల్లో ఇటీవల పైరసీ, టెర్రరిజం, అనధికార చేపల వేట, అక్రమ తరలింపు, సైబర్ నేరాలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని ఏ ఒక్క నౌకాదళమూ పరిష్కరించలేదని అన్నారు. ఒకరికొకరు సహకరించుకున్నప్పుడే భద్రత సాధ్యమవుతుందని, భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మిలాన్ దీనికి ఒక వేదికగా నిలుస్తుందన్నారు. భారత్ సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ది రీజియన్ (సాగర్) విధానం అనుసరిస్తున్నదని, దాన్ని ఇప్పుడు మహాసాగర్‌గా ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. సమావేశంలో నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

2 స్టేడియాలంత పొడవైన రన్‌వే..!

- ఫ్లీట్ రివ్యూలో ప్రత్యేక ఆకర్షణగా 'ఐఎన్ఎస్ విక్రాంత్'

భారత నౌకాదళంలో అత్యంత శక్తివంతమైనది, వ్యూహాత్మకమైనదిగా పేరొందిన విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్. విశాఖపట్నంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాని ప్రత్యేకతలను నేవీ అధికారులు గురువారం వివరించారు. ఇదిపూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన తొలి విమాన వాహక నౌక. దీని నిర్మాణానికి సుమారు రూ.23 వేల కోట్లు వెచ్చించారు. దీనిపై యుద్ధ విమానాలు తేలికగా టేకాఫ్, ల్యాండింగ్ అయ్యేందుకు వీలుగా రెండు క్రికెట్ స్టేడియాలు కలిపితే ఎంత ఉంటుందో అంత పొడవైన రన్‌వే ఏర్పాటుచేశారు. దీనిపై ఒకేసారి 32 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను మోహరించవచ్చు. సముద్రం మధ్యలోనే ఇంధనం నింపుకొనే ఏర్పాట్లు ఉన్నాయి. మిగ్-29 యుద్ధ విమానాలు ఎంత వేగంతో వెళతాయో అదే వేగంతో వచ్చి దీనిపై ఆగేలా 'హుక్' స్టాపర్ టెక్నాలజీ వినియోగిస్తున్నారు. నౌక బరువు 43 వేల టన్నులు. పొడవు 262 మీటర్లు. వెడల్పు 62 మీటర్లు. గంటకు 28 నాటికల్ మైళ్ల వేగంతో ఏకధాటిగా 7,500 కి.మీ. ప్రయాణిస్తుంది.

కవాతు ఐక్యతకు గుర్తు: గవర్నర్

విశాఖ సాగర తీరాన విదేశీ సాయుధ దళాల కవాతు ఐక్యతకు చిహ్నంగా నిలుస్తుందని, ఇదే స్ఫూర్తి కొనసాగాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో భాగంగా గురువారం సాయంత్రం విశాఖలో సాహస విన్యాసాల ప్రదర్శనతోపాటు ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ.. భారత నౌకాదళం విదేశీ నౌకాదళాలతో ఇలాంటి అసాధారణ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలే దేశాల మధ్య స్నేహం, విశ్వాసం, పరస్పర గౌరవం పెంచుతాయన్నారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని, నేవీ అధికారులను అభినందించారు. కాగా, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్‌లో 74 భాగస్వామ్య దేశాలు పాల్గొన్నాయని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలు నేవీ చరిత్రలో ల్యాండ్ మార్కుగా నిలిచిపోతాయన్నారు.


విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న యుద్ధ నౌకలు

టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు
చంపేసింది!

- మంగళగిరిలో భర్తను కత్తితో పొడిచి చంపిన భార్య


అహ్మద్, క్రాంతి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): టీవీ సౌండ్ తగ్గించమన్నందుకు భర్తను కత్తితో పొడిచి హతమార్చిందో భార్య. గుంటూరు జిల్లా మంగళగిరిలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి తాలూకా పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన షేక్ అహ్మద్(26) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఏడాదిన్నర క్రితం మంగళగిరికి చెందిన క్రాంతి అనే మహిళతో పరిచయంవివాహేతర సంబంధానికి దారితీసింది. క్రాంతికి గతంలోనే పెళ్లయింది. మొదటి భర్త జైలులో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అహ్మద్‌ను వివాహం చేసుకుని మంగళగిరి టిడ్కో ఇళ్లలో బీ-16 బ్లాకులో నివసిస్తున్నారు. గురువారం రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న అహ్మద్ ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య పెద్ద శబ్ధంతో టీవీ చూస్తోంది. సౌండ్ తగ్గించమని చెప్పడంతో క్రాంతి ఆగ్రహంతో కత్తితో భర్తను పొడిచింది. తీవ్రంగా గాయపడిన అహ్మద్‌ను విజయవాడ ప్రభుత్వవైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి మహబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మంగళగిరి పట్టణ సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

వైసీపీ సర్పంచ్ ఇంట్లో చోరీ సొత్తు

- పోలీసుల అదుపులో దొంగతో పాటు సర్పంచ్


సత్తెనపల్లి రాకేశ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఒక దొంగ అపహరించుకు వచ్చిన వెండి, బంగారపు వస్తువులు ఒక వైసీపీ సర్పంచ్ ఇంట్లో లభ్యమయ్యాయి. దొంగ జాడను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించిన పోలీసులు అతడితో పాటు సర్పంచ్‌ను విచారణ కోసం తీసుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. దెందులూరుకు చెందిన సత్తినపల్లి రాకేశ్(24) 2022 నుంచి ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నాడు. అతడిపై పోలీసులు సస్పెక్ట్ షీటు తెరిచారు. కొద్దికాలం క్రితం అరెస్టు చేయడంతో నాలుగు రోజుల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఒక వాలీబాల్ జట్టు సభ్యులతో కలిసి ఒంగోలు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో టీమ్‌తో కాకుండా వేరుగా వెళ్లిపోయాడు.ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్రకుమార్ మాతృమూర్తి ప్రమీలాదేవి పొన్నూరు పరిధిలోని చింతలపూడిలో నివాసం ఉంటున్నారు. రాకేశ్ ఒంగోలు నుంచి వస్తూ ఆమె ఇంట్లో రూ.70లక్షల విలువైన వెండి, బంగారపు వస్తువులను చోరీ చేశాడు. పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య బృందం సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి రాకేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తు ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సర్పంచ్ రఘు(వైసీపీ) నివాసంలో ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అనంతబాబు భార్య ఎక్కడ?

- పరారీలో ఉన్న లక్ష్మీదుర్గ కోసం ముమ్మర గాలింపు
- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలో పాత్ర ఉందని తేలడంతో ఆమె అరెస్టుకు యత్నాలు
- ఇరుక్కుపోయినట్లు తెలిసి ముందే పరార్
- భార్యభర్తలిద్దరూ కలిసే హత్యచేసినట్లు నిర్ధారించిన పోలీసులు


అనంతబాబు భార్య అనంత లక్ష్మీదుర్గ అలియాస్ రోజా

కాకినాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య అనంత లక్ష్మీదుర్గ అలియాస్ రోజా కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యలో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు అనుబంధ చార్జిషీటులో పేర్కొన్న పోలీసులు.. వాటికి ఆధారాలనూ జతచేశారు. ఏ-2గా చేర్చి ఆమెను అరెస్టు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో ఆమె పరారీలో ఉన్నారు. ఆమె స్వస్థలం అడ్డతీగలలో గానీ, అటు కాకినాడలోని అపార్ట్‌మెంట్‌లో గానీ లేరని పోలీసులు గుర్తించారు. ఎక్కడ దాక్కున్నారనేది ఆరా తీస్తున్నారు. బంధువుల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ డ్రైవర్ హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబు ఒక్కరినే ఏ-1గా నాడు పోలీసులు చేర్చారు. అయితే అందులో ఆయన భార్య పాత్ర కూడా ఉందనేందుకు ఆధారాలున్నా దాచిపెట్టారు. ఎఫ్ఐఆర్‌లో, చార్జిషీటులో ఆమె పాత్ర లేకుండా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు విచారణ వేగం పుంజుకోవడం, లోతుగా దర్యాప్తు చేయడానికి రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ న్యాయస్థానం అనుమతించడంతో పోలీసులు సమగ్రంగా విచారించారు. హత్యలో అనంతబాబు భార్య పాత్ర ఉన్నట్లు పక్కా ఆధారాలు సాధించి మంగళవారం కోర్టులో దాఖలుచేసిన అనుబంధ చార్జిషీటుతో వాటిని జతచేశారు. భార్యాభర్తలిద్దరూ పథకం ప్రకారమే దళితుడైన తమ డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేశారని తేల్చారు. హత్యకు ముందు అనంతబాబుతో కలిసి ఆయన భార్య కూడా కారులో వెళ్లినట్లు నిర్ధారించారు. వారిద్దరూ కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ వెనుకగేటు సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద హత్య చేసినట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. 'అనంతరం మృతదేహాన్ని తమ కారులో ఎక్కించుకుని అనంతబాబు, ఆయన భార్య తాము నివసించే శంకర్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. హత్య తర్వాత అనంతబాబు మృతుడి తండ్రి, సోదరుడికి పది సార్లు ఫోన్లు చేశాడు. అదే సమయంలో అనంతలక్ష్మీదుర్గ 2022 మే 19న రాత్రి 10.23 గంటలకు రెండు నిమిషాలు, 10.32 గంటలకు 2.17 నిమిషాలు, హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని డోర్‌డెలివరీ చేసిన అనంతబాబు పారిపోయిన తర్వాత తెల్లవారుఝామున 4.01 గంటలకు అనంతబాబుకు ఫోన్ చేసి 1.53 నిమిషాలు మాట్లాడినట్లు కాల్ రికార్డు ద్వారా నిర్ధారణ అయింది. ఆ రోజు రాత్రి 10.20కు కాకినాడలోని తమ శంకర్ టవర్స్ 401 ఫ్లాట్ నుంచి అనంతబాబు, ఆయన భార్య కారులో బయటకు వెళ్లారు. అక్కడి నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ వెనుకగేటులో డంపింగ్ యార్డుకు చేరుకున్నారు. ఈ విషయం సమీప వీవీ కుమార్ గెస్ట్‌హౌస్ సీసీ ఫుటేజీలో రికార్డయింది. రాత్రి 10.37 గంటల నుంచి రాత్రి 12.05 గంటలకు వరకు డంపింగ్ యార్డులోనే ఉన్నారు. ఈ గంటన్నర వ్యవధిలో సుబ్రహ్మణ్యాన్ని వీరిద్దరూ హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి మృతదేహంతో కారులో బయల్దేరి 20వ తేదీ తెల్లవారుఝామున 1.22 గంటలకు తమ అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. మృతదేహాన్ని కారులోనే ఉంచి అపార్ట్‌మెంట్ మెయిన్‌గేటు ఎదుట పార్క్ చేసి తమ ఫ్లాట్‌లోకి వెళ్లారు. తర్వాత అనంతబాబు తన భార్యను అపార్ట్‌మెంట్‌లో వదిలి.. ఆనక దుస్తులు మార్చుకుని 1.31 గంటలకు మృతదేహాన్ని తానొక్కడే కారులో తీసుకుని రోడ్డు ప్రమాదం డ్రామా కోసం తొలుత ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు' అని 56 పేజీల అనుబంధ చార్జిషీటులో పోలీసులు వివరించారు. అనంతబాబుకు నేరచరిత్ర ఉందని.. వివిధ పోలీసు స్టేషన్లలో మొత్తం 17 కేసులు ఉన్నట్లు వివరించారు.

అంబటి హైడ్రామా!

- రాజమండ్రి టు గుంటూరు మార్గమంతా రాంబాబు ఓవరాక్షన్.. పోలీసులతో ఘర్షణ
- 30 యాక్ట్ ఉన్నా బలప్రదర్శనలా 30 వాహనాలతో ర్యాలీ
- 'అంతు చూస్తా'నంటూ ఎస్సైకు బెదిరింపు


జక్కంపూడి రాజా ఇంటి వద్ద డీఎస్పీతో అంబటి రాంబాబు వాగ్వాదం

రాజమహేంద్రవరం, గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సీఎంను బూతులు తిట్టి జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చినా, వైసీపీ నేత అంబటి రాంబాబు తీరులో మాత్రం మార్పు లేదు. నిబంధనలకు అడ్డగోలుగా తూట్లు.. పోలీసులతో పదేపదే ఘర్షణ! గురువారం రాజమండ్రిలో మొదలైన అంబటి హైడ్రామా విజయవాడ ప్రకాశం బ్యారేజీ మీదుగా ర్యాలీగా గుంటూరు చేరేవరకు సాగి....ంది. బుధవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన మరో వైసీపీ నేత జక్కంపూడి రాజా నివాసంలో బస చేశారు. భారీ ర్యాలీగా గుంటూరు చేరుకునేలా రోడ్‌మ్యాప్ ఎను ప్లాన్ చేశారు. గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో గుంటూరు వెళ్లడానికి రాంబాబు బయటకు వచ్చారు. అప్పటికే వైసీపీ బల ప్రదర్శనలో భాగంగా కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున గుమిగూడారు. 30 కార్ల వరకూ వరుస కట్టాయి. సీఐ బాజీలాల్ అక్కడకు చేరుకొని పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని, ర్యాలీలు, సభలు, సమావేశాలు వంటివి నిర్వహించడానికి వీల్లేదంటూ నోటీసు ఇచ్చారు. వైసీపీ శ్రేణుల వల్ల శాంతి భద్రతలకు ఇబ్బంది కలగకుండా పోలీసులు స్టాపర్ బోర్డులను బారికేడ్ల మాదిరిగా పెట్టారు. ఈలోపు రాజా ఇంటి వద్దకు సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకాంత్, ఎస్‌బీ డీఎస్పీ రామకృష్ణ, ధవళేశ్వరం సీఐ గణేశ్ తదితరులు చేరుకున్నారు. వాహన శ్రేణి విషయంలో డీఎస్పీతో రాంబాబు గొడవపడ్డారు. తన కారు వెంట మిగతా కార్లు ర్యాలీ మాదిరిగా రావడానికి అనుమతించాలంటూ వాగ్వా దానికి దిగారు. అందుకు అధికారి నిరాకరించడంతో ఆయనపై పెద్ద పెద్దగా కేకలు వేశారు. అయినా, ర్యాలీ మాదిరిగా వెళ్లడానికి ఎట్టి పరిస్థితు ల్లోనూ వీల్లేదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో కారు దిగి రెండు సార్లు పాదయాత్రగా వెళ్లడానికి రాంబాబు ప్రయత్నించారు. ఈ తంతు జరుగుతుండగా.. స్టాపర్ బోర్డులను రాజా పక్కకు నెట్టేశారు. వైసీపీ కార్యకర్తలు అరుపులు, నినాదాలు చేస్తూ, తోసుకుంటూ వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి నెల కొంది. రాంబాబు రెండు చోట్ల కారు దిగి పాదయాత్రంటూ హల్ చల్ చేశారు. రాంబాబును కారులో ఎక్కించిన పోలీసులు రాజమండ్రి నుంచి సాగనంపారు. అయితే రోడ్ కం రైలు బ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి రాంబాబు కాన్వాయ్ మాదిరిగా మళ్లీ 30కి పైగా కార్లు వరుసలో కలిశాయి.

అంతు చూస్తా..

అంబటి మధ్యాహ్నం 12 గంటలకి ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి తాడేపల్లి, మంగళగిరి, కాజా టోల్‌గేట్ వద్దకు రాగానే వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనదారులకు ఇబ్బందులు కలిగించాయి. ఈ క్రమంలో కాన్వాయ్ వరుసగా రావాలని సూచించిన మంగళగిరి ఎస్సై వెంకట్‌పై రాంబాబు నోరు పారేసుకున్నారు. 'నీ అంతు చూస్తా'నంటూ తీవ్రంగా హెచ్చరించారు. నాలుగున్నర గంటలకు ఆయన గుంటూరులోని తన నివాసానికి చేరుకున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నప్పటికీ అంబటి, వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిషిద్ధమైనప్పటికీ అంబటి ఖాతరు చేయకుండా ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో అంబటితో పాటు ర్యాలీలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

ఏ-6 ఉదయ్‌పై అంత ప్రేమెందుకో!

- 495 రోజులు విధులకు రాకున్నా.. ఉద్యోగం నుంచి తొలగించరా?
- యూసీఐఎల్ జీఎంకు వివేకా కుమార్తె ప్రశ్న



కడప, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో ఏ-6గా ఉన్న గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిపై యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్)కు ఎందుకంత ప్రేమని వివేకా కుమార్తె సునీతారెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆమె కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలో యూసీఐఎల్ జీఎం సుమన్ సర్కార్‌ను కలిశారు. అనంతరం బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. 'ఉదయ్‌కుమార్‌రెడ్డి 495 రోజులు విధులకు హాజరు కాలేదు. ప్రభుత్వ సెక్టారులో పనిచేసే ఉద్యోగులు అరెస్టయి రిమాండుకు వెళ్తే.. వారిని సస్పెండ్ చేయడం గానీ, విధుల నుంచి తొలగించడం గానీ చేస్తారు. కానీ దాదాపు 500 రోజులు ఉదయ్ విధులకు రాకపోయినా.. తొలగించలేదు. ఉదయ్‌కు ఎవరు వెనక నుంచి సపోర్టు చేస్తున్నారో తెలియడం లేదు. దీనిపై సీఎం చంద్రబాబును కలిసి వివరిస్తాం' అని సునీత తెలిపారు.

నకిలీ మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులకు విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మార్చి 5వరకు రిమాండ్ పొడిగించింది. నెల్లూరులోని కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సింథిల్‌కుమార్, టి.రమేశ్‌ను జైలు సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ముందు గురువారం హాజరుపరిచారు. వారికి మార్చి ఐదో తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

మద్యం కేసులో నిందితుల బెయిల్‌పై విచారణ వాయిదా


మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు 21వ తేదీకి వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారు ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది.

ఐఆర్ఆర్ కేసులో ఆళ్లకు సీఐడీ నోటీసు

అమరావతిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) కేసులో సీఐడీ అధికారులు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి గురువారం నోటీసు జారీ చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఫిర్యాదుతో చంద్రబాబుపై సీఐడీ కేసు నమోదు చేసింది. హెరిటేజ్ సంస్థకు సంబంధించిన భూముల కోసం ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పు చేశారని ఆయన ఆరోపించారు. ఈ కేసుపై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ జరుపుతోంది. ఈ కేసును మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్(వాస్తవాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం)గా పరిగణించి మూసివేస్తామని, దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టుకు తెలపాలంటూ దర్యాప్తు సంస్థ అధికారులు ఆళ్లకు నోటీసు ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.


ప్రమాణ స్వీకార
మహోత్సవ
శుభాకాంక్షలు
శ్రీ కుర్రా అప్పారావు గారు
గుంటూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ
(మిర్చి యార్డు) చైర్మన్
శ్రీ నారా లోకేష్ గారు
ఆం.ప్ర. ఐటి, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్,
మానవ వనరులు,విద్యాశాఖామాత్యులు
శ్రీ అనగాని సత్యప్రసాద్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవిన్యూ రిజిస్ట్రేషన్ & స్టాంప్ శాఖమంత్రివర్యులు
రేపల్లె శాసనసభ్యులు
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సులు మరియు
ఐటి & విద్యాశాఖామాత్యులు శ్రీ నారా లోకేష్ గారి ప్రోత్సాహంతో... మాకు అత్యంత ఆత్మీయులు,
సన్నిహితులు, మా శ్రేయోభిలాషి శ్రీ కుర్రా అప్పారావు గారు
నేడు గుంటూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటి (మిర్చి యార్డు) చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయుచున్న
శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ...
విజయ్ కుమార్ ఎక్స్‌పోర్ట్స్, గుంటూరు
విజయ్ రాజ్ కుమార్ ఎక్స్‌పోర్ట్స్, గుంటూరు
విజయ్ కుమార్ కోల్డ్ స్టోరేజ్ ప్రై.లి., ఫిరంగిపురం, రెపూడి
సంతోషి హసంతిక వీర్ కోల్డ్ స్టోరేజ్, యల్.యల్.పి.
హై స్పిరిట్జ్ ఫ్యామిలీ రెస్టో బార్
మీ
కందుకూరి వీరయ్య
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు


ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
రైతుల సమస్యలపై అపార అనుభవమున్న
రైతుబిడ్డ, స్నేహశీలి, పరోపకారి
మాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులైన
శ్రీ కుర్రా అప్పారావు గారు
గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నేడు
ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా
ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ తరపున
మా హృదయపూర్వక శుభాభినందనలు.
వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను
అధిరోహించాలని ఆకాంక్షిస్తూ...
శ్రీ కుర్రా అప్పారావు గారు
గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్
యమ్.వి.సత్యనారాయణ
గుంటూరు స్పిన్నింగ్ మిల్స్ ప్రై.లి.
యన్. వేణుగోపాలరావు
శ్రీ నూకల రామకోటేశ్వరరావు టెక్స్‌టైల్స్ ప్రై.లి.
కె. వి. ప్రసాద్
కె.కె. స్పిన్‌టెక్స్ ఇండియా ప్రై. లి.
కె. ఆంజనేయులు
సుప్రియ స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
జి. రామలింగేశ్వరరావు
రంగనాయక స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
డి. చంద్రశేఖర్
విశ్వతేజ స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
అరవపల్లి కృష్ణమూర్తి
నెక్స్ జెన్ ఫ్యాబ్రిక్స్
వి. బలరామయ్య
బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
మిట్టపల్లి శ్రీనివాస చక్రవర్తి
మిట్టపల్లి స్పిన్నర్స్ ప్రై. లి.
రాయని రమణ
కె. హరిబాబు
ప్రసూన వంశీ కృష్ణ స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
పి. వెంకట స్వామి
రమ్య స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
పి. రాఘవరావు & పి. కోటి రావు
తిరుమల కాటన్ & ఆగ్రో ప్రొడక్స్ (ప్రై) లి.
దండా బ్రహ్మానందం
జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్ ప్రై. లి.
ఒ. జనార్ధన రెడ్డి
శ్రీ మంజునాధ స్పిన్నింగ్ మిల్స్ ప్రై. లి.
బి. ఉమా మహేశ్వరరావు
రాయని స్పిన్‌టెక్స్ ప్రై. లి.
పి. శివ శంకరరావు &
పి. చలపతిరావు
పచ్చల స్పిన్‌టెక్స్ ప్రై. లి.
ఐ. దానా రెడ్డి
అజంతా స్పిన్‌టెక్స్ ప్రై. లి.
యమ్. కళ్యాణ్ శ్రీనివాసరావు
విహాన్ టెక్స్‌టైల్స్
జి. శేఖర్ కుమార్ &
జి. సాయిరాం
భరణి వైబ్రంట్ ప్రై.లి.
జి. పూర్ణ చంద్రశేఖరరావు
శ్రీ మౌళి స్పిన్‌టెక్స్ ప్రై. లి.
సామినేని కోటేశ్వరరావు, ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్
KALYANI ADS


ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
మంచితనానికి, మమకారానికి
మారుపేరుగా నిలిచిన సుగుణ సంపన్నులు,
పరోపకారి, ఆదర్శనీయులు,
మాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులైన
శ్రీ కుర్రా అప్పారావు గారు
ఆసియాలోనే అతిపెద్దదైన
"గుంటూరు మార్కెట్ యార్డు" ఛైర్మన్‌గా నేడు
ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా
పి.యన్.ఆర్. మిత్రమండలి తరపున
మా హృదయపూర్వక శుభాభినందనలు.
వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను
అధిరోహించాలని ఆకాంక్షిస్తూ...
శ్రీ కుర్రా అప్పారావు గారు
గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్
పారుపల్లి నాగేశ్వర రావు (పి.యన్.ఆర్) మిత్ర మండలి, గుంటూరు
వసంత కృష్ణ ప్రసాద్
మైలవరం శాసన సభ్యులు
సామినేని కోటేశ్వరరావు
చుక్కపల్లి రమేష్
మన్నవ సుబ్బారావు
మైనేని రాంప్రసాద్ బ్రదర్స్
గోరంట్ల పున్నయ్య చౌదరి
వడ్లమూడి నాగేంద్రం
గుంటుపల్లి కోటేశ్వరరావు
జి.యల్. నరసింహరావు
(యూఫోం, విజయవాడ)
నెలకుదిటి నరహరి ప్రసాద్
ఘంటా పున్నారావు
సూర్యదేవర రవీంద్రనాథ్
(చినబాబు)
మాఘం సురేంద్రబాబు
కొడాలి వీరభద్రరావు
పాములపాటి శ్రీనివాసరావు
KALYANI ADS


ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
రైతులు మేలు కోరుకునే సుగుణ సంపన్నుడు, మృదుభాషి, ప్రియమైన మా మేనల్లుడు
టిడిపి సీనియర్ నాయకుడు శ్రీ కుర్రా అప్పారావు గారు
ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ది. 20-02-2026 శుక్రవారం
సాయంత్రం 5 గంటలకు గుంటూరు స్తంభాల గరువులోని చేబ్రోలు హనుమయ్య గ్రౌండ్స్ నందు
ప్రమాణ స్వీకారం చేయుచున్న శుభసందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షిస్తూ...
ఇంతటి ఉన్నత బాధ్యతలను అప్పజెప్పిన ప్రియతమ
ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి,
యువనాయకులు శ్రీ నారా లోకేష్ గారికి కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాం.
శ్రీ కుర్రా అప్పారావు గారు
గుంటూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్
సామినేని కోటేశ్వరరావు
సామినేని ఫణికుమార్
సామినేని సురేంద్ర
శ్రీ అనంత లక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్
KALYANI ADS

మసీదుల వద్ద సదుపాయాలు కల్పించండి

● ఎమ్మెల్యే నసీర్



మసీదు వద్ద గంజి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో మసీదులు వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు అధికారులు నిరంతరం పనిచేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. మసీదులో గురువారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన పేదలకు గంజి పంపిణీ చేశారు. రంజాన్‌మాసంలో మసీదుల వద్ద విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు గంట ముందుగా వెళ్లేందుకు అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తరగని స్ఫూర్తి శివాజీ

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ

● నగరంలో వేడుకగా శోభాయాత్ర



సభలో మాట్లాడుతున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ, పాల్గొన్న హిందూ చైతన్య వేదిక సభ్యులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వరాజ్యం కోసం ఛత్రపతి శివాజీ చేసిన ఉద్యమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. శివాజీ 396వ జయంతి సందర్భంగా గురువారం నగరంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న సారిక మైదానం నుంచి ప్రారంభమై నగరంపాలెం, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, లక్ష్మీపురం, వాజ్‌పేయి సర్కిల్ వరకు సాగి కొరిటెపాడు పార్కు వరకు ముగిసింది. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య జిల్లా అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి, కన్నెగంటి నాగార్జున, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లి వ్యవసాయమార్కెట్‌లో ఆర్వోవాటర్ ప్లాంట్లను గురువారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించగా, కార్యక్రమంలో ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టండి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసం సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలు, తాగునీటి వసతులు కల్పించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. రంజాన్ నెల ఆరంభమైన సందర్భంగా ముస్లింలకు ఆమె గురువారం శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదుల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

● ఘనంగా మిర్చి యార్డు ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

మిర్చియార్డు ఛైర్మన్‌గా నియమితులైన కుర్రా అప్పారావు, డైరెక్టర్ల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీనివాసరావుపేటలోని నియోజకవర్గ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్స్‌కు చేరుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్దపీట

గుంటూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బడ్జెట్లో బీసీలకు పెద్దపీట వేయడం హర్షణీయమని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల అభ్యున్నతి లక్ష్యం గా సీఎం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి ముందడుగన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి బీసీ సంక్షేమానికి రూ.47,456 కోట్లను కేటాయించగా, ఈ ఏడాది అదనంగా రూ.3,665 కోట్లను పెంచడం హర్షణీయమన్నారు.

జగన్ పాలనలో బ్రాహ్మణలకు తీవ్ర అన్యాయం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో బ్రాహ్మణ కుటుంబాలు సంతోషానికి దూరమయ్యాయని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌పై వైసీపీ నాయకుడు, దేవదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఏ ప్రభుత్వ హయాంలో బ్రాహ్మణులకు మేలు జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు.